S TV SAMAYAM


epaper.samayamdaily.net
APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

సంపుటి: 19 | సంచిక: 88 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 17 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

## స్వర్ణచంద్రగిరికి ప్రణాళికలు

నారావారి పల్లె తరహాలో సుస్థిరాభివృద్ధి అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



# అతిపెద్ద రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయం

- ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్
- ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ కాంబినేషన్‌తో ఏపీఫస్ట్ ఏర్పాటు
- ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం చంద్రబాబు సమావేశం



**అమరావతి:** యువతరం భవిష్యత్తును తీర్చిదిద్దేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని... ఆ దిశగా వారికి అన్ని విధాలా సహకరించేలా రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు భవిష్యత్తులో ఏయే రంగాల్లో అవకాశాలు ఉంటాయో గుర్తించడంతో పాటు...ఆయా రంగాల్లో వారిలో నైపుణ్యాన్ని పెంచడంపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఏరో స్పేస్-డిఫెన్స్, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారులతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో డ్రోన్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో తిరుపతి కేంద్రంగా అతిపెద్ద రీసెర్చ్ కేంద్రం

మిగతా 5 లో





# రాష్ట్ర అభివృద్ధి కోసమే నా ఆరాటం

### ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు యూనివర్సిటీ మంజూరు

- బాసర ఐఐటీలో క్యాంపస్ ఏర్పాటు చేస్తాం
- నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు
- ఆదిలాబాద్ విమానాశ్రయానికి ప్రధానితో శంకుస్థాపన
- పనుల కోసమే ప్రధాని మోడీతో భేటీ అవుతూనే ఉంటా
- తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్ట్ కట్టి తీరుతాం
- కేసీఆర్ అప్పులతో తెలంగాణ కుప్పయ్యింది
- అభివృద్ధి కోసం ఆశీర్వదించండి..మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆదరించండి
- నిర్మల్ సభలో సీఎం రేవంత్

**ఆదిలాబాద్/నిర్మల్, జనవరి 1:** పాలమూరు జిల్లాతో సమానాంగా ఆదిలాబాద్ జిల్లాకు నిధులు మంజూరు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల అనంతరం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. నిర్మల్ ప్రజలు ఇచ్చిన భరోసా, మద్దతు వల్లే సీఎం అయ్యాను. ఆదిలాబాద్ జిల్లా పోరాటానికి, పౌరుషానికి గడ్డ అంటూ..

మిగతా 2 లో

పదేళ్లలో అప్పులు తప్ప
## అభివృద్ధి లేదు
ఫామ్‌హౌస్‌లో ఉంటూ
రాజకీయాలతో తెలంగాణకు నష్టం
అభివృద్ధికి అడ్డుపడుతున్నారు: సీఎం



# ఇదే లాస్ట్‌చాన్స్!

### లేకుంటే మేమే నిర్ణయం తీసుకుంటాం
### అసెంబ్లీ స్పీకర్‌కు సుప్రీం కోర్టు కీలక ఆదేశాలు

ఎమ్మెల్యేల ఫిరాయింపు అంశంపై తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది.

2

మళ్లీ తిరిగి ఇందూరుగా
# మార్చి తీరుతాం

నిజామాబాద్‌లో కాషాయ జెండా ఎగరేస్తాం
రాముడికి బీజేపీ సభ్యత్వం ఉందంటూ
ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్య

3



## మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం

- ఎల్‌అండ్‌టీ నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ



హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ముందుగా మెట్రో మొదటి దశను ఎల్‌అండ్‌టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు.

.. వివరాలు 3లో




## హాట్‌ఎయిర్ బెలూన్ ఫెస్ట్

మంత్రి జూపల్లి గగన విహారం
తెలంగాణలో తొలిసారిగా నిర్వహణ

3



## నోట్ల కట్టల కేసులో జస్టిస్‌కు చుక్కెదురు

దర్యాప్తు చట్టబద్ధతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం

.. వివరాలు 2లో

ధరణి, భూభారతి కుంభకోణంలో
# 15మంది అరెస్ట్

- నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం
- మరో 9 మంది పరారీలో ఉన్నట్టు పోలీసుల వెల్లడి

2



## 'స్టార్టప్ ఇండియా' విప్లవం

రాబోయే పదేళ్లలో అగ్రగామిగా భారత్
కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన యువతకు లేదు
'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ

రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభా గాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తా యని ఆయన పేర్కొన్నారు.

4



బీజేపీ అధ్యక్ష ఎన్నికకు
## రంగం సిద్ధం

19న నామినేషన్..
20 ఎన్నికల ప్రక్రియ

4



## ఏడాది తిరక్కుండానే మళ్లీ బాదుడు

- ఆదాయార్జనే ధ్యేయంగా పావులు కదుపుతున్న చంద్రబాబు సర్కారు
- భూముల విలువ తగ్గితే క్రయ విక్రయాలపై తీవ్ర ప్రభావం
- రియల్ ఎస్టేట్ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం

.. వివరాలు 5లో



# రాష్ట్ర అభివృద్ధి కోసమే నా ఆరాటం

మొదటి పేజీ తరువాయి

జల్, జంగల్, జమీన్ అంటూ కుమురం భీం కొట్లాడారని అన్నారు. ఈ జిల్లాలో జరగాల్సినంత అభివృద్ధి జరగలేదు. బాసర ట్రిపుల్ ఐటీలోనే యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం. జిల్లాలోని ప్రజాప్రతినిధులంతా ఇందుకు సహకరించాలి. పారిశ్రామికంగానూ ఆదిలాబాద్‌ను అభివృద్ధి చేస్తాం. జిల్లాకు ఎయిర్ బస్ తీసుకొస్తాం. ఎయిర్‌పోర్టు కోసం 10వేల ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. విమానాశ్రయం ప్రారంభోత్సవానికి ప్రధాని మోదీని ఆహ్వానిద్దాం. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టాల్సిందే.. ఆదిలాబాద్ జిల్లాకు నీరు ఇవ్వాల్సిందే. ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రధాని వద్దకు వెళ్తున్నాం. ఆయనకు ఇవ్వాల్సిన గౌరవం ఇచ్చి.. అడగాల్సిన ప్రాజెక్టులు అడుగుతున్నాం. మోదీని పదే పదే కలుస్తున్నానని కొంత మంది విమర్శిస్తున్నారు. రాష్ట్రానికి నిధులు, ప్రాజెక్టులు ఎవరు ఇస్తారు.. ప్రధాని కాదా? ప్రధానిని కలవకపోతే నిధులు, ప్రాజెక్టులు ఎలా వస్తాయి. పదేళ్ల పాటు కేంద్ర ప్రభుత్వాన్ని గత ప్రభుత్వం అడగలేదు. అడగకపోతే రాష్ట్రానికి ఏం కావాలో కేంద్రానికి ఎలా తెలుస్తుంది. పైరవీలు చేయను.. పర్సనల్ ఎంజెడా లేదు.. రాష్ట్ర అభివృద్ధి కోసం, నిధుల కోసం.. ప్రధాని మోదీ, అమిత్ షా సహా ఎవరినైనా కలుస్తానని అన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు.. ఆ తర్వాత అభివృద్ధే అందరి లక్ష్యం. పదేళ్లు అధికారంలో ఉన్న వారు ఈ ఆలోచన చేయకపోవడం వల్లే.. తెలంగాణకు తీరని నష్టం జరిగిందని పరోక్షంగా కెసిఆర్ తీరుపై మండిపడ్డారు.. రాష్ట్ర భాజపా నేతలు కూడా ప్రధాని మోదీని కలిసి రాష్ట్రానికి ప్రాజెక్టులు, నిధులు తేవాలి. నిర్మల్ జిల్లాకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ మంజూరు చేస్తున్నాం. నాగోబా జాతరకు రూ.22కోట్లు మంజూరు చేసి అభివృద్ధి చేస్తాం. సమ్మక్క-సారలమ్మ జాతరకు రూ.300 కోట్లు కేటాయించి పునర్నిర్మాణం చేశాం. ప్రపంచ పెట్టుబడులకు హైదరాబాద్ స్వర్గధామంగా మారిందన్నారు. పెట్టుబడుల కోసం మేం ప్రయత్నిస్తుంటే.. స్థిరాస్తి వ్యాపారం చేస్తున్నామని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. పదేళ్లు అధికారాన్ని అనుభవించి రూ.8లక్షల కోట్లు అప్పు చేశారు.. రూ. వేల



కోట్లు దోపిడీ చేశారని కెసిఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. భూసేకరణ కు నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు వర్శిటీ లేదని.. ఈ ప్రాంతానికి వర్సిటీ మంజూరు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. త్వరలో వర్సిటీ మంజూరు అవుతుందన్నారు. బాసర వర్సిటీ ఏర్పాటు చేసుకుంటున్నామని.. దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. ఆదిలాబాద్ వర్సిటీ బాసరలో ఏర్పాటు చేస్తున్నామని.. ఉమ్మడి జిల్లా కు కావాల్సిన నిధులను బ్జడెట్ లో ప్రవేశ పెట్టుతామన్నారు.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాణహిత చేవెళ్ల పై నివేదిక తయారు చేస్తున్నామని.. తుమ్మడి హెట్టీ వద్ద ప్రాజెక్టు కట్టి తీరుతామని స్పష్టం చేశారు. ప్రతి నీటి చుక్కని ఒడి పట్టుతామన్నారు.. ఆదిలాబాద్‌కు ఎయిర్ పోర్ట్ తీసుకొచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. మోడీ చేతుల మీదుగా ఆదిలాబాద్ ఎయిర్ పోర్టు శిలాఫలకం వేయిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు వచ్చాక రాజకీయం.. ఎన్నికల తర్వాత అభివృద్ధికి కలిసి నడుద్దామన్నారు. ప్రతి మూడు నెలలకు సారి కేంద్రాన్ని కలుస్తాం.. మీరు సైతం నా దగ్గరకు రండి.. సాధ్యం అయినంత పనులు చేస్తామని ప్రతిపక్ష నేతలకు సీఎం తెలిపారు. మోడీ నాకు చుట్టం కాదు దేశానికి ప్రధాని కాబట్టి మన ప్రాంతం అభివృద్ధి కావాలి కాబట్టి మోడీని కలుస్తున్నానని చెప్పారు. ప్రాంత అభివృద్ధి కోసం ఎవ్వెర్నినా కలుస్తా. పైరవీలు లేవు, పర్సనల్ పనులు నాకు లేవని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం వరంగల్ ఎయిర్ పోర్టు వచ్చింది. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఇస్తాం అని చెప్పినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 'ఇవ్వన్నీ అడిగనిదే ఇవ్వరు. గత పాలకులు అడగకపోవడంతో ఈ పరిస్థితి వచ్చింది. వాళ్ల తప్పులకు ఇప్పుడు అప్పులు మిగిలాయి. ఆ ప్రభుత్వంలో ఇచ్చిన బియ్యం ఎవ్వరైనా తిన్నారా..? కాని మేము ఇచ్చే సన్న బియ్యం తింటున్నారు. నాడు పావలా వడ్డీ లేదు సున్నా వడ్డీ లేదు.. గుండు సున్నా మిగిల్చారు. వెయ్యికోట్ల భూమి మహిళలకు కేటాయించాం..రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితి వల్ల క్రమక్రమంగా అభివృద్ధి చేసుకుందాం.. రాష్ట్ర ప్రజలు అండగా నిలవండి, దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతా.. త్వరలో మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయి? ప్రజా ప్రభుత్వంతో కలిసి పని చేసే వారిని గెలిపించండి.. కేవలం ఎన్నికల అప్పుడే రాజకీయాలు, అభివృద్ధికి అందరం ఒకటే..' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# పదేళ్ల పాలనలో అప్పులు తప్ప అభివృద్ధి లేదు

**నిర్మల్, జనవరి 16:** ఆదిలాబాద్ జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అత్యంత వెనుకబడిన ఈ జిల్లాకు ఆశించిన న్యాయం జరగలేదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శక్రవారం పర్యటించిన సిఎం రూ.386.46 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. హాతిఘాట్‌లో చనాకా - కొరాట బ్యారేజ్ పంప్‌హౌస్ ప్రారంభించారు. సదర్మట్ బ్యారేజ్‌ను జాతికి అంకితం చేశారు. యాసంగి పంటకు నీరు విడుదల చేశారు. పొన్కల్ దగ్గర గోదావరి నదిపై సదర్మట్ బ్యారేజ్ నిర్మాణాన్ని ప్రారంభించారు. రూ.676 కోట్లతో ప్రభుత్వం సదర్మట్ బ్యారేజ్ నిర్మాణం చేపట్టిందని సీఎం ప్రసంగించారు. ఈ బ్యారేజ్ ద్వారా 18 వేల ఎకరాలకు సాగునీరును ప్రభుత్వం అందించనుందన్నారు. కేసీఆర్ హయాంలో చిత్తశుద్ధిగా పనిచేసి ఉంటే చనాక - కొరాట ప్రాజెక్టు ఎప్పుడో పూర్తయ్యేదని తెలిపారు. చనాక - కొరాట, సదర్మట్ బ్యారేజీలు గత పదేళ్లలో పూర్తికాలేదని ఈ సందర్భంగా సీఎం చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే అవసరమైన నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేశామని వెల్లడించారు. కాళేశ్వరానికి రూ.లక్షా 10 వేల కోట్లు ఖర్చుచేసినా.. చుక్కనీరు రాలేదని విమర్శించారు. రైతులకు నీరు రావాలంటే తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన పక్రియ ప్రారంభమైందని పేర్కొన్నారు. ఒక్కొక్కటిగా సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకెళ్తున్నామని తెలిపారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. నాటి పాలకులు చేసిన అప్పులే ఇప్పుడు ఉరి తాడు అయ్యాయి. మేం ఫ్యూచర్ సిటీ అంటే మమ్మల్ని రియల్ ఎస్టేట్ బ్రోకర్స్ అంటున్నారు' అని ప్రతిపక్షాలనుద్దేశించి అన్నారు ముఖ్యమంత్రి.'పదేళ్ల పాలనలో ఏమిచేయని వ్యక్తి ప్రజాపాలనను భరించలేక పోతున్నారు. 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఉన్న వ్యక్తి ఇలాగేనా మాట్లాడేది. చేతనైతే మమ్మల్ని ఆశీర్వదించండి.. లేకుంటే ఫామ్‌హౌస్‌లోనే ఉండండి. మారీచుడు, సుగ్రీవుడు తరహాలో రాక్షసుల్లా.. అభివృద్ధికి అడ్డుపడుతున్నారు. శుక్రాచార్యుడిలా ఫామ్‌హౌస్‌లో ఉన్న వ్యక్తి ప్రోత్సహిస్తున్నారు. పదేళ్లు అధికారంలో ఉండి రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారు. బీఆర్ఎస్ నేతలకు అభివృద్ధి అంటే ఇష్టం లేకపోతే ఫామ్‌హౌస్‌లో విశ్రాంతి తీసుకోవచ్చు. బావాబామ్మర్దులు అభివృద్ధిని అడ్డుకుంటున్నారు. మొన్న పంచాయతీ ఎన్నికల్లో 66శాతం కాంగ్రెస్ సర్పంచ్‌లను గెలిపించారు ప్రజలు. వారి నమ్మకాన్ని వమ్ము చేయం. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోనూ మంచి వాళ్లను



ఎన్నుకోండి. సమస్యలను పరిష్కరించే వాళ్లను, ప్రజా ప్రభుత్వంతో కలిసి పనిచేసిన వాళ్లనే గెలిపించుకోండి. నేను ఓడిపోయిన వాళ్ల గురించి మాట్లాడను. మేం పాలకులం కాదు.. సేవకులం. మీ మనసు గెలుస్తాం.. రాబోయే ఎన్నికల్లో విజయం సాధిస్తాం. 2038వరకు అధికారంలో ఉంటాం' అని సీఎం రేవంత్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



# ఫిరాయింపు ఎమ్మెల్యేల వ్యవహారం

- స్పీకర్‌కు మరో రెండు వారాల గడువు
- విచారణ సందర్భంగా సుప్రీం వెల్లడి

**న్యూఢిల్లీ, జనవరి 16:** బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ వాయిదా పడింది. రెండు వారాల తరువాత ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హతపై అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చేపట్టిన పక్రియపై అఫిడవిట్ దాఖలు చేయాలని ధర్మాసనం ఆదేశించింది. అయితే 4వారాల సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ న్యాయస్థానాన్ని కోరారు. ఈ కేసులో పురోగతిని పరిశీలించి అవసరమైతే మరో రెండు వారాల గడువు పెంచుతామని ధర్మాసనం స్పష్టం చేసింది. శుక్రవారం ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌ల ధర్మాసనం ముందు ఈ కేసు విచారణకు వచ్చింది. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన 10మంది ఎమ్మెల్యేలలో ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని.. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేలపై నిర్ణయానికి కొంత సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది కోరారు. స్పీకర్‌కు కంటి శస్త్ర చికిత్స జరగడంతో ఆస్పత్రిలో ఉ



న్నారని, కొత్త అసెంబ్లీ సెక్రటరీ జనరల్ వచ్చినందున పక్రియ ఆలస్యమైందని న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టుకు నివేదించారు. ఇప్పటివరకు స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను నివేదిక రూపంలో ఆయన కోర్టుకు సమర్పించారు. మిగతా ముగ్గురు సభ్యులపై నిర్ణయం తీసుకునేందుకు నాలుగు వారాల సమయం కావాలని ధర్మాసనానికి స్పీకర్ తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. త ఏడాదిగా ఇదే చెబుతున్నారని బీఆర్ఎస్ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గతంలో మూడు నెలల్లోనే ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించినా పట్టించుకోలేదని పాడి కౌశిక్ రెడ్డి తరఫు న్యాయవాది శేషాద్రి నాయుడు న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ నిర్ణయం తీసుకున్నారని, మిగిలిన ముగ్గురిపై నిర్ణయం తీసుకునేందుకు సమయం కావాలని స్పీకర్ తరఫు న్యాయవాది అభిషేక్ మనుసింఘ్వీ కోర్టును కోరారు. అయితే రెండు వారాలు సమయం ఇస్తున్నామని.. రెండు వారాల్లో స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నారో కోర్టుకు చెప్పాలని ధర్మాసనం ఆదేశించింది. ఆ తరువాత అవసరం అయితే మరో రెండు వారాలు సమయం ఇస్తామని సుప్రీం కోర్టు ధర్మాసనం చెబుతూ.. తదుపరి విచారణను వాయిదా వేసింది. ఫిరాయింపు ఎమ్మెల్యేలపై విచారణ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తరఫున అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఇప్పటికే ఏడుగురు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌లపై స్పీకర్ నిర్ణయం ప్రకటించారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేల అనర్హత వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ మసీహ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్ తీసుకున్న చర్యలపై ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ నివేదిక అందించారు. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.



# కన్యాకుమారిలో రోడ్డు ప్రమాదం

## లక్షెట్టిపేటకు చెందిన దంపుతల దుర్మరణం

**మంచిర్యాల, జనవరి 16:** తమిళనాడులోని కన్యాకుమారి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణకు చెందిన దంపతులు మరణించారు. అయ్యప్ప మాల ధరించిన వారు.. శబరిమలకు వెళ్లొస్తుండగా ఈ దారుణం జరిగింది.వివరాల్లోకి వెళ్తే.. మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన పాలకుర్తి సత్యనారాయణ (63), రమాదేవి (59) జనరల్ స్టోర్ నిర్వహిస్తున్నారు. ఇటీవల అయ్యప్ప మాల ధరించిన ఈ దంపతులు జనవరి 8వ తేదీన ఓ ప్రైవేటు సర్వీస్‌లో శబరిమల దర్శనానికి వెళ్లారు. జనవరి 15వ తేదీన మకర సంక్రాంతి రోజున అయ్యప్ప స్వామి దర్శనం చేసుకుని తిరిగి బయల్దేరారు. ఈ క్రమంలో కన్యాకుమారి సమీపంలో బైపాస్ రోడ్డులో బస్సును ఆపారు. అక్కడ సముద్ర స్నానం చేసుకుని దేవాలయాలు సందర్శించుకుని బస్సు దగ్గరకు వస్తుండగా వారికి ఓ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దంపతులిద్దరూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కన్యాకుమారి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఎన్నిసార్లయినా విచారణకు పిలుస్తాం

## పైలట్ల నోటీసులపై ఏఏఐబీ అధికారుల స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, జనవరి 16:** అహ్మదాబాద్ విమాన ప్రమాదం కేసులో పైలట్ మేనల్లుడికి 'విమాన ప్రమాదాల దర్యాప్తు బ్యూరో' సమన్లు జారీ చేయడాన్ని ఖండిస్తూ పైలట్ల సమాఖ్య ఏఏఐబీకి లీగల్ నోటీసులు ఇచ్చింది. ఈ వ్యవహారంపై ఏఏఐబీ అధికారులు స్పందించారు. విమాన ప్రమాదంపై దర్యాప్తు విషయంలో తాము చట్టప్రకారంగానే వ్యవహరించామన్నారు. ప్రమాదంపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్న సమయంలో వాస్తవాలను తెలుసుకోవడానికి అన్ని విషయాలపైనా దృష్టిపెట్టాల్సి ఉంటుందన్నారు. అందుకు ఎవరినైనా విచారించే అధికారం తమకు ఉందన్నారు. దర్యాప్తునకు ఉపయోగపడతారని అనిపిస్తే ఎవరినైనా, ఎన్నిసార్లు అయినా పిలుస్తామని వెల్లడించారు. ఇవి వేధింపుల కిందకు రావని స్పష్టం చేశారు. గత ఏడాది జూన్ 12న జరిగిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృతి చెందిన వారిలో కెప్టెన్ సుమిత్ సభర్వాల్, కో-పైలట్ క్లైవ్ కుందర్ కూడా ఉన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సుమిత్ మేనల్లుడు కెప్టెన్ వరుణ్ ఆనంద్‌కు ఏఏఐబీ ఇటీవల సమన్లు జారీ చేసింది. జనవరి 15న విచారణకు హాజరుకావాలని ఆదేశించింది. ఎయిరిండియాలో పైలట్‌గా పనిచేస్తున్న వరుణ్ ఆనంద్.. 'భారత పైలట్ల సమాఖ్య' లో సభ్యుడిగా ఉన్నారు. ఏఏఐబీ నోటీసులను పూర్తి అనవసరమైన చర్యగా ఎఫ్ఐపీ పేర్కొంది. ప్రమాదంతో ఎలాంటి సంబంధం లేని కెప్టెన్ వరుణ్ ఆనంద్‌ను పిలిపించడం అనవసరమని ఇది వేధింపులకు పాల్పడటం, మానసిక క్షోభకు గురిచేయడమే అవుతుందని పైలట్ల సమాఖ్య ఏఏఐబీకి పంపిన నోటీసులో పేర్కొంది.

# నోట్ల కట్టల కేసులో జస్టిస్ యశ్వంత్‌వర్మకు చుక్కెదురు

## దర్యాప్తు చట్టబద్ధతపై సవాల్‌ను తిరస్కరించిన సుప్రీం

**న్యూఢిల్లీ, జనవరి 16:** నోట్ల కట్టల కేసులో న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మకు మ-రోసారి ఎదురుదెబ్బ తగిలింది. తనను తొలగించాలని కోరుతూ వచ్చిన తీర్మానాన్ని లోక్‌సభ స్పీకర్ ఆమోదించడంతోపాటు తనపై దర్యాప్తు కోసం ఏర్పాటుచేసిన పార్లమెంటరీ ప్యానల్ చట్టబద్ధతను సవాల్ చేస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ కేసుకు సంబంధించిన తీర్పును జనవరి 8న రిజర్వ్ చేసిన జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మలతో కూడిన ధర్మాసనం నేడు వెలువరించింది. గతేడాది జస్టిస్ యశ్వంత్‌వర్మ దిల్లీ హైకోర్టులో సేవలందిస్తున్నప్పుడు తన అధికారిక నివాసంలో పెద్దఎత్తున నోట్లకట్టలు లభ్యమయ్యాయి. దానిపై అంతర్గత త్రిసభ్య సంఘం విచారణ జరిపింది. అది ఇచ్చిన నివేదిక నేపథ్యంలో పదవి నుంచి వైదొలగాల్సిందిగా సుప్రీంకోర్టు సూచించింది. ఆయన దానికి అంగీకరించకపోవడంతో పార్లమెంటులో అభిశంసనకు ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టుకు వెళ్లిన జస్టిస్ వర్మకు అక్కడ మళ్లీ చుక్కెదురైంది.

# ధరణి, భూభారతి కుంభకోణంలో 15మంది అరెస్ట్

## నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం

## మరో 9 మంది పరారీలో ఉన్నట్టు పోలీసుల వెల్లడి

**వరంగల్, జనవరి 16:** తెలంగాణలో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణంలో 15 మందిని అరెస్టు చేసినట్టు వరంగల్ కమిషనర్ సన్ ప్రీత్‌సింగ్ తెలిపారు. మరో 9 మంది పరారీలో ఉన్నట్టు చెప్పారు. ప్రధాన నిందితులుగా బసవరాజు, జెల్లా పాండుగా గుర్తించాం. జనగామ, యాదాద్రి జిల్లాల్లో గతంలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయి. యాదగిరిగుట్టలోని ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ల ద్వారా మోసాలు జరిగాయన్నారు. రూ.3.90 కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడింది. వెబ్‌సైట్‌లో సాంకేతిక లోపాల ఆధారంగా లూటీ చేశారు. నిందితుల నుంచి రూ.63.19లక్షల నగదు స్వాధీనం చేసుకున్నాం. నిందితుల బ్యాంక్ ఖాతాల్లోని రూ.లక్ష సీజ్ చేశాం. రూ.కోటి విలువైన ఆస్తి పత్రాలు, కారు, ల్యాప్ టాప్‌లు, డెస్క్ టాప్‌లు, సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నాం. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ధరణి- భూ భారతి కేసులో మరిన్ని అరెస్టులు జరిగే అవకాశముందని సీపీ తెలిపారు. మొత్తం మూడు కోట్ల 72 లక్షల రూపాయల కుంభకోణం జరిగినట్టు పోలీసులు వెల్లడించారు. జనగామ, యాదాద్రి జిల్లాల్లో సంచలనం సృష్టించిన ధరణి, భూ భారతి కుంభకోణం కేసులో కీలక ఆధారాలు సేకరించారు పోలీసులు.

# మెట్రో రెండోదశకు కేంద్రం సుముఖం



- ఎల్అండ్‌టీ నుంచి టేకోవర్ లావాదేవీలు పూర్తి చేయండి
- రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి ఇద్దరేసి సభ్యులతో కమిటీ
- సీఎం రేవంత్‌కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ

**హైదరాబాద్, జనవరి 16:** హైదరాబాద్ మెట్రో రెండో దశ కోసం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ని కలిసి చర్చించానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ముందుగా మెట్రో మొదటి దశను ఎల్‌అండ్‌టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని, అందుకు అన్ని ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి చేయాలని సూచించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శుక్రవారం లేఖ రాశారు. ఈ లేఖలో హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతి గురించి ప్రస్తావించారు. అలాగే హైదరాబాద్ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి, రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో భాగంగా నగరంలో మెట్రో రెండో దశ పనులు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అనుమతి కోరిందని గుర్తుచేశారు. ఇప్పటికే అమలు జరుగుతున్న మొదటి దశ మెట్రోను ఎల్ అండ్ టీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, తామే నిర్వహిస్తామని ప్రకటించిందని ప్రస్తావించారు. లావాదేవీలు పూర్తయిన తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ గుర్తు చేశారని అన్నారు. మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నిర్ణయించారని కూడా కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తనకు తెలిపారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున మరో ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందుకోసం రాష్ట ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారుల పేర్లను పంపాలని కోరినట్లు కూడా వివరించారు. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ఎందుకు ప్రతిపాదించలేదని ప్రశ్నించారు. కావున సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే ఇద్దరు అధికారుల పేర్లను పంపి సమావేశ నిర్వహణకు ప్రయత్నం చేయాలని సూచించారు. అదేవిధంగా, వేగవంతంగా ఎల్ అండ్ టీ నుంచి మెట్రో నెట్‌వర్క్‌ను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఆ తర్వాత మెట్రో రెండో దశ నిర్మాణానికి కావాల్సిన ప్రతిపాదనలు కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేయాలని కిషన్‌రెడ్డి కోరారు.

# మళ్లీ ఇందూరుగా మార్చి తీరుతాం

- నిజామాబాద్‌లో కాషాయ జెండా ఎగరేస్తాం
- రాముడికి బీజేపీ సభ్యత్వం ఉందంటూ ఎంపీ ధర్మపురి అరవింద్ వ్యాఖ్య




**నిజామాబాద్, జనవరి 16:** నిజామాబాద్‌ని ఇందూర్‌గా పేర్కొన్న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆ పేరు ఎలా వచ్చిందో చారిత్రిక ఆధారాలు ఉన్నాయన్నారు. మీడియాలో మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజాం ఒక హంతకుడు.. నిజామాబాద్‌కి ఆయన పేరు ఎందుకు పెట్టుకుంటారన్నారు. ఇందూర్‌గా పేరు మార్చి ఆ తీర్మానాన్ని ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డికి పంపిస్తామన్నారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉ ందని అనుమానం ఉంటే వెళ్లి చూసుకోవాలని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌కు తెలిపారు. ముస్లిం అంటే కాంగ్రెస్ అంటున్నారు.. మీ పార్టీకి సున్తీ అయిందా పోయి చూసుకోవాలని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పహల్గాంలో హిందువులా? ముస్లింలా? అని చూసి కాల్చి చంపారని గుర్తు చేశారు. శ్రీరాముడికి బీజేపీ మెంబర్ షిప్ ఉందని అన్నారు. కొంత మంది హిందువుల్లో చెడ పుట్టారన్నారు. తెలంగాణ మొత్తం కాషాయమయం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ఎక్కడుందో కవితను అడిగితే చెబుతుందన్నారు.. రేపు సిరిసిల్లలో కూడా చూపిస్తామన్నారు. ఇందూర్‌కి దమ్ముంటే రా అని కేటీఆర్‌కి సవాల్ విసిరారు. చెన్నారెడ్డి సీఎంగా రాజీనామా చేసే వరకు రాష్ట్రంలో మత ఘర్షణలు జరిగాయని ఎంపీ అరవింద్ తెలిపారు. గొడవలకు కారణం కాంగ్రెస్.. అప్పట్లో సత్తయ్య ఏసీపీని చంపితే ఆ నిందితులను బయటకు తెచ్చింది మజ్లిస్.. తిన్న తిండి అరగక హిందూ దేవాలయాల మీద పడుతున్నారు.. దీనికి కారణం రేవంత్ రెడ్డి.. ఇచ్చేది దొంగ వాగ్దానాలు.. హిందూ దేవుళ్ళ మీద ఓట్లు.. గులాంలుగా మారి పోయి హిందువులను తాకట్టు పెడుతున్నారు.. నూటికి నూరు శాతం ఇందూర్ కార్పొరేషన్‌పై బీజేపీ జెండా ఎగురవేస్తాం.. నిజామాబాద్ పేరును ఇందూర్‌గా మారుస్తాం? తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తాం.. నిజాంను ఒకే సారి నేను గాడిద అని ఒక్కసారి అంటే దానిపై రాద్ధాంతం చేస్తున్నారు.. నిజాం చరిత్రలో దుర్మార్గమైన రాజు గానే మిగిలి పోతారు.. ఆయన పేరు చెబితే హిందువులకు గుర్తుకు వచ్చేది అయన చేసిన మారణకాండనే.. ముస్లింలకు అవాస్ యోజన కింద ఇల్లు, ఫ్రీ రేషన్, ఫ్రీ వ్యాక్సినేషన్ మోడీ ఇస్తున్నారు.. ముస్లిం దేశాలకు కూడా వ్యాక్సిన్ పంపించారు.. మీ పిల్లలకు విద్యా, వైద్యం ఇస్తుంది.. నిజాం అంత వెనుకోసుకొస్తున్నా.. రేవంత్ రెడ్డి ఏం చేశారని ఓట్లు వేస్తున్నారు.. ఇన్ని చేసినా మోడీకి ఎందుకు వేయడం లేదు.. ఇదేనా మీ ఇమాందారీ.. అని ఎంపీ వ్యాఖ్యానించారు.

# లక్ష్యం మేరకు ఉద్యోగాల కల్పన

**ఇప్పటికే 70వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ**

**గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మందికి**

**నియామక పత్రాలు అందించిన సీఎం రేవంత్**




**హైదరాబాద్, జనవరి 16:** తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ప్రాణ త్యాగాలతో సాధించుకున్నామని.. కానీ బీఆర్ఎస్ పాలనలో నిరుద్యోగుల ఆశలు నెరవేరలేదని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నిరుద్యోగుల జీవితాలతో బీఆర్ఎస్ పాలకులు ఆడుకున్నారని మండిపడ్డారు. ఈ పాలనలో వారు.. వారి స్వప్రయోజనాలే చూసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో ఓపిక నశించిన యువత.. కేసీఆర్‌ను ఇంటికే పరిమితం చేశారని వ్యంగ్యంగా పేర్కొన్నారు. శుక్రవారం శిల్పకళా వేదికలో కొలువుల పండగ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్బంగా సీఎం రేవంత్ రెడ్డి.. గ్రూప్- 3కి ఎంపికైన 1,370 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలకుల ఉద్యోగాలు పోతేనే మీకు ఉద్యోగాలు వచ్చాయన్నారు. పిల్లల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు ఎంతో కష్టపడుతున్నారని చెప్పారు. ఉద్యోగాలు ఇవ్వకూడదని కోర్టుల్లో కేసులూ వేశారన్నారు. అన్ని అవరోధాలు అధిగమించి ఉద్యోగాలు ఇస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్ 1 నియమకాలు చేపట్టలేదన్నారు. తాము వచ్చాక తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేశామన్నారు. యూపీఎస్సీ తరహాలోనే టీజీపీఎస్సీని సంస్కరించామని తెలిపారు. ఇప్పటి వరకు 70 వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని వివరించారు. గతంలో అర్హత లేనివారికి టీజీపీఎస్సీలో కీలక ఉద్యోగాలు ఇచ్చారంటూ బీఆర్ఎస్ పార్టీ నేతలపై సీఎం రేవంత్ నిప్పులు చేశారు. రాబోయే రోజుల్లో అన్ని ఉద్యోగ నియామకాలు పూర్తి చేస్తా.. రాజకీయపార్టీల చేతుల్లో ఆయుధాలుగా మారొద్దు. ఎవరూ మనకు చెప్పాల్సిన అవసరం లేదు.. నాకు సంపూర్ణ అవగాహన ఉంది. ప్రభుత్వంలోనే కాదు.. ప్రవేటు రంగంలో కూడా రూ.లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చి ప్రపంచంతోనే పోటీ పడే విధంగా యువతను తీర్చి దిద్దే బాధ్యత నాదని సీఎం హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రులు జూపల్లి తదిరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో తొలిసారిగా హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్

**పరేడ్ గ్రౌండ్‌లో ప్రారంభించిన మంత్రి జూపల్లి**




**హైదరాబాద్, జనవరి 16:** తెలంగాణలో తొలిసారిగా హా ట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. సికింద్రా బాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదికగా శుక్రవారం నుంచి 3 రోజుల పాటు ఈ షో జరుగనుంది. మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ హాట్ ఎయిర్ బెలూన్ షోను ప్రారంభించారు. ముందస్తుగా టికెట్లు బుక్ చేసుకున్న 300 మంది సందర్శకులకు హాట్ ఎయిర్ బెలూన్లలో రైడ్‌కు అనుమతి ఇవ్వనున్నారు. అలాగే సాధారణ ప్రేక్షకులకు నైట్ గ్లో షో ఓపెన్‌గా ఉండనుంది. హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్ టికెట్‌ను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసుకునే అవకాశం ఉ ంది. వయస్సు, రైడ్ రకాన్ని బట్టి ధరలు రూ.500 నుంచి రూ.1500 వరకు ఉండనున్నాయి. కాగా.. పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంక్రాంతి సందర్భంగా జనవరి 13 నుంచి 15 వరకు ఇంటర్నేషనల్ కైట్ / స్వీట్స్ ఫెస్టివల్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. పెద్ద సంఖ్యలో సందర్శకులు కైట్ ఫెస్టివల్‌లో పాలుపంచుకున్నారు. అలాగే జనవరి 16, 17 తేదీల్లో గచ్చిబౌలి స్టేడియంలో డ్రోన్ ఫెస్టివల్, సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ ఫెస్టివల్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇది హైదరాబాద్‌లో తొలి హాట్ ఎయిర్ బెలూన్ ఈవెంట్‌గా రికార్డు సృష్టిస్తోంది. పరేడ్ గ్రౌండ్‌లో సాయంత్రం 4 గంటల నుంచి రంగురంగుల బెలూన్లు ఆకాశంలో కనువిందు చేయనున్నాయి.



# రైతుల పంటలకు గిట్టుబాటు ధరల కల్పన

**వానాకాలం సీజన్‌లో కందుల కొనుగోళ్లు**

**లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యం**

**వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**

**ఖమ్మం, జనవరి16:** రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం కోసం తమ ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. వానాకాలం 2025-2026 సీజన్‌లో కందుల కొనుగోళ్లు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. శు క్రవారం.. ఖమ్మం జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటించిన ఆయన.. పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రైతులకు లాభదాయక ధర కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం, టీజీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఓ-ూఖ కొనుగోళ్లు ప్రారంభించిందని చెప్పుకొచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 4,99,393 ఎకరాల్లో కందులు సాగవుతున్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల. వాస్తవానికి సుమారు 2,99,635 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశామని తుమ్మల తెలిపారు. ఈ లెక్కన క్వింటాల్‌కు రూ. 8,000 ఓ-ూఖ నిర్ణయించామన్నారు. అయితే.. ప్రస్తుతం మార్కెట్ ధర రూ. 7,200 వరకు మాత్రమే ఉందని ప్రస్తావించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 1,71,310 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు అనుమతి ఇచ్చిందని వివరించారు. 2025 డిసెంబర్ 27 నుంచి 2026 మార్చి 26 వరకు కొనుగోళ్లు జరుగుతాయని వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం 82 కొనుగోలు కేంద్రాలను ప్రతిపాదించామని తెలిపారు. ఇప్పటికే 13 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు వివరించారు. జనవరి 16 నాటికి 32 మంది రైతుల నుంచి 30.25 మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరుగుతాయనే అంచనా వేశామని వెల్లడించారాయన.వీటి మొత్తం విలువ రూ. 0.24 కోట్లు ఉంటుందని అంచనా వేశామని పేర్కొన్నారు మంత్రి. నారాయణపేట జిల్లాలో కొనుగోళ్లు సజావుగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. ఆయా పంటల రాకల ఆధారంగా ఇతర జిల్లాల్లోనూ దశలవారీగా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అన్నదాతలు మధ్యవర్తులకు పంటను అమ్మొద్దని రైతులకు విజ్ఞప్తి చేశారు. టీజీ మార్క్‌ఫెడ్ కేంద్రాలకు మాత్రమే పంటను తీసుకు రావాలని సూచించారు. కొనుగోలు మొత్తాన్ని డీబీటీ ద్వారా నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయాలని అధికారులను ఆదేశించారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని తుమ్మల నాగేశ్వరరావు భరోసానిచ్చారు.

# వేములవాడ అభివృద్ధికి శ్రీకారం

**రాజన్న ఆలయ సందర్శనలో మంత్రి సీతక్క**



**వేములవాడ, జనవరి 16:** వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి శ్రీకారం చుట్టారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న అనుబంధ భీమేశ్వర ఆలయంలో స్వామి వారిని మంత్రి శుక్రవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి మీడియాతో మంత్రి మాట్లాడారు. వేములవాడలో భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఆలయాల అభివృద్ధి.. భావోద్వేగాలు, ఆచారాలతో ముడిపడి ఉంది. ఈనెల 18న మేడారంలో క్యాబినెట్ భేటీ జరుగుతుంది. 19న మేడారం ఆలయాన్ని సీఎం పునఃప్రారంభిస్తారు. పుష్కరాల దృష్ట్యా గోదావరి పరివాహక ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని సీతక్క తెలిపారు. కేసీఆర్ హయాంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జంక్షన్ అభివృద్ధికి శుక్రవారం శంకుస్థాపన చేశారు.

# తల్లి అంత్యక్రియల్లో పాల్గొననున్న ఇన్నయ్య

**తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిన కోర్టు**

**జనగామ, జనవరి 16:** యూపీఏ చట్టం కింద ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేసిన సామాజిక కార్యకర్త గాదె ఇన్నయ్యకు కోర్టు బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ఆయనకు షరతులతో కూడిన 48 గంటల తాత్కాలిక బెయిల్‌ను కోర్టు మంజూరు చేసింది. గాదె ఇన్నయ్య తల్లి థెరీసా (93) గురువారం రాత్రి మరణించారు. ఈ నేపథ్యంలో ఆయనకు కోర్టు ఈ బెయిల్ మంజూరు చేసింది. శనివారం జనగామ జిల్లాలోని జాఫర్‌గఢ్ మండలం సాగరంలో ఆయన తల్లి అంత్యక్రియలు జరగనున్నాయి. అందులో గాదె ఇన్నయ్య పాల్గొనున్నారు. ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత కాటా రామచంద్రారెడ్డి అలియాస్ వికల్ప్ మ-రణించారు. ఆయన అంత్యక్రియలకు మావోయిస్టు మాజీ నేత గాదె ఇన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా మావోయిస్టులకు అనుకూలంగా ఆయన వ్యాఖ్యలు చేయడం ద్వారా ప్రజలను.. ప్రేరేపించారే ఆరోపణలు వచ్చాయి. దీంతో ఉపా చట్టం కింద ఆయనపై ఎన్ఐఏ కేసు నమోదు చేసింది. ఆ క్రమంలో డిసెంబర్ 21న ఇన్నయ్యను ఎన్ఐఏ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను హైదరాబాద్‌లోని చంచల్‌గూడ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఆయన అక్కడే ఉన్నారు. మంగళవారం జనగామ జిల్లా జాఫర్‌గఢ్ మండల కేంద్రంలో గాదె ఇన్నయ్య నిర్వహిస్తున్న అనాథాశ్రమంలో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం విదితమే.




## సంపాదకీయం

# రాష్ట్రాల పురోగతి లక్ష్యంగా కేంద్ర బడ్జెట్!

మరో పక్షం రోజుల్లో కేంద్ర బడ్జెట్ ప్రకటించనున్నారు. ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్ మరోమారు బడ్జెట్ కసరత్తులో బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయా రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో చర్చించారు. ఆయా రాష్ట్రాల మంత్రులు వారివారి రాష్ట్రాల్లో ఉన్న అవసరాలను, నిధుల కేటాయింపులపై వినతిపత్రాలు సమర్పించారు. తెలుగు రాష్ట్రాల నుంచి భట్టి విక్రమార్క, పయ్యావుల కేశవుఉల హాజరై తమ అసవరాలను, ఆకాంక్షలను వెల్లడంచారు. అయితే ఏటా కేటాయింపులు చేస్తున్నా..ఇప్పటి వరకు ప్రకటించిన కేటాయింపులు, ఖర్చులపై స్పష్టత లేదు. ఏ పథకానికి ఎంత ఖర్చు చేశారో తెలియదు. అలాగే అన్ని రాష్ట్రాలను సమానంగా చూస్తూ కేటాయింపులు ఉండాలి. బడ్జెట్ అంటే అభివృద్ధి దివఘూ చర్యలు ఉండాలి. అనుకూల రాష్ట్రాలకు ఒక రకంగా, తమ పార్టీ పాలనలో లేని రాష్ట్రాలను మరో రకంగా చూసే విధానాలకు పాతరేయాలి. బడ్జెట్ అందరికి సమాన హక్కుగా ఉండాలి. అది దేశ ప్రగతిని ప్రతిఫలించాలి. తమకు మద్దు ఇస్తున్న పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు ఒక రకంగా, మిగతా రాష్ట్రాలను మరో రకంగా చూసు విధానం సరికాదు. మరికొద్ది రోజుల్లో పార్లమెంటు బ్జడెట్ సమావేశాలు జరగనుండగా, దానికి సన్నాహంగా ఇటీవల నిర్వహించిన ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రాల ఈ దైన్య స్థితి స్పష్టంగా వెలుగులోకి వచ్చింది. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కేంద్రంలో ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు సైతం నిధుల కోసం గళం విప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. తమ తమ రాష్ట్రాల్లో నెలకొన్న దుర్భర పరిస్థితులను వివరిస్తూ అదనపు నిధులు కావాలని, జిఎస్‌టి పరిహారం కొనసాగించాలని సమావేశంలోనే ఆ రాష్ట్ర ప్రభుత్వాలూ విజ్ఞప్తులు చేశాయి. పన్నుల వసూళ్లలో రాష్ట్రాల వాటా తగ్గిస్తూ, గ్రాంట్లు ఆలస్యం చేస్తూ, అప్పుల పరిమితులను కట్టడి చేస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరే రాష్ట్రాల ఈ దుస్థితికి కారణం. సిపిఎం నేతృత్వంలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కేరళ రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం మరింత కక్ష పూరితంగా వ్యవహరిస్తోంది. ఆర్థికంగా దిగ్బంధించడం ద్వారా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన ప్రభుత్వ ప్రతిష్టను ప్రజల్లో దిగజార్చే కుటిల వ్యూహానికి బిజెపి తెగబడుతోంది. ఇలా దాదాపు లక్ష కోట్ల రూపాయల మేర ఆ రాష్ట్రానికి రావాల్సిన నిధులను కేంద్రం మంజూరు చేయడానికి నిరాకరిస్తోందన్న ఆరోపణలు ఉన్నాయి. గత ఐదేళ్లలోనే 57వేల కోట్ల రూపాయలకు కోత పెట్టింది. పన్నుల వాటాను 3.89 శాతం నుండి 1.92 శాతానికి తగ్గించింది. ఈ చర్య వల్ల 2024-25 ఆర్థిక సంవత్సరంలోనే కేరళ ప్రజలు 27 వేల కోట్ల రూపాయలు నష్టపోయారు. జిఎస్‌టి సంస్కరణల ద్వారా మనో 9వేల కోట్లను ఆ రాష్ట్రం కోల్పోయింది. త్వరలో ఎన్నికలు జరగనున్నఈ రాష్ట్రంలో ఈ తరహా రాజకీయ కక్ష సాధింపు చర్యలు పతాకస్థాయికి చేరడంతో కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ సత్యాగ్రహం చేయాల్సి వచ్చింది. ఇకపోతే కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ ఆర్థిక దిగ్బంధనంపై కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ పెదవి విప్పక పోవడం పచ్చి అవకాశవాద రాజకీయం తప్ప మరోటి కాదు. ఏమైనప్పటికీ ఈ తరహా ఏకపక్ష విధానాలను నరేంద్రమోడీ ప్రభుత్వం ఇప్పటికైనా విడనాడాలి. రాజ్యాంగ బద్దమైన రాష్ట్రాల హక్కులను గౌరవించాలి. లేని పక్షంలో ఈ తరహా ఆందోళనలు మరిన్ని రాష్ట్రాల్లో చోటుచేసుకునే అవకాశం ఉంది. బలమైన రాష్ట్రాలే కేంద్రాన్ని బలంగా నిలబెడతాయి. స్థిరమైన ఆర్థిక వనరులతోనే బలంగా నిలుస్తాయి. సమాఖ్య వ్యవస్థ పురోగతికి అత్యంత కీలకమైన ఈ అంశంపైనే నరేంద్రమోడీ నేతృత్వంలోని కేంద్ర బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోంది. ఆర్థిక హక్కులను క్రమేణా హరిస్తోంది. ఫలితంగా రాష్ట్రాలు ప్రతి చిన్న అవసరానికి కేంద్రం దయా దాక్షిణ్యాలపై ఆదారపడాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.ప్రీ బడ్జెట్ సమావేశంలో రాష్ట్రం తరపున పాల్గొన్న తెలంగాణ ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క అనేక విషయాలను నిర్మలా సీతారామన్ ముందుంచారు. ఫ్యూచర్ సిటీ, నవోదయలు, మూసీ సుందరీకరణ, రోడ్ల విస్తరణ, ఎస్సీఆరెస్పీకి జాతీయ హోదా ,ట్రిపుల్ ఆర్ వంటి అనేక అంశాలను, నిధుల కేటాయింపులను ప్రస్తావించారు. వీటికి కేంద్రం బ్డజెట్‌లో ఏ రకమైన స్పందన చూపిస్తుందో చూడాలి. అలాగే ఎపికి చెందిన మంత్రి పయ్యావుల కేశవ్ కూడా కోరికల చిట్టా విప్పారు. రాష్ట్ర రాజధాని అమరావతి నగర నిర్మాణ పనులకు సాయాన్ని కొనసాగించాలని ఆయన కోరారు. విభజన హామీల్లో భాగమైన పోలవరం ప్రాజెక్టుకు పూర్తి నిధులు ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే విశాఖపట్నం, రాయలసీమ ప్రాంతాల మౌలిక సదుపాయాల కోసం అదనపు కేటాయింపులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ఈ కోరికలు కోరడం ఇదే మొదటి సారికాదు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఢల్లీ పర్యటనకు వెళ్లిన ప్రతిసారీ దాదాపుగా ఇవే అంశాలను ప్రధాన మంత్రి నుండి మంత్రుల వరకు వ్యక్తిగతంగా కలిసి ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తూనే ఉన్నారు. ఢిల్లీలో ఉన్న రాష్ట్ర ఎంపీలు, పర్యటనలకు వెళ్లే మంత్రులూ ఇదే పనిమీద ఉంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయినా, కేంద్రం నుండి నిధులు రావడం లేదు. మన రాష్ట్రమే కాదు, ఎన్‌డిఎలో మరో భాగస్వామిగాఉన్న బీహార్ ప్రభుత్వం నుండి కూడా ఇటువంటి విజ్ఞప్తులే అందాయి. పలు బిజెపి పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా జిఎస్‌టి నష్టపరిహారం, గ్రాంట్ల పెంపు, ప్రత్యేక ప్యాకేజీల కోసం కేంద్రాన్ని కోరినట్లు వార్తలు వచ్చాయి. నిధుల కేటాయింపుల్లో సమతుల్యత పాటించాలి. విభేదాలు పక్కన పెట్టాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్రాల మధ్య సయోధ్య సాధ్యం అవుతుంది.

# బీజేపీ అధ్యక్ష ఎన్నికకు రంగం సిద్ధం

### 19న నామినేషన్..20 ఎన్నికల ప్రక్రియ



**న్యూఢిల్లీ, జనవరి 16:** బీజేపీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్నిక తేదీని బీజేపీ శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు బీజేపీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2-4 గంటల మధ్య అభ్యర్థులు నామినేషన్లను సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5-6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ ప్రక్రియంతా బీజేపీ ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్‌నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారుచేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను బీజేపీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.



# మరోమారు పాక్ కవ్వింపు చర్యలు

### సరిహద్దుల్లో డ్రోన్లతో దాడి చేసే యత్నం

**న్యూఢిల్లీ, జనవరి 16:** ఓ వైపు భారత్‌తో స్నేహ సంబంధాలు కొనసాగిస్తాం అంటూనే.. పాకిస్థాన్ మరోవైపు కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. గురువారం రాత్రి జమ్మూ కాశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి రెండు పాక్ డ్రోన్లు సంచరించినట్లు రక్షణ వర్గాలు వెల్లడించాయి. డ్రోన్ల కదలికలు చూసిన వెంటనే భారత సైన్యం స్పందించి యాంటీ-డ్రోన్ ఆపరేషన్ చేపట్టడంతో అవి వెనుదిరిగాయి. ఈ వారంలోనే ఇలా జరగడం మూడోసారి అంటున్నారు. పాకిస్థాన్‌కు భారత్ ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది హెచ్చరికలు జారీ చేసిన కొద్ది గంటల్లోనే ఈ ఘటన చోటు చేసుకోవడం గమనార్హం. గణతంత్ర దినోత్సవం వేడుకల నేపథ్యంలో సరిహద్దుల్లో భద్రతా దళాలు పహారా కాస్తున్నాయి. డ్రోన్ల కదలికల తర్వాత ఆ ప్రాంతంలో హై అలర్ట్ ప్రకటించి, భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. మంగళవారం రాత్రి, రాజౌరి జిల్లాలోని నియంత్రణ రేఖ (ఒక్షఅ) దాటి భారత భూభాగంలోకి వచ్చిన అనుమానిత పాక్ డ్రోన్లను అడ్డగించడానికి ఆర్మీ సిబ్బంది కాల్పులు జరిపారు.

# ట్రంప్‌తో కొరినా భేటీ

**వాషింగ్టన్, జనవరి 16:** వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మారియా కొరినా మచాడో గురువారం వైట్ హౌజ్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ని కలిశారు. ఈ సందర్భంగా తన నోబెల్ శాంతి బహుమతి పురస్కారాన్ని ట్రంప్ నకు అందజేశారు. సమావేశం అనంతరం ఈ విషయాన్ని మచాడో స్వయంగా మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా మచాడో మాట్లాడుతూ.. 'చరిత్రలో రెండు వందల ఏళ్ల తర్వాత, బొలివర్ వారసులు వాషింగ్టన్ వారసుడికి ఒక పతకాన్ని తిరిగి ఇస్తున్నా.. ఇది మన స్వేచ్ఛ పట్ల ఆయన ప్రత్యేక నిబద్ధతకు గుర్తింపుగా నా నోబెల్ శాంతి బహుమతిని ట్రంప్ నకు అందజేస్తున్నా' అని వ్యాఖ్యానించారు. వెనుజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను ఇటీవల అమెరికా సైనిక దళాలు అదుపులోకి తీసుకున్న కొన్ని రోజులకే ఈ పరిణామాలు చోటు చేసుకోవడం ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మచాడోతో భేటీ అనంతరం ట్రంప్ స్పందిస్తూ.. 'మారియా కొరినా మచాడోను కలవడం నాకు ఎంతో సంతోషంగా ఉంది. ఆమె ఎన్నో కష్టనష్టాలను ఎదిరించి నిలిచిన గొప్ప మహిళ, ఇన్నాళ్ళు ప్రపంచ శాంతి కోసం నేను చేసిన కృషిని గుర్తించి ఆమె తన నోబెల్ పురస్కారాన్ని నాకు బహుమతిగా ఇచ్చారు.. థ్యాంక్యూ మరియా.. అంటూ తన ట్రూత్ సోషల్ వేదికగా తెలిపారు. గత ఏడాది అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ తనకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని.. దానికి తాను పూర్తి అర్హుడని నానా హంగామా చేశారు. కానీ, నోబెల్ బహుమతి మాత్రం ట్రంప్‌నకు దక్కలేదు. 2025 లో నోబెల్ బహుమతి వెనుజువెలా ప్రతిపక్ష నేత కొరినా మచాడోకి దక్కింది.

# చట్టవిరుద్ధంగా వాకీటాకీల విక్రయం

### అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు సంస్థలకు షాక్

### ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై రూ.44లక్షల వరకు జరిమానా



**న్యూఢిల్లీ, జనవరి 16:** చట్టవిరుద్ధంగా వాకీ టాకీలను విక్రయిస్తున్న పలు ఈ-కామర్స్ సంస్థలపై కేంద్ర వినియోగదారుల రక్షణ ప్రాధికార సంస్థ సుమోటోగా చర్యలు చేపట్టింది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో సహా పలు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లపై మొత్తంగా రూ.44లక్షల వరకు జరిమానా విధించింది. వినియోగదారుల రక్షణ, టెలికాం చట్టాలను ఉల్లంఘించి పలు ఈ-కామర్స్ సంస్థలు నిబంధనలకు అనుగుణంగా లేని ఉత్పత్తులను లిస్ట్ చేసి విక్రయిస్తున్నట్లు సీసీపీఏ గుర్తించింది. సాధారణంగా 446.0-446.2 బ్యాండ్‌లోని పర్సనల్ మొబైల్ రేడియోలకు మాత్రమే లైసెన్స్ మినహాయింపు వర్తిస్తుంది. మిగతా వాటి దిగుమతి, విక్రయాల కోసం తప్పనిసరిగా ఎక్విప్‌మెంట్ టైప్ అప్రూవల్ సర్టిఫికెట్ తీసుకోవాల్సి ఉంటుంది. అంతేగాక, లైసెన్సింగ్ నిబంధనలకు సంబంధించిన వివరాలను కూడా విక్రయదారులు స్పష్టంగా తెలియజేయాలి. అయితే, ఫ్లిప్‌కార్ట్ , అమెజాన్ , మీషో , జియో మార్ట్ తదితర ఈ-కామర్స్ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘించి నట్లు అఅఖం తెలిపింది. లైసెన్స్ మినహాయింపు ఫ్రీక్వెన్సీ రేంజ్ దాటి ఉన్న వాకీ టాకీలను ఈ కంపెనీలు విక్రయించినట్లు పేర్కొంది. ఇందుకు గానూ మీషో, మెటా, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలకు రూ.10లక్షల చొప్పున జరిమానా విధించింది. చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో, మాస్క్‌మ్యాన్ టాయ్స్ సంస్థలకు రూ.లక్ష చొప్పున వేసింది. వీటిలో మీషో, మెటా, చిమియా, జియో మార్ట్, టాక్ ప్రో ఇప్పటికే పెనాల్టీలు చెల్లించినట్లు సీసీపీఏ వెల్లడించింది.

# నీరవ్ మోడీ కేసులో ఈడీ దర్యాప్తు

### ఛోక్సీ తనయుడు రోహన్‌కు సంబంధం ● ఢిల్లీ అప్పిలేట్ ట్రిబ్యునల్‌కు ఈడీ వివరాలు



**న్యూఢిల్లీ, జనవరి 16:** పంజాబ్ నేషనల్ బ్యాంక్‌కు రూ.వేల కోట్లు ఎగవేసి పారిపోయిన వ్యాపారవేత్త, ఆర్థిక నేరగాడు మెహుల్ ఛోక్సీ కేసుపై ఈడీ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఎనిమిదేళ్లుగా కొనసాగుతోన్న దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు తాజాగా కీలక విషయం వెల్లడించారు. ఈ మనీలాండరింగ్ కేసులో మెహుల్ ఛోక్సీ కుమారుడు రోహన్ చోక్సీకి కూడా సంబంధం ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు దిల్లీలోని అప్పీలేట్ ట్రైబ్యునల్‌కు వివరాలు వెల్లడించారు. మెహుల్ చోక్సీ డైరెక్టర్‌గా ఉన్న లస్టర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే కంపెనీలో రోహన్ చోక్సీకి 99.99 శాతం వాటా ఉందని.. ఈ కంపెనీ నిధులను వారు విదేశాలకు మళ్లించడానికి ఉపయోగించుకున్నారని దర్యాప్తులో తేలినట్లు ఈడీ అధికారులు పేర్కొన్నారు. నగదు అక్రమ చలామణిలో రోహన్ చోక్సీ చురుకుగా పాల్గొన్నట్లు తగిన ఆధారాలు ఉన్నాయన్నారు. దీంతో అతడి ఆస్తులను అటాచ్ చేయడానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రోహన్‌తో పాటు ఇతర కుటుంబసభ్యులను కూడా విచారించడానికి ఈడీ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి తీసుకున్న దాదాపు రూ.13 వేల కోట్ల రుణాలను ఎగ్గొట్టిన ఛోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ దేశం విడిచి పారిపోయారు. ఛోక్సీ ఆంటిగ్వా-బార్బుడాకు వెళ్లగా.. నీరవ్‌మోదీ లండన్‌లో ఆశ్రయం పొందాడు. ప్రస్తుతం నీరవ్ లండన్‌లోని జైల్లో ఉన్నాడు. వారిని భారత్‌కు తీసుకురావడానికి విదేశాంగ అధికారులు ఆయా దేశాల అధికారులతో చర్చలు జరుపుతున్నారు.

# 'స్టార్టప్ ఇండియా' విప్లవం

### రాబోయే పదేళ్లలో అగ్రగామిగా భారత్

### కంఫర్ట్ జోన్‌లో జీవించే ఆలోచన యువతకు లేదు

### 'నేషనల్ స్టార్టప్ డే' కార్యక్రమంలో ప్రధాని మోదీ

**ఢిల్లీ, జనవరి 16:** రాబోయే పదేళ్లలో స్టార్టప్స్, టెక్ విభాగాల్లో ప్రపంచ అగ్రగామిగా భారత్‌ను నిలపడమే లక్ష్యమని ప్రధాని మోదీ వెల్లడించారు. ఈ లక్ష్యం దిశగా భారతీయ స్టార్టప్‌లు వైవిధ్యంతో, సాహసోపేతంగా పురోగమిస్తాయనే పూర్తి విశ్వాసం తనకు ఉందన్నారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటెలీజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై భవిష్యత్ వ్యూహాన్ని కలిగిన దేశాలకే ఎక్కువ ప్రయోజనాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' సందర్భంగా శుక్రవారం దిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ ప్రసంగించారు. 2014లో దేశంలో 4 యూనికార్న్ ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 125కు చేరిందన్నారు. పదేళ్ల క్రితం 500 స్టార్టప్‌లే ఉండగా, ఇప్పుడు వాటి సంఖ్య 2 లక్షలు దాటిందన్నారు. ఒక్క 2025 సంవత్సరంలోనే 44వేల స్టార్టప్‌లు రిజిస్టర్ అయ్యాయని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థ భారత్‌లోనే ఉందన్నారు. 'నేషనల్ స్టార్టప్ డే' వేడుకకు హాజరైన స్టార్టప్‌ల వ్యవస్థాపకులను చూస్తుంటే, తనకు నవ్య భారత్, వికసిత భారత్ కనిపిస్తోందని మోదీ వ్యాఖ్యానించారు.

### శాలరీని మించి ఆలోచించే వాళ్లను గౌరవిస్తున్నారు!




'గతంలో సొంత వ్యాపారం ప్రారంభించడాన్ని రిస్క్‌గా భావించేవారు. రిస్క్ పేరు చెప్పి యువతను నిరుత్సాహపరిచేవారు. కానీ ఇప్పుడు రిస్క్ తీసుకొని వ్యాపారాలను మొదలుపెట్టడమే భారతీయ యువతకు ప్రధాన పనిగా మారిపోయింది. భారతీయ స్టార్టప్‌ల వ్యవస్థాపకుల అత్యద్భుత విశ్వాసం, గొప్ప ఆశయాలను చూసి నేను మంత్రముగ్ధుడిని అయ్యాను. ఒకప్పుడు సొంత వ్యాపారం పెట్టడం అనేది కెరీర్‌లో చిట్టచివరి ఆప్షన్‌గా ఉండేది. కానీ ఇప్పుడది ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది. నెలవారీ శాలరీని మించి ఆలోచించే వాళ్లను ఇప్పుడు అందరూ స్వాగతిస్తున్నారు, గౌరవిస్తున్నారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

### అన్ని రంగాలకు కనెక్టివిటీ

'స్టార్టప్ ఇండియా అనేది ఒక స్కీం మాత్రమే కాదు. దానికి ఇంద్ర ధనుస్సు లాంటి పెద్ద విజన్ ఉంది. కొత్త వ్యాపార అవకాశాలతో దేశంలోని అన్ని రంగాలను కనెక్ట్ చేయడమే దీని లక్ష్యం. భారతీయ స్టార్టప్‌లు తయారీ రంగం, పరిశోధనలపైనా ఫోకస్ పెట్టాల్సిన సమయం వచ్చేసింది. ఈ రోజు చేసే పరిశోధనే రేపటి ఇంటలెక్చువల్ ప్రాపర్టీగా మారుతుంది. స్టార్టప్‌లకు సీడ్ ఫండ్‌ను అందించడానికి మేం చాలా స్కీంలను అమల్లోకి తెచ్చాం. కాలం చెల్లిన రూల్స్ అన్నీ తొలగించాం. స్టార్టప్‌ల వ్యవస్థాపకుల ఐడియాలను మేం బలంగా నమ్మాం. ఈ ఏడాదితో స్టార్టప్ ఇండియా కార్యక్రమం పదేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంది. దీనివల్ల మేం వేలాది మందికి కలలు కనే ధైర్యాన్ని ఇచ్చాం. ఎంతోమంది వారి వ్యాపార కలలను సాకారం చేసుకున్నారు. ఈ శుభ సందర్భంగా ప్రతీ ఒక్క స్టార్టప్ వ్యవస్థాపకుడికి నా అభినందనలు' అని ప్రధాని మోదీ తెలిపారు.

# తిరుపతిలో ఏపీ ఫస్ట్



మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీ ఫ్యూచరిస్టిక్ ఇన్నోవేషన్ అండ్ రీసెర్చ్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ-ఏపీ ఫస్ట్ పేరుతో తిరుపతిలో రీసెర్చ్ కేంద్రం ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. వివిధ రంగాల్లో కంపెనీలు కూడా పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నాయి. ఎయిరో స్పేస్, డిఫెన్స్, స్పేస్ టెక్నాలజీ, ఏఐ-సైబర్ సెక్యూర్టీ, సెమీ కండక్టర్ల డివైసెస్-సెన్సార్లు, క్వాంటం టెక్నాలజీ, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, రూరల్ ఏరియా టెక్నాలజీ వంటి రంగాలు భవిష్యత్తులో కీలకం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనికి అనుగుణంగా పాలసీలు రూపొందిస్తోంది. ఆయా రంగాల్లో పెట్టుబడులు పెట్టే కంపెనీలను ప్రోత్సహిస్తోంది. దేశంలో తొలిసారిగా గ్రీన్ ఎనర్జీ రంగంలో గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడలో ఏర్పాటు చేయబోతున్నాం. ఈ తరహాలో కొత్త ఆవిష్కరణలకు...వివిధ స్టార్టప్ కంపెనీలకు రాష్ట్రం వేదికగా నిలవాల్సిన అవసరం ఉంది. ఇలా వచ్చే కంపెనీలకు... పరిశ్రమలకు నైపుణ్యమున్న యవతను అందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. ఈ మేరకు భవిష్యత్తులో డిమాండ్ ఉన్న రంగాలకు పెద్దపీట వేయడమే కాకుండా...స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. వీటికి రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఓ అతి పెద్ద రీసెర్చ్ కేంద్రం అవసరం. తిరుపతిలో ఏర్పాటు చేయబోతున్న ఏపీ-ఫస్ట్ వ్యవస్థ ఆ అవసరాలను తీర్చేలా... రాష్ట్రంలోని యువతకు సహకరించేలా పూర్తి స్థాయిలో పనిచేయాలి. తిరుపతిలోని ఐఐటీ-ఐఐఎస్ఈఆర్ రెండు ప్రముఖ జాతీయ విద్యా సంస్థల కాంబినేషన్లో ఏపీఫస్ట్ ఏర్పాటు కాబోతోంది. దీన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దాలి. ఏపీ ఫస్ట్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వంతోనూ సంప్రదింపులు జరపాలి."అని సీఎం చంద్రబాబు చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన నిరంతరం ఏపీని అభివృద్ధి చేయడంతోపాటు... యువతకు చక్కటి ఉపాధి కల్పించడంపైనే ఉంటుంది. సంక్షేమానికి-అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఏ స్థాయిలో ఆలోచన చేస్తుందో... యువతకు మెరుగైన అవకాశాలు అందించే విషయంలోనూ అదే స్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. దీంట్లో భాగంగానే ఏపీ ఫస్ట్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నాం. యూనివర్శిటీలు, వివిధ రంగాల్లో ప్రముఖ స్థానంలో ఉన్న కంపెనీలతో ఏపీ ఫస్ట్ సమన్వయం చేసుకోవాలి. ఇప్పటికే వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ యూనివర్శిటీల్లో విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తున్నారు. వాటిని అందిపుచ్చుకోవాలి. దీంతో యువతలో వివిధ రంగాల్లో నైపుణ్యం పెంచేందుకు పరిశ్రమలు, కంపెనీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలి. దీంతో పాటు అందుబాటులోకి వస్తోన్న టెక్నాలజీలు ఏంటీ...? ఏయే రంగాల్లో అభివృద్ధి జరుగుతోందనే విషయాలను గుర్తించి.. వాటిని కరిక్యులమ్‌లో చేర్చేలా విద్యా సంస్థలతో సంప్రదింపులు జరపాలి. ఈ మేరకు ఆయా విద్యా సంస్థలకు కరిక్యులమ్ ప్రిపేర్ చేసేలా ఏపీ ఫస్ట్ పని చేయాల్సిన అవసరం ఉంటుంది. ఐటీని ప్రమోట్ చేయడం వల్ల ఇప్పుడు తెలుగువాళ్లు ఐటీలో మేటిగా ఉన్నారు. అలాగే ఫార్మా రంగంలో భవిష్యత్ ఉంటుందని గుర్తించడం వల్లే తెలుగు రాష్ట్రాలు ఫార్మాలో అగ్రభాగాన ఉన్నాయి. ఇదే తరహాలో భవిష్యత్ రంగాలను నేటి యువత అందిపుచ్చుకోవాలి. దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యువత భవిత కోసం... స్టార్టప్ కంపెనీలకు మరింత చేయూతనివ్వడం కోసం ఏపీ ఫస్ట్ వ్యవస్థ కృషి చేయాలి. వచ్చే మూడేళ్లల్లో కీలక పురోగతి కనబరిచేలా ఏపీ ఫస్ట్ పని చేయాలి." అని ముఖ్యమంత్రి సూచించారు. "డ్రోన్ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేయాలి. ప్రకృతి వైపరీత్యాల సందర్భాల్లో డ్రోన్లను వినియోగించి బాధితులకు సేవలు అందించాం. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో డ్రోన్లను వినియోగించుకుని ప్రజలకు సేవలు అందించేలా చూడాలి. వ్యవసాయం, మెడికల్ ఎమర్జెన్సీ వంటి వాటిల్లో డ్రోన్ల వినియోగం పెరగాల్సిన అవసరం ఉంది. ఇవన్నీ ఫ్యూచర్ టెక్నాలజీలు.. కానీ వీటికి మనం ఇప్పటి నుంచే సంసిద్ధత కావాల్సి ఉంది. వివిధ దేశాల్లో డ్రోన్ల ద్వారా ఎలాంటి సేవలు అందుతున్నాయోననే అంశాన్ని పరిశీలించాలి... అధ్యయనం చేయాలి. టెక్నాలజీ విషయంలో ఎప్పటికప్పుడు అప్డేట్ అవుతూ ఉండాలి. టెక్నాలజీని అందరూ అందిపుచ్చుకున్నాక... మనం అప్పుడు మేల్కొనే కంటే... ముందుగానే టెక్నాలజీని అందిపుచ్చుకునేలా మన వ్యవస్థలను సిద్ధం చేయాలి. డ్రోన్ కార్పొరేషన్ నిపుణులతో కూడిన సలహా బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలి. వచ్చే ఇంటర్నేషనల్ డ్రోన్ డే నాటికి డ్రోన్ల ద్వారా సేవలు ఏ విధంగా అందించవచ్చోననే అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషిని ప్రజలకు కళ్లకు కట్టేలా చూపాలి. డ్రోన్ ట్యాక్సీ, డ్రోన్ అంబులెన్స్ వంటి అంశాల్లో లోతుగా అధ్యయనం చేయండి. కేంద్రంతో సంప్రదింపులు జరిపి.. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్ వ్యవస్థ తరహాలో డ్రోన్ ట్రాఫిక్ కంట్రోల్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేయవచ్చేమోననేది పరిశీలించండి."అని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో ఏరో స్పేస్ డిఫెన్స్ సలహాదారు సతీష్ రెడ్డి, ఐటీ-డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ సలహాదారు అమిత్ దుగర్, తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కెఎన్ సత్యనారాయణ, ప్రొఫెసర్ సెంథిల్ కుమార్, డీఎంటీఐ డైరెక్టర్ కల్నల్ పీఎస్ రెడ్డి సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## స్వర్ణచంద్రగిరికి ప్రణాళికలు

**నారావారి పల్లె తరహాలో సుస్థిరాభివృద్ధి**

**అధికారులకు సూచించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు**

**తిరుపతి :** తిరుపతి జిల్లాలోని చంద్రగిరి మండలాన్ని అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దేందుకు స్వర్ణ చంద్రగిరి ప్రణాళికని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం నారావారిప్లలెలో ప్రకటించారు. స్వర్ణనారావారిపల్లె తరహాలో స్వర్ణ చంద్రగిరికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. స్వర్ణకుప్పం, నారావారిప్లలె తరహాలోనే సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా స్వర్ణ చంద్రగిరి మండలాన్ని తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇందుకు వీలుగా ప్రణాళికలను అమలు చేయాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. చంద్రగిరి మండలంలో ప్రజల జీవన ప్రమాణాలు పెంచేలా ఈ అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయనున్నట్లు సీఎం తెలిపారు. గత ఏడాది సంక్రాంతికి కందులవారిపల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట గ్రామాలను కలిపి స్వర్ణ నారావారిప్లలె కార్యక్రమానికి ఎంపిక చేసిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టు ద్వారా ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. ఏడాది కాలంలోనే అన్ని ఇళ్లకూ నూటికి నూరు శాతం సౌర ప్యానెళ్లను అమర్చడం ద్వారా ఇంధన స్వయం సమృద్ధిని సాధించింది. తద్వారా ప్రతి ఇంటికీ ఉచితంగానే విద్యుత్ వెలుగులు వచ్చాయి. శాస్త్రీయ పద్ధతుల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించడం, ప్రకృతి సేద్యం విస్తరణ తదితర ప్రణాళికల ద్వారా వారి తలసరి ఆదాయం 20 శాతం మేర పెరిగింది. మహిళలు, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేలా ప్రత్యేక స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్ కార్యక్రమాలను కూడా సమర్థవంతంగా అమలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పూర్తి స్థాయిలో ప్రతి లబ్దిదారుడికి చేరేలా చేయటంతో పాటు మౌలిక సదుపాయాల కల్పించారు. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో చంద్రగిరి మండలం అంతటా ఈ ప్రాజెక్టును విస్తరించాలని నిర్ణయించారు. ఏడాది లోపు నిర్దేశిరచుకున్న ఫలితాలు సాధించాలని ఉన్నతాధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.



# ప్రజల మద్దతు ఉన్న ఎంఐఎం వారికే టికెట్లు

- ఎవరైనా టికెట్లు ఇప్పిస్తామంటే నమ్మకండి
- కరీంనగర్ మున్సిపల్‌పై ఎంఐఎం జెండా ఎగరడమే లక్ష్యం
- ఈ సారి 40 డివిజన్లలో పోటీ చేస్తాం.. సత్తా చాటుతాం..
- ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్
- నగరంలోని 140 మంది ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరణ



**సమయం న్యూస్, కరీంనగర్:** స్థానిక డివిజన్లలో ప్రజల మద్దతు ఉన్న వారికే టికెట్లు ఇస్తామని ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ స్పష్టం చేశారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు శుక్రవారం స్థానిక ఎంఐఎం పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల్లో కార్పొరేటర్ గా ఎంఐఎం తరపున పోటీ చేసే 140 మంది ఆశావాహుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆశావహులు ఎంఐఎం దారుసలాం హైదరాబాద్ పేరిట ఏదైనా జాతీయ బ్యాంకులో రూ.3 వేల డీడీతో దరఖాస్తు ఫారాలను నింపి, ఈ నెల 20న సాయంత్రం 6 గంటల వరకు స్థానిక కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ప్రజల మద్దతు ఉన్నవారికే పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైనా టికెట్లు ఇప్పిస్తామని వస్తే, ఆశావాహులు వారిని నమ్మొద్దని సూచించారు. దరఖాస్తు చేసిన ఫారాలను డీడీలతో సహా పార్టీ హైకమాండ్ కు పంపిస్తామని చెప్పారు. పార్టీ కార్పొరేటర్అభ్యర్థుల కోసం ఇప్పటికే నగరంలో మూడు సార్లు సర్వే చేశామని, ఫైనల్‌సర్వే అనంతరం పార్టీ అధినేత ఆదేశాల మేరకు బీఫారాలు ఇస్తామని చెప్పారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పై ఎంఐఎం జెండా ఎగరడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులై కృషి చేయాలని కోరారు. ఒక డివిజన్ నుంచి నలుగురు లేదా ఐదుగురు ఆశావాహులుంటే, వారిలో గెలిచే సత్తా ఉన్న నాయకుడికి టికెట్లను కేటాయిస్తామని, టికెట్ రాని మిగతా నలుగురు నిరాశ చెందకుండా హై కమాండ్ ఆదేశాలను శిరసావహించి, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించే వారిపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మాజీ మేయర్ అబ్బాస్ సమీ, ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఇబ్రహీం, అఖిల్ ఫిరోజ్, అలీబాబా, అజర్ దబీర్, మాజిద్ హుస్సేన్, అరిఫ్ అహ్మద్, అన్నిమల్ల సురేష్, సాజిద్, లింగంపల్లి శ్రీనివాస్, మజారుద్దీన్, వాజిద్ అలీఖాన్, అజీముల్లా ఖాన్, ఫసియుద్దీన్ ఖాలీద్, జమ్మూ ఇష్తియాక్, అవేజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడాది తిరక్కుండానే.. మళ్లీ బాదుడు

మొదటి పేజీ తరువాయి

కలవరపెడుతున్నాయి. 11 నెలల్లోనే రెండోసారి స్థిరాస్తుల మార్కెట్ విలువల సవరణపై ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టిందన్న సమాచారం రియల్ ఎస్టేట్ రంగంలో కలకలం రేపుతోంది. వాస్తవానికి 2025 ఫిబ్రవరిలోనే చంద్రబాబు ప్రభుత్వం భూములు, ఇళ్ల మార్కెట్ విలువలను ఏకంగా 50 శాతం వరకు పెంచింది. ఆ నిర్ణయంతో అప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీ భారం ప్రజలపై భారీగా పడింది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు, చిన్న వ్యాపారులు, రైతులు తమ ఆస్తులను అమ్ముకోవాలన్నా, కొనుగోలు చేయాలన్నా తీవ్రంగా ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ పెంపుతో రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించాల్సిన మొత్తం ఒక్కసారిగా లక్షల్లో పెరిగిపోయింది. దీనివల్ల ఆస్తుల క్రయవిక్రయాలు మందగించాయి. మార్కెట్ లో లావాదేవీలు తగ్గిపోయాయి. అయినప్పటికీ, ప్రభుత్వం ఆ పరిస్థితిని గమనించకుండా మళ్లీ మార్కెట్ విలువల సవరణకు సిద్ధమవుతుండటం ప్రజల్లో ఆగ్రహాన్ని పెంచుతోంది. ఈసారి కూడా లక్ష్యం ఒక్కటే అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేమీ పట్టకుండా మళ్లీ రూ.3 వేల కోట్లకుపైగా అదనపు ఆదాయం రాబట్టాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని విమర్శకులు అంటున్నారు. రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా భారీ ఆదాయం సమకూర్చుకోవాలన్న ఆలోచనతోనే ఈ విలువల సవరణ ప్రక్రియ మొదలుపెట్టారని ఆరోపిస్తున్నారు. అందులో భాగంగానే అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఉన్న భూములు, ఇళ్ల విలువలను తిరిగి సవరించేందుకు ప్రతిపాదనలు పంపాలని జాయింట్ సబ్ రిజిస్ట్రార్లకు ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. అంటే రాష్ట్రవ్యాప్తంగా ప్రతి మండలం, ప్రతి గ్రామం, ప్రతి నగర పరిధిలో ఉన్న ఆస్తుల విలువలను మరోసారి పెంచే ప్రయత్నం జరుగుతోందన్న మాట. ఇందులో భాగంగా భూముల క్లాసిఫికేషన్ ను కూడా మార్చే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సబ్ రిజిస్ట్రార్లకు సూచనలు ఇచ్చారన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు వ్యవసాయ భూమిగా ఉన్న కొన్ని ప్రాంతాలను నివాస లేదా వాణిజ్య ప్రాంతాలుగా చూపించి మార్కెట్ విలువను పెంచే అవకాశముందని రియల్ ఎస్టేట్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. భూమి క్లాసిఫికేషన్ మారితే ఒక్కసారిగా విలువ రెట్టింపు అవుతుంది. దానికి అనుగుణంగా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులు కూడా భారీగా పెరుగుతాయి. దీని భారం నేరుగా ప్రజల మీదే పడుతుంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, విలువల సవరణ అత్యవసరమని చెబుతూ సబ్ రిజిస్ట్రార్ల సెలవులను కూడా రద్దు చేసినట్టు తెలుస్తోంది. అంటే ఎంత త్వరగా ఈ ప్రక్రియ పూర్తి చేసి కొత్త మార్కెట్ విలువలను అమల్లోకి తేవాలన్న ఆతృత ప్రభుత్వంలో కనిపిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సాధారణంగా ఇలాంటి సవరణలకు కొంత సమయం తీసుకుంటారు. ప్రజాభిప్రాయాన్ని, మార్కెట్ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటారు. కానీ ఈసారి అలాంటివేమీ లేకుండా ఆదేశాలు జారీ చేయడం వెనుక ఆర్థిక ఒత్తిళ్లే కారణమని విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి మందగించిందన్న విమర్శలు ఇప్పటికే తీవ్రంగా ఉన్నాయి. పెట్టుబడులు రావడం లేదని, పరిశ్రమలు కొత్తగా ఏర్పడటం లేదని, ఉపాధి అవకాశాలు తగ్గుతున్నాయని పలువురు నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో రియల్ ఎస్టేట్ రంగం కూడా తీవ్రంగా దెబ్బతిన్నట్టు తెలుస్తోంది. గతంలో భారీగా లావాదేవీలు జరిగిన భూములు, లేఅవుట్లు, అపార్ట్మెంట్లు ఇప్పుడు అమ్ముడుపోవడం లేదని రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాపోతున్నారు. డిమాండ్ తగ్గిపోవడంతో ధరలు నిలిచిపోయాయి. కొన్నిచోట్ల తగ్గుముఖం కూడా పట్టాయి. దీని ప్రభావం నేరుగా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయంపై పడింది. గత ప్రభుత్వ హయాంలో ఏటా సుమారు రూ.10 వేల కోట్ల వరకు రిజిస్ట్రేషన్ల ద్వారా ఆదాయం వచ్చేదన్న గణాంకాలు ఉన్నాయి. స్థిరాస్తుల మార్కెట్ లో లావాదేవీలు చురుగ్గా సాగాయి. రైతులకు భరోసా, సామాజిక పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నగదు ప్రవాహం పెరగడంతో భూముల కొనుగోళ్లు, ఇళ్ల నిర్మాణాలు పెరిగాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా స్థిరంగా ఉండేది. కానీ చంద్రబాబు సర్కారు వచ్చాక ఆ ఆదాయం గణనీయంగా తగ్గిపోయిందన్న విమర్శలు ఉన్నాయి. రూ.10 వేల కోట్ల స్థాయి నుంచి అది రూ.8 వేల కోట్లకు పడిపోయిందని చెబుతున్నారు. అంటే ఏటా సుమారు రూ.2 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్న మాట. దీనికి ప్రధాన కారణం రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆస్తుల లావాదేవీలు తగ్గిపోవడంతో రిజిస్ట్రేషన్లు కూడా తగ్గాయి. ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు వచ్చే ఆదాయం పడిపోయింది. ఈ లోటును భర్తీ చేసుకునేందుకు ప్రజలపై చార్జీల బాదుడు పెంచే ప్రయత్నమే ప్రభుత్వం చేస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత ఏడాది చార్జీలను ఏకంగా 50 శాతం పెంచడంతోనే ఈ మాత్రం ఆదాయం రాబట్టగలిగారని విమర్శకులు అంటున్నారు. అంటే లావాదేవీలు తగ్గినా, ఒక్కో రిజిస్ట్రేషన్ పై వసూలు చేసే మొత్తం పెరగడంతో ఆదాయం కొంతమేర నిలబెట్టగలిగారన్న మాట. ఇప్పుడు మరోసారి మార్కెట్ విలువలు పెంచితే మళ్లీ అదనంగా వేల కోట్ల రూపాయలు వసూలు చేయవచ్చన్న ఆలోచనతోనే ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఈ విధానం దీర్ఘకాలంలో ప్రభుత్వానికే నష్టమని పలువురు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే భారం ఎక్కువై ప్రజలు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉంటున్నారు. కొందరు లావాదేవీలను వాయిదా వేస్తున్నారు. మరికొందరు అనధికారిక ఒప్పందాల వైపు మొగ్గు చూపే ప్రమాదం కూడా ఉందని నిపుణులు అంటున్నారు. అలా జరిగితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం పూర్తిగా తగ్గిపోతుంది. అంతేకాదు, నల్లధనం లావాదేవీలు పెరిగే అవకాశమూ ఉందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలకు ఈ భారం మరింత ఎక్కువగా ఉంటుంది. ఒక చిన్న ప్లాట్ కొనాలన్నా, ఒక ఫ్లాట్ రిజిస్టర్ చేయాలన్నా స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులే లక్షల రూపాయలు అవుతున్నాయి. బ్యాంకు లోన్ తీసుకునే వారికి ఇది మరింత భారంగా మారుతోంది. ఇప్పటికే వడ్డీ రేట్లు పెరిగిన పరిస్థితుల్లో, రిజిస్ట్రేషన్ ఖర్చులు పెరగడం వల్ల ఇల్లు కొనాలన్న కలను చాలామంది వాయిదా వేసుకుంటున్నారు. దీని ప్రభావం నిర్మాణ రంగంపైనా పడుతోంది. కూలీలు, చిన్న కాంట్రాక్టర్లు, మెటీరియల్ సరఫరాదారులపై కూడా ఈ ప్రభావం పడుతుందని నిపుణులు



చెబుతున్నారు. రైతుల పరిస్థితి కూడా అంతే దయనీయంగా మారుతోంది. అత్యవసర పరిస్థితుల్లో భూమి అమ్ముకోవాలంటే రిజిస్ట్రేషన్ ఖర్చులే పెద్ద అడ్డంకిగా మారుతున్నాయి. భూమి విలువ పెరిగినట్టు కాగితాల మీద చూపించినా, వాస్తవంగా మార్కెట్ లో అంత ధర రావడం లేదన్నది చాలా ప్రాంతాల్లో నిజం. అయినప్పటికీ ప్రభుత్వం నిర్ణయించిన మార్కెట్ విలువ ఆధారంగానే రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించాల్సి రావడం రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెడుతోంది. మొత్తానికి చూస్తే, అభివృద్ధి మందగించి, ఆదాయ వనరులు తగ్గిన పరిస్థితుల్లో ప్రజలపై మరింత భారం మోపి ఖజానాను నింపుకోవాలన్న ప్రభుత్వ ఆలోచనపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. రియల్ ఎస్టేట్ రంగాన్ని ప్రోత్సహించే విధానాలు తీసుకురావాల్సిన బదులు, దానిపై మరిన్ని భారాలు మోపడం వల్ల సమస్య మరింత తీవ్రమవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఒకవైపు లావాదేవీలు తగ్గి, మరోవైపు చార్జీలు పెరగడం వల్ల చివరికి నష్టపోయేది సామాన్యుడేనని విమర్శకులు చెబుతున్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితులను, మార్కెట్ వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా కేవలం ఆదాయ లక్ష్యాలతోనే నిర్ణయాలు తీసుకుంటే దీర్ఘకాలంలో ప్రభుత్వానికి కూడా అది ప్రతికూలంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిజిస్ట్రేషన్ల బాదుడు తగ్గించి, లావాదేవీలను ప్రోత్సహిస్తేనే ఆదాయం స్థిరంగా పెరుగుతుందన్న వాదన వినిపిస్తోంది. లేదంటే 11 నెలల్లో రెండోసారి మార్కెట్ విలువలు పెంచడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరిగి, రియల్ ఎస్టేట్ రంగం మరింత కుదేలయ్యే ప్రమాదం ఉందని విశ్లేషకులు అంటున్నారు.

# ఏఐఎంఐఎం పార్టీ టికెట్ల కోసం ఆశించేవారికి సూచన

● ప్రతిపాదిత మున్సిపల్ ఎన్నికలు తెలంగాణ

**హైదరాబాద్ జనవరి16( సమయం న్యూస్) :** తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల సన్నాహాల దృష్ట్యా, ఆల్ ఇండియా మజ్లిస్–ఎ–ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏ.ఐ .ఎం.ఐ.ఎం) పార్టీ టిక్కెట్ పై ఎన్నికలలో పోటీ చేయాలనుకునే వ్యక్తుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి.

ఆసక్తి గల అభ్యర్థులు క్రింద పేర్కొన్న విధానాన్ని పాటించవలసి ఉంటుంది:

1. దరఖాస్తు ఫారమ్‌ను ఏఐఎంఐఎం అధికారిక ఫేస్‌బుక్ పేజీ నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి.

2. ఫారమ్‌ను సరిగ్గా పూరించిన తర్వాత, దరఖాస్తుదారులు దానిని ఏఐఎంఐఎం పేరు మీద తీసిన ₹3,000/- (వాపసు చేయబడదు) డిమాండ్ డ్రాఫ్ట్‌తో పాటుగా తమ సంబంధిత జిల్లా టౌన్ మజ్లిస్ అధ్యక్షుడికి సమర్పించాలి.

3. దరఖాస్తులను సమర్పించడానికి చివరి తేదీ 20 జనవరి 2026.

టౌన్ అధ్యక్షులకు సూచనలు:సంబంధిత జిల్లాల టౌన్ అధ్యక్షులు అభ్యర్థుల నుండి పూరించిన దరఖాస్తు ఫారమ్‌లను డిమాండ్ డ్రాఫ్ట్‌లతో పాటుగా సేకరించి, వాటిని వెంటనే పార్టీ ప్రధాన కార్యాలయానికి పంపాలని సూచించడమైనది.

టౌన్ అధ్యక్షులు కూడా పార్టీ ఫేస్‌బుక్ పేజీ నుండి దరఖాస్తు ఫారమ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ఆసక్తి గల అభ్యర్థులకు పంపిణీ చేయవచ్చు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఏ అభ్యర్థి పేరును ప్రకటించకూడదు.పూరించిన అన్ని దరఖాస్తులను డిమాండ్ డ్రాఫ్ట్‌లతో పాటుగా తప్పనిసరిగా పార్టీ ప్రధాన కార్యాలయం, దారుస్సలాం, హైదరాబాద్‌కు పంపాలి అసంపూర్తిగా ఉన్న దరఖాస్తులు పరిగణించబడవు.అభ్యర్థుల తుది జాబితాను ఏ.ఐ.ఎం.ఐ.ఎం జాతీయ అధ్యక్షుడు, బారిస్టర్ అసదుద్దీన్ ఒవైసీ గారు అధికారికంగా ప్రకటిస్తారు

# శబరిమల నుంచి తిరుగు ప్రయాణంలో విషాదం.. కన్యాకుమారిలో లక్షెట్టిపేట దంపతుల మృతి.



శబరిమల యాత్రలో విషాదం: మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటకు చెందిన జనరల్ స్టోర్ యజమాని పాలకుర్తి సత్యనారాయణ (63), ఆయన భార్య రమాదేవి (59) అయ్యప్ప మాలతో శబరిమల దర్శనానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో కన్యాకుమారి బైపాస్ రోడ్డులో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాలను కన్యాకుమారి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మైనారిటీ గురుకుల సంస్థల్లో ప్రవేశానికి పోస్టర్ ఆవిష్కరణ

● జిల్లా కలెక్టర్ కే హైమావతి.




**సిద్ధిపేట జనవరి16( సమాసం న్యూస్).:** సిద్ధిపేట జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్ విద్యాసంస్థలలో 2026ఉ27 విద్యాసంవత్సరానికి సంబంధించిన TGMREIS అడ్మిషన్ల వెబ్‌సైట్ మరియు పోస్టర్ ను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆవిష్కరించారు.ఈ వెబ్‌సైట్ ద్వారా సిద్ధిపేట జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ మరియు ఇతర తరగతుల బ్యాక్‌లాగ్ అడ్మిషన్లు తీసుకోబడతాయి. అడ్మిషన్లు నేటి నుంచే ప్రారంభమయ్యాయి. అభ్యర్థులు tgmreistelagana.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మైనారిటీ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఉచిత వసతి మరియు భోజన సదుపాయాలు అందించడం జరుగుతుండటంతో ఇది వారికి ఒక గొప్ప అవకాశంగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్నెస్ట్ వైల్ మెదక్ జిల్లా ఆర్ఎల్‌సీ శ్రీమతి బహుమతి, విజిలెన్స్ అధికారి శ్రీ ఎం.డి. గౌస్ పాషా, సిద్ధిపేట జిల్లా మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపల్ లు విమల రెడ్డి (దుబ్బాక బాలురుఉ1), సుధారాణి (గజ్వేల్ బాలికలుఉ1), కిరణ్ కుమార్ (గజ్వేల్ బాలురుఉ1), శ్రీవాణి (సిద్ధిపేట బాలికలుఉ1), సత్యలక్ష్మి (హుస్నాబాద్ బాలికలుఉ1), శ్రీనివాస్ (సిద్ధిపేట బాలురుఉ1) మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పొగుట్టుకున్న సెల్ ఫోన్ (సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో అందజేత

● పోర్టల్ ద్వారా కనుగొని బాధితునికి అందజేసిన ఎస్సై రమేష్



**కుల్కచర్ల మండలం, జనవరి,16(సమయం న్యూస్) :** పరిగి నియోజకవర్గం కులకచ్చర్ల (మండలం) ముజాహిద్ పూర్ గ్రామానికి చెందిన దానం కృష్ణయ్య తమ ( సెల్ ఫోన్) పోయినట్లు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పోయిన సెల్ ఫోన్ ను (సీఈఐఆర్) పోర్టల్ సహాయంతో ట్రాక్ చేసి బాదితునికి పీసీల తో కలిసి పోలీస్ స్టేషన్ లో బధితునికి అందించినట్లు ఎస్సై రమేష్ తెలిపారు.ఫోన్ అందుకున్న బాధితుడు ఎస్సై మరియు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపాడు.

# రాష్ట్రంలో తుగ్లక్ ప్రభుత్వం

## మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్ జనవరి16( సమయం న్యూస్) :** శుక్రవారం వెస్ట్ మారేడ్ పల్లి లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో గణ చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ప్రాంత అస్థిత్వాన్ని దెబ్బతీసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. మన అస్తిత్వం, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి ఈ నెల 17 వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి క్లాక్ టవర్, ప్యాట్నీ, ప్యారడైజ్ సర్కిల్ ల మీదుగా వీ+ రోడ్ లోని మహాత్మాగాంధీ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ, దక్షిణ మధ్య రైల్వే కార్యాలయం, రాష్ట్రపతి విడిది భవనం, క్లాక్ టవర్ వంటి అనేక చారిత్రక నిర్మాణాలు ఉన్నాయని గుర్తు చేశారు. సికింద్రాబాద్ లో ఆషాడ మాసంలో నిర్వహించే లష్కర్ బోనాలకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని చెప్పారు. 220 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన సికింద్రాబాద్ ప్రాంత ప్రజల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా పేరు మారుస్తామంటే ఊరుకోబోమని అన్నారు. సికింద్రాబాద్ +ఎవీజ లోనే ఉన్నదని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సికింద్రాబాద్ ప్రాంతంలోని కొన్ని పోలీస్ సర్కిల్స్, +ఎవీజ సర్కిల్ లను మల్కాజిగిరి పరిధిలోకి మార్చారో చెప్పాలని ప్రశ్నించారు. ఇక్కడ పుట్టి పెరిగిన వారు, ఈ ప్రాంతంతో ఉన్న అనుబంధంతో ఇంటికొకరు చొప్పున ఈ శాంతి ర్యాలీలో పాల్గొని సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు కోసం జరుగుతున్న పోరాటానికి మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన తులం బంగారం, మహిళలకు 2500 రూపాయలు వంటి అనేక హామీలు అమలు చేయకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు.

### ర్యాలీలో పాల్గొననున్న కేటీఆర్.... తలసాని

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి నిర్వహించే శాంతి ర్యాలీలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిధిగా పాల్గొంటారని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. మన ఆత్మగౌరవం, మన అస్థిత్వాన్ని కాపాడుకునేందుకు, సికింద్రాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం పై గాంధేయ మార్గంలో ఒత్తిడి తీసుకొచ్చేలా నిర్వహించే శాంతి ర్యాలీ లో అన్ని వర్గాల ప్రజలు, వ్యాపార, వాణిజ్య, కార్మిక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మీడియా సంస్థల ప్రతినిధులు పాల్గొనాలని కోరారు. ర్యాలీలో కెటిఆర్ తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లు, మాజీ ప్రజాప్రతినిధులు కూడా పాల్గొంటారని చెప్పారు. ప్రెస్ మీట్ లో లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సాదం బాలరాజ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

# మినీ మేడారం జాతరేలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు.

● జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**భూపాల పల్లి జనవరి16( సమయం న్యూస్). :** జిల్లాలో నిర్వహించనున్న మినీ మేడారం జాతరలకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మండల ప్రత్యేక అధికారులు, పంచాయతీ రాజ్, విద్యుత్, ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, గిరిజన సంక్షేమ శాఖ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర శాఖల అధికారులతో మినీ మేడారం జాతరల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతర ప్రాంగణంలో పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, భక్తుల సౌకర్యార్థం త్రాగునీరు, మరుగుదొడ్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, పారిశుద్ధ్య కార్యక్రమాలు వంటి మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. జాతర సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మిషన్ భగీరథ ద్వారా పరిశుభ్రమైన త్రాగునీరు అందించాలని ఆదేశించారు. జాతరలు జరిగే మార్గాల్లో రోడ్లకు ఇరువైపుల పొదలు, పిచ్చి మొక్కలు తొలగించాలని, మూల మలుపుల వద్ద సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.స్థానిక తహసీల్దార్లు, ఎంపీడీఓలు జాతర జరిగే ప్రదేశాలను పరిశీలించి చేయాల్సిన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. జాతరలు నిర్వహించే మండలాల్లో మండల ప్రత్యేక అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, భూపాలపల్లి మండలంలో కమలాపూర్, గుర్రంపేట ప్రాంతాల్లో రెండు జాతరలు జరుగు తున్నందున ఇద్దరు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మినీ మేడారం జాతరలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, సీపీఓ బాబురావు, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు సునీల్, బాబురావు, విద్యుత్ శాఖ డీఈ రాజిరెడ్డి, ఆర్డీవో హరికృష్ణ, డీఎల్పీఓ మల్లికార్జున రెడ్డి, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ డ్రైవర్లు, వాహనదారులకు “అరైవ్ అలైమ కార్యక్రమం ద్వారా రోడ్డు భద్రతపై అవగాహన:

● ఎస్పై వెంకటేశ్వర్లు.



**నారాయణపేట, జనవరి,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా కొత్త బస్టాండ్ ఆవరణలో ఎస్పై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆర్టీసీ డ్రైవర్లు మరియు వాహనదారులకు “ఆరైవ్ అలైమ కార్యక్రమం ద్వారా విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పై వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, వేగ నియంత్రణ పాటించాలి, సీట్ బెల్ట్/హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి, మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా వాహనం నడపాలి, ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలి అని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తేనే ప్రమాదాలను తగ్గించి ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీఎం లావణ్య, ఎఎంవిఐ సాయి తేజ రెడ్డి, తదితరులు పాల్గొని, డ్రైవర్లకు రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన డ్రైవర్లు, వాహనదారులు పోలీసుల సూచనలను స్వీకరించి, నియమాలు పాటిస్తామని హామీ ఇచ్చారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పై వెంకటేశ్వర్లు తెలిపారు.

# అరైవ్ అలైవ్ ..నినాదం రక్షణాత్మకంగా డ్రైవ్ చేయడానికి అర్థం

● ప్రమాదాల నివారనే లక్ష్యంగా పోలీస్ శాఖ

● చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాల దిశగా ముందుకు పోతుంది

● అదనపు కలెక్టర్ నగేష్





**మెదక్ జనవరి,16( సమయం న్యూస్) :** కలెక్టరేట్ కార్యాలయంలో ప్రజావాణి హాల్ నందు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో,అరైవ్ అలైవ్‌కార్యక్రమం రోడ్డు ప్రమాదాల నివారణ కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ విజయలక్ష్మి,ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, రూరల్ సీ.ఐ జార్జ్‌తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. కలెక్టరేట్ కార్యాలయ. అధికారులు ఉద్యోగులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ‘అరైవ్ అలైవ్ణ కార్యక్రమం రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా తీసుకున్న ముఖ్యమైన చర్యగా పేర్కొన్నారు.అరైవ్ అలైవ్’ రోడ్డు ప్రమాదాల నివారణపై కలెక్టరేట్ కార్యాలయ ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ నిబంధనలు ఉద్యోగులు పాటిస్తూ మరొకరికి ప్రచారం చేస్తూ స్ఫూర్తిగా నిలవాలన్నారు మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్‌సైడ్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వంటి వి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలని చెప్పారు. ప్రజా సహకారం రోడ్డు భద్రతలో కీలకమని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ అరైవ్ – అలైవ్‌కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తికి చేరవేసి ప్రమాదరహిత జిల్లాగా నిర్మించేందుకు పోలీసులు కట్టుబడి ఉన్నారని స్పష్టంచేశారు.ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలను పాటిస్తే ప్రమాదాలు తగ్గుతాయని వివరించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# కర్ల రాజేష్ కేసులో కోదాడ గత డిఎస్పి శ్రీధర్ రెడ్డిని సూర్యాపేట ఎస్పీ నర్సింహను A3,A4లుగా చేర్చాలి.

- కర్ల రాజేష్ సంఘటనపై సిబిఐ చేత లేదా హైకోర్టు
- సిట్టింగ్ జడ్జిచే జ్యుడీషియల్ విచారణ జరిపించాలి.
- మందకృష్ణ మాదిగ



**హైదరాబాద్ జనవరి16( సమయం న్యూస్,)** కర్ల రాజేష్ లాకప్ డెత్ విషయంలో ఇప్పటివరకు చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డి ఎ1, కోదాడ సిఐ ప్రతాప్ లింగంఎ2 గా రెండు సెక్షన్ల కింద అక్రమ నిర్బంధం మరియు చిత్రహింసలకు గురిచేయడం అనె కేసు మరియు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కానీ కోదాడ డిఎస్పి శ్రీధర్ రెడ్డి ని A3 గా, సూర్యాపేట ఎస్పీ నరసింహని A4 గా చేర్చాలి.కేసుకు సంబంధించిన సాక్ష్యాలను ఆధారాలను కనుమరుగు చేయడానికి వీరు ప్రయత్నించారు. ఈ కేసులో హెూమ్ గార్డ్ నుండి ఎస్ పి వరకు నిందితులుగా వున్నారు. దానికి సంబంధించిన ఆధారాలను మేము రుజువు చేయగలం. ఇప్పటివరకు ఏ పోలీస్ అధికారి కూడా ఈ కేసులో రాజేష్ పోలీసుల చిత్రహింసలకు మృతి చెందలేదని చెప్పలేకపోయారు. సూర్యాపేట జిల్లా మొత్తం పోలీసు యంత్రాంగం ఒకే ఒక్క పనిమీద నిమగ్నమయ్యారు అదే ఈ కర్ల రాజేష్ లాకప్ డెత్ విషయం. గత రెండు నెలలుగా పోలీసులు ఈ కేసు నుండి ఎలా తప్పించుకోవాలని పనిలోనే నిమగ్నమయ్యారు.పోలీసులకు అన్యాయం జరిగిన కాడ వాళ్ళ ప్రాణాలకు ఒక విలువ ఒక దళిత బిడ్డ ప్రాణాలకు మాత్రం ఒక విలువగా చూస్తూ లెక్కలేనితనంతో పోలీసు యంత్రాంగం ప్రవర్తిస్తుంది నిందితులైన పోలీసులను కాపాడుతుంది . నిజామాబా దులో రౌడీ షీటర్ షేక్ రియాజ్ కానిస్టేబుల్ ను హత్య చేస్తే నాలుగు రోజులు తిరగకముందే అతనిని ఎన్కౌంటర్ చేసి చంపారు కానీ ఒక దళిత బిడ్డ కర్ల రాజేష్ ను ఇల్లీగల్ కస్టడీలో చిత్రహింసలకు గురిచేసి మరణానికి కారణమైతే కనీసం చట్టపరంగా కూడా వారిని శిక్షించడం లేదు. దేశంలో లాకప్ డెత్ లు జరిగిన ప్రతిచోట ఏ ఒక్క పోలీసులకు కూడా ఇప్పటివరకు శిక్ష పడలేదు. పోలీసులు ఆ నేరం నుండి తప్పించుకుంటున్నారు. దానికి సాక్ష్యం మానవ హక్కుల కమిషన్ రంగనాథ్ మిశ్రా గారి నివేదిక ముఖ్యమంత్రి గారికి రాసిన లేఖలో సారాంశం చెబుతుంది. పోలీసుల చిత్ర హింసల కారణంగా లాకప్ లో మృతి చెం దిన వ్యక్తి విషయంలో డాక్టర్ల చేత తప్పుడు పోస్టుమార్టం నివేదిక తీసుకొని ఒక పద్ధతి ప్రకారం పోలీసులు తప్పించుకుం టున్నారని పోస్టుమార్టం నిర్వహించేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మార్గదర్శ కాలను రంగనాథ్ మిశ్రా గారి లేఖ తెలిపింది. కర్ల రాజేష్ కు పోస్టుమార్టం మెజిస్ట్రేట్ ఆధ్వర్యంలో జరగాల్సింది పోయి చిలుకూరు ఎస్సై కోదాడ సిఐల పర్యవేక్షణలో లక్ష్మీకాంతరెడ్డి అనే డాక్టర్ పోస్టుమార్టం చేశాడు. ఆరోజు పోస్టుమార్టం నిర్వర్తించాల్సిన డాక్టర్ సూరజ్ కాని కానీ సూరజ్ రాకుండా లక్ష్మీకాంతరెడ్డి డాక్టర్ చేత చేపించండి అని తన ఫోన్ ద్వారా సందేశాన్ని పంపి లక్ష్మీకాంత రెడ్డి చేత ఆరోజు డ్యూటీ కాకున్నా పోస్టుమార్టం నిర్వర్తించారు. పోస్టుమార్టం నివేదిక వీడియోను నిష్ణాతులైన గాంధీ హాస్పిటల్ వీడియో గ్రాఫర్ కాకుండా కోదాడ నుండి రామకృష్ణారెడ్డి అనే వ్యక్తి వచ్చి ఇక్కడ వీడియో తీశాడు. జరిగిన నేరం నుండి తప్పించుకొనుటకు పోలీసులకనుగుంగా పోస్టుమార్టం నివేదికను తీసుకున్నారు. రాజేష్ మృతి చెందిన ఈ 60 రోజుల సమయంలో పోలీసులు అడుగడుగునా సాక్షాలను లేకుండా చేయుటకు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు. ఎంఆర్ పిఎస్ రాజేష్ మృతికి కారణమైన ప్రతి ఒక్కఆధారాలను సేకరించి సమాజం ముందు బయటపెడుతుంది. మొదటి నుండి మేము హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అదేవిధంగా రీ పోస్ట్ మార్టం నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.గత 50 రోజులుగా ఎమ్మార్పీఎస్ ఇదే విషయంపై పోరాడుతుంది. గత బిఆర్ఎస్ ప్రభుత్వం సిబిఐ ఎంక్వయిరీ ఏ కేసులో కూడా లేకుండా నిషేధించింది. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిబిఐని ఆహ్వానించింది సిబిఐ విచారణ అనేది ప్రత్యర్థులను వేధించడానికి రాజకీయంగా ఇబ్బంది పెట్టాలనె ఉద్దేశంతో కాదు ప్రజలకు ఉపయోగపడే నిష్పక్షపాత విచారణకై సిబిఐ ని వాడండి. కర్ల రాజేష్ కేసు విషయంలో సిబిఐ ని ఉపయోగించడం ఉపయోగించకపోవడంతోనే మీ చిత్తశుద్ధి తేలుతుంది.కోదాడ ఎమ్మెల్యే ఉత్తం పద్మావతి రెడ్డి మరియు మంత్రి ఉత్తం కుమార్ రెడ్డిల అండతోనే పోలీసులు కాపాడుబడుతున్నారు మీరు భవిష్యత్తులో రాజకీయ మూల్యం చెల్లించుకోక తప్పదు.

కర్ల రాజేష్ విషయంపై ఇప్పటివరకు ఏ ప్రధాన పత్రిక ముఖ్యమైన పెద్ద వార్తగా రాయలేదు, ఒక ప్రధాన ఎలక్ట్రానిక్ మీడియా కుటుంబం వద్దకు వెళ్లి ఇంటర్వ్యూ చేయలేదు.ఎన్ టివి ఒక జర్నలిస్టుకి జరిగిన ఒక చిన్న కేసు విషయంలోనే ఎంతో ప్రచారం చేసుకుంటున్నారు ఒక దళిత బిడ్డ అన్యాయంగా చంపబడితే మాత్రం ఇప్పటి వరకు పట్టించుకోలేదు ఎంతో కొంత సోషల్ మీడియా వలన ఈ సమాజం ముందు ఈ వార్త ఉంచబడింది. ఈనెల 18న సూర్యాపేటలో ఎమ్మార్పీఎస్ మరియు అన్యానుబంధ సంఘాల రాష్ట్ర సదస్సును నిర్వహిస్తున్నాము ఈ సదస్సులోనే భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తాం.

## రాష్ట్ర ముఖ్యమంత్రి మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,
- స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు
- జి. మధుసూదన్ రెడ్డితో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించిన రాష్ట్ర పశు సంవర్ధక,పాడి అభివృద్ధి,మత్స్య,
- క్రీడల,యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



**మహబూబ్ నగర్ జనవరి16( సమయ్దం న్యూస్):** నేడు ( జనవరి 17)న మహబూబ్ నగర్ జిల్లా పర్యటనకు రానున్న ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర పశు సంవర్ధక,పాడి అభివృద్ధి,మత్స్య, క్రీడలు,యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్, శాసన సభ్యులతో కలిసి యం.వి.ఎస్. కళాశాల మైదానం లో బహిరంగ సభ ఏర్పాట్లు, చిట్టి బోయినపల్లి వద్ద గల సోషల్ వెల్ఫేర్ గురుకుల బాలికల పాఠశాల వద్ద ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. మహబూబ్ నగర్ జిల్లాలో దాదాపు 1200 కోట్ల విలువగల వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్నట్లు తెలిపారు. మన నల్లమల బిడ్డ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి పాలమూరు జిల్లా అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయడం జిల్లా ప్రజల అదృష్టమని అన్నారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు, రవాణా, సాగునీరు, తాగునీరు, అండర్గ్రౌండ్ డ్రైనేజ్, రహదారులు, భవనాల రంగాల్లో భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. జడ్చర్ల సమీపంలోని చిట్టబోయినపల్లి వద్ద రూ. 200 కోట్ల నిధులతో ఏర్పాటు కానున్న ఐఐఐటీ కళాశాల భవన నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి పాలమూరు ప్రజల ఎన్నో సంవత్సరాల ఆకాంక్ష నెరవేరబోతుందని తెలిపారు. ఐ ఐ ఐ టి బాసర నమూనాలో అత్యాధునిక వసతులతో 31 ఎకరాల స్థలంలో రూ. 200 కోట్ల అంచనా వ్యయంతో ఆధునిక సాంకేతిక కళాశాల నిర్మించబోతుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నుండి ఇక్కడి నుంచి అయిన 60-70 కిలోమీటర్ల దూరంలో విద్యార్థులకు అందరికీ అందుబాటులో ఉండేవిధంగా చిట్టిబోయన్ పల్లి వద్ద జాతీయ రహదారి పక్కనే ఐ ఐ ఐ టి కళాశాల నిర్మించబోతున్నట్లు తెలిపారు. మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ గురించి రూ. 603 కోట్ల నిధులు, పాలమూరుకు శాశ్వత మంచినీటి సరఫరా పరిష్కారానికి రూ.220 కోట్లు, యం.వి.ఎస్. కళాశాల అదనపు భవనానికి రూ. 20 కోట్లు, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ తదితర అభివృద్ధి పనులకుయం.వి.ఎస్. కళాశాల మైదానంలో శంఖుస్థాపన చేయనున్నట్లు తెలియజేశారుముఖ్యమంత్రి పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా జరుగుతున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ దేవేంద్ర ప్రతాప్, అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ ఈ. నవీన్, జిల్లా అధికారులు తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

## జనవరి 18న ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన

- జిల్లా అధికారులతో సమీక్షించిన మంత్రి పొంగులేటి



**ఖమ్మం, జనవరి 16: ( సమయం న్యూస్ )** :జనవరి 18న ఖమ్మం జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఉంటుందని, దీనికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్ర వారం మద్దులపల్లి నర్సింగ్ కళాశాల వద్ద జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం పోలీస్ కమీషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి జనవరి 18న జరుగనున్న ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించి, సంబంధిత జిల్లా అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జనవరి 18న ఉదయం 10.30 నుంచి 11 గంటల మధ్య సీఎం రేవంత్ రెడ్డి మద్దులపల్లిలో ల్యాండ్ అవుతారని అన్నారు. హెలీ ప్యాడ్ నుంచి పైలాన్ వరకు నడక మార్గంలో సీఎం వస్తారని అక్కడ గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయాలని అన్నారు. పైలాన్ వద్ద అవసరమైన అలంకరణ పనులు పూర్తి చేయాలని అన్నారు. జెఎన్టియు కళాశాల భవన నిర్మాణానికి, మున్నేరు నుండి పాలేరు లింక్ కెనాల్ కు శంకుస్థాపనలు, నూతన యార్డు, కూసు మంచి 100 పడకల ఏరియా ఆసుపత్రి ప్రారంభోత్సవ పైలాన్ ఆవిష్కరణ, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని అన్నారు.

జిల్లా ఇంచార్జి కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించే కార్యక్రమాలకు సంబంధించిన పైలాన్ శనివారం వరకు సిద్ధం అవుతుందని అన్నారు. పైలాన్ వద్ద భూమి పూజ నిర్వహించి సభ ప్రాంగణానికి చేరుకునేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. హెలీ ప్యాడ్ వద్ద వివిఐపీలు, మంత్రుల, సీఎం కాన్వాయ్ వాహనాలు మాత్రమే అనుమతించడం జరుగుతుందని మిగిలిన ప్రజాప్రతినిధుల వాహనాలకు పార్కింగ్ సౌకర్యం సభ వద్ద ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సిపి సునీల్ దత్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఆన్ లైన్ దరఖాస్తులు.



**మహబూబాబాద్ జనవరి16( సమయం న్యూస్) :** ఈ రోజు కలెక్టరేట్ మహబుబాబాద్‌లో, 2026-27 విద్యా సంవత్సరం కోసం 5వ తరగతి మరియు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బాలురు మరియు బాలికల కోసం TGMRIES ఆన్‌లైన్ అడ్మిషన్స్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను జిల్లా అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ K ANIL KUMAR GURU ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్ మాట్లాడుతూ మైనారిటీ మరియు నాన్ మైనారిటీ తల్లిదండ్రులు తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ రిజిస్ట్రేషన్ 16-01-2026 నుండి 28-02-2026 వరకు ఉంటుంది. తెలంగాణ ప్రభుత్వం మైనారిటీ పాఠశాలలు మరియు కళాశాలలను మైనారిటీ పిల్లల అభివృద్ధి కోసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని హాస్టల్ సౌకర్యాలతో అంతర్జాతీయ ప్రామాణిక విద్య ఈ సంస్థలలో ఇవ్వబడుతుంది. చివరి తేదీ వరకు వేచి ఉండకుండా తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ సంస్థలలో చేర్పించాలని. మరియు VI, VII మరియు VIII తరగతులలో బ్యాక్‌లాగ్ సీట్లకు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో DMWO మహబుబాబాద్ బి. శ్రీనివాస రావు సర్, మహబుబాబాద్ మైనారిటీ సంస్థల ప్రిన్సిపాల్స్,సిబ్బంది పాల్గొన్నారు.

## కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు సంక్రాంతి(కనుమ) శుభాకాంక్షలు తెలిపినతాజా మాజీ కౌన్సిలర్ ఆర్ మధుసూదన్ యాదవ్

- కొడంగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చేర్పర్సన్ వాణిశ్రీ యాదవ్






**కొడంగల్ మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** కొడంగల్ పట్టణ కేంద్రంలోని వారి నివాసంలో సంక్రాంతి పండుగ సందర్భంగా రంగవల్లులు కార్యక్రమంలో భాగంగా ముగ్గులు వేసి పతంగులు ఎగరవేసి వారి కుటుంబ సభ్యులు మరియు కాలనీవాసులు మహిళలు పెద్దలు చిన్నలు అందరి ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుని అలాగే కొడంగల్ నియోజకవర్గం ప్రజలకు మరియూ కాలనీ వాసులకు పెద్దలకు చిన్న లకు మహిళలకు అందరికీ సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపిన మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ రెండవ వర్డ్ కౌన్సిలర్ ఆర్.మధుసుధన్ యాదవ్,మార్కెట్ కమిటీ మాజీ వైస్ చేర్పర్సన్ వాణిశ్రీ యాదవ్.

## యవ్వనంలో విడిపోయిన ప్రేమికులు 65ఏళ్ల వయసులో ఒక్కటయ్యారు..



**కేరళ:** ముందక్కల్‌కు చెందిన జయప్రకాష్, రష్మి యుక్త వయస్సులో ఉన్నప్పుడు ఒకరినొకరు ప్రేమించుకున్నారు. ఇద్దరికీ ఒకరంటే ఒకరికి ఇష్టం ఏర్పడింది.అయితే తమ ప్రేమ గురించి పెద్దవాళ్లకు చెప్పడానికి భయపడ్డారు. దీంతో రష్మికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో పెళ్లి చేసేశారు.జయప్రకాష్ ఉద్యోగం కోసం విదేశాలకు వెళ్లిపోయాడు.ఆ తర్వాత జయప్రకాష్ కూడా పెళ్లి చేసుకుని స్థిరపడిపోయాడు. ఇద్దరికీ పిల్లలు ఉన్నారు.పదేళ్ల క్రితం రష్మి భర్త చనిపోయాడు. జయప్రకాష్ ఐదేళ్ల క్రితం భార్యను కోల్పోయాడు. రష్మిని ఓ షార్ట్ ఫిల్మ్ లో చూసిన జయప్రకాష్ ఆమెను సంప్రదించాడు. వారి ఇద్దరి పిల్లలు పెద్ద మనసుతో ఆలోచించి వారిని ఒక్కటి చేశారు. స్వచ్ఛమైన ప్రేమ ఆలస్యమైనా ఎప్పుడో ఒకప్పుడు గమ్యాన్ని చేరుకుంటుందని వారు నిరూపించారు.

## NTV జర్నలిస్ట్ దొంతు రమేష్ అక్రమ అరెస్టుపై NHRC కేసు నమోదు

**హైదరాబాద్ జనవరి16( సమయం న్యూస్).:** NTV జర్నలిస్ట్ దొంతు రమేష్‌ను అక్రమంగా అరెస్టు చేశారన్న ఆరోపణలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (NHRC) కేసు నమోదు చేసింది. ఈ మేరకు మానవ హక్కుల న్యాయవాది రామారావు చేసిన ఫిర్యాదును స్వీకరించిన ఘటనపై విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించింది. జర్నలిస్టుల స్వేచ్ఛ, మానవ హక్కుల పరిరక్షణ అంశాల్లో ఈ ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## అర్ధరాత్రి చెంగిచెర్లలో దొంగల హల్‌చల్.. 12 ఇళ్లలో చోరీ

**చెంగిచర్ల జనవరి16 ( సమయం న్యూస్).:** హైదరాబాద్ మహానగరం లోని మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధి చెంగిచెర్ల ప్రాంతంలో దొంగలు బీభత్సం సృష్టించారు. గురువారం అర్ధరాత్రి కార్లలో వచ్చిన గుర్తుతెలియని దుండగులు పక్కా ప్రణాళికతో ఏకంగా 12 ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు.చేతుల్లో కత్తులు పట్టుకుని పరిసరాల్లో తిరుగుతూ స్థానికులను భయాందోళనకు గురి చేసే విధంగా దుండగులు బంగారం, నగదుతో పరారైనట్లు సమాచారం. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీమ్ ఘటన స్థలంలో ఆధారాలు సేకరిస్తోంది.

## కాగజ్ నగర్ లో కేరళ ఎక్స్‌ప్రెస్ హాల్టింగ్ సౌకర్యం ప్రయాణికులకు శుభవార్త

**కాగజ్ నగర్ జనవరి 16( సమయం న్యూస్). :** కాగజ్ నగర్ లో కేరళ ఎక్స్‌ప్రెస్ ఆగనుంది: ప్రయాణికులకు శుభవార్తసిర్పూర్ కాగజ్ నగర్ రైల్వే స్టేషన్ లో 12626/25 న్యూఢిల్లీ-తిరువనంతపురం కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైలు త్వరలో ఆగనుంది. ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్, సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ కు విన్నవించడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో సిర్పూర్ కాగజ్ నగర్, పరిసర ప్రాంతాల ప్రజలు శబరిమల, తిరుపతి వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్ళడానికి సులభతరం కానుంది. ప్రజల ఎన్నో ఏళ్ల కల నెరవేరడమేనని భావిస్తున్నారు.

## కొత్త సర్పంచ్‌లకు శిక్షణ.. ఒక్కొక్కరికి రూ.5,000 ఖర్చు..

**హైదరాబాద్ జనవరి16( సమయం న్యూస్).:** తెలంగాణ : రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 21 వరకు శిక్షణ తరగతులు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (టీజీఐఆర్డీ) ఆధ్వర్యంలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి జిల్లాలోని సర్పంచులను ఐదు బృందాలుగా విభజించి (ఒక్కొక బృందం లో 50 మంది) 5 రోజుల పాటు ఆయా జిల్లాల్లో తరగతులు నిర్వహిస్తారు. వారికి బస, భోజనం, శిక్షణా ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ.5,000 వరకు వెచ్చిస్తారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది.సర్పంచులకు వారి అధికారాలు, విధులు, పాలన, ఆర్థిక నిర్వహణ, నిధులు, గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించనున్నారు.

# మున్సిపల్ఎన్నికలకు ఎలాంటి లోటు పాట్లు ఉండవద్దు.

● జిల్లా కలెక్టర్



**జనగాం జనవరి16( సమయం న్యూస్) :** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లను సజావుగా చేయాలనీ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు మున్సిపల్ రిజర్వేషన్ ప్రక్రియ పైన శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ మినీ కాన్ఫరెన్స్ హాల్ లో రివ్యూ తీసుకున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...మున్సిపాలిటీ లో వార్డుల రిజర్వేషన్ పైన ప్రభుత్వం నోటిఫికేషన్ లో తెలిపిన మార్గనిర్దేశకాల ప్రకారం సీట్ల కేటాయింపు జరగాలన్నారు పారదర్శక విధానం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు ఈ సమావేశం లో ఆర్డివో లు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు

# మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాల ప్రవేశ ప్రచార కర పత్రాల విడుదల



**నారాయణపేట,జనవరి,16(సమయం న్యూస్) :** తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలాలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రారంభానికి సంబంధించిన ప్రచార కరపత్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నారాయణపేట జిల్లా పరిధిలోగల ఒక బాలుర పాఠశాల, ఒక బాలికల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశాలు అన్ని వర్గాలకు అలాగే 6వ 7వ 8వ తరగతులు మైనార్టీ వర్గాలకు మాత్రమే దరఖాస్తుల ఆహ్వానించడం జరుగుతుందని ఆమె తెలిపారు. కళాశాలలు : టీ.జీ.ఎం.ఆర్.జే సి-బాలికలు, మక్తల్ (ఎంపీసీ,బైపీసీ), టీ.జీ.ఎం.ఆర్.జే సి బాలురు, నారాయణపేట (ఎంపీసీ,బైపీసీ), ఇంటర్మీడియట్ మొదటి సంవత్స రంలో ప్రవేశలకు ఫ్రీ ఆన్లైన్ రిజిస్ట్రేషన్ వెబ్ సైట్ : tgmreistelangana.cgg.gov.in ద్వారా లేదా పాఠశాల/ కళాశాలలలో సంప్రదించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ ఆఫీసర్ షమీం , విజిలెన్స్ ఆఫీసర్స్ జమీర్ ఖాన్, మసూద్ , ప్రిన్సిపల్స్ డా. జగదీశ్వర్ , ఖాజా మహబూబ్ ఖాన్ , ఎలిజబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# నందారం శ్రీనివాస్ గుప్తా పార్థివ దేహానికి నివాళులర్పించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** కొడంగల్ మండల్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ నందారం ప్రశాంత్ తండ్రి నందారం శ్రీనివాస్ గుప్తా స్వర్గస్తులయ్యారని విషయం తెలుసుకొని వారి పార్థివ దేహానికి నివాళులర్పించిన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ ఆర్ మధు సుధన్ యాదవ్, బొంరాస్ పేట్ మండల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కోట్ల యాదగిరి కొడంగల్ మండల్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు రుద్రారం దామోదర్ రెడ్డి, బొంరాస్ పేట్ మండల్ పిఏసిఎస్ మాజీ చైర్మన్ విష్ణు వర్ధన్ రెడ్డి, సమన్వయ కమిటీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, బొంరాస్ పేట్ మండల్ వైస్ ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, దౌల్తాబాద్ మాజీ జెడ్పీటీసీ పాకిరప్ప, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# బొంబాయ్ మున్సిపల్ ఎన్నికలో ఏ ఐ ఎం ఐ ఎం


**బొంబాయి జనవరి16 ( సమయం న్యూస్).:** దీవీజ ఎన్నికల్లో 32 మంది అభ్యర్థులకు గాను రెండు స్థానాలను గెలుచుకుంది, అభ్యర్థి మెహజబీన్ ఖాన్ వార్డ్ నంబర్ 134 నుండి గెలుపొందారు ఎ.ఐ.ఎం.ఐ.ఎం ఖైరున్నీసా అక్బర్ హుస్సేన్ వార్డ్ నంబర్ 145 నుండి గెలిచారు ఒక స్థానంలో ఆధిక్యంలో ఉన్నారు... శంభాజీనగర్ మున్సిపల్ కార్పొరేషన్లో, ఎ.ఐ.ఎం.ఐ.ఎం 116 స్థానాల్లో 16 స్థానాలను గెలుచుకుంది, ముఖ్యమైన పోటీదారులలో ఒకటిగా నిలిచింది, ధూలేలో, పార్టీ 74 మంది సభ్యుల పౌర సంస్థలో ఎనిమిది స్థానాలను గెలుచుకుంది, అమరావతి మున్సిపల్ కార్పొరేషన్లో, ఎ.ఐ.ఎం.ఐ.ఎం 87 వార్డుల కార్పొరేషన్లో మూడు స్థానాలను గెలుచుకుంది, జల్నాలో, పార్టీ 65 మంది సభ్యుల మున్సిపల్ సంస్థలో రెండు స్థానాలను గెలుచుకుంది, మాలేగావ్ మున్సిపల్ కార్పొరేషన్లో, ఎ.ఐ.ఎం.ఐ.ఎం 84 మంది సభ్యుల మున్సిపల్ సంస్థలో నాలుగు స్థానాలను గెలుచుకుంది, పర్భానీలో, పార్టీ 65 మంది సభ్యుల పౌర సంస్థలో ఒక స్థానాన్ని గెలుచుకుంది. దీవీజ ఎన్నికల్లో, ఎ.ఐ.ఎం.ఐ.ఎం ఇప్పటివరకు రెండు స్థానాలను గెలుచుకుంది, 227 సభ్యుల కార్పొరేషన్‌కు కౌంటింగ్ కొనసాగుతున్నందున అధికారిక ట్రెండ్‌లు కూడా పార్టీ రెండు వార్డులలో ముందంజలో ఉన్నట్లు చూపిస్తున్నాయి...

# క్రీడలు సోదర భావాన్ని పెంపొందిస్తాయి



**దామరగిద్ద మండలం, జనవరి,16(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల పరిధిలోని అయ్యవారిపల్లి లో గత మూడు రోజులుగా( డి వై ఎఫ్ ఐ)ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం కార్యక్రమం లో పాల్గొన్న సీపీఎం మండల కార్యదర్శి అంజిలయ్య గౌడ్,దేశాయ్ పల్లి సర్పంచి లాలప్ప,అయ్యవారిపల్లి సర్పంచి అనంతమ్మ మాట్లాడుతూ క్రీడలు శరీరక దృఢత్వాన్ని మానసిక ఉల్లాసాన్ని సోదర భావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ప్రస్తుత హైటెక్ యుగంలో ప్రజలు పూర్తిగా ఇంటర్నెట్లో మమేకమై మానసిక ఒత్తిడితో కుమిలిపోతున్న ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతాలలో లౌకిక, ప్రజాస్వామ్య ,స్వభావంతో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని గ్రామంలో పూర్తిగా సోదర భావాన్ని పెంపొందించుకొని జన్మనిచ్చిన గ్రామం పై సుదూర ప్రాంతంలో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులకు సైతం గ్రామం పై ప్రేమ అభిమానాలు పెరుగుతాయని అన్నారు. ప్రస్తుతం యువత మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం సేవించుకుంటూ చెడల్వాట్లకు బానిసలు కాకుండా పండగ సమయంలో కుటుంబ సభ్యులతో ఆనందంగా గడుపుతూ క్రీడలలో పాల్గొంటారని వారన్నారు. ప్రశాంత వాతావరణంలో సోదర భావంతో క్రీడలు నిర్వహించుకోవడం చాల సంతోషమ న్నారు. క్రీడలలో గెలుపు ఓటములు సహజమని ఓటమిని కూడా సంతోషంగా స్వీకరించాలని సూచించారు. కార్యక్రమం లో ఉప సర్పంచులు శ్రీకాంత్ రెడ్డి, మహేందర్, డి వై ఎఫ్ ఐ నాయకులు గోవింద, నవీన్ సాయి, భీమాసేన్,గ్రామ పెద్దలు వెంకటయ్య,బి లాలప్ప,బలవర్ధన్ రెడ్డి, రఘుపతి రెడ్డి, అయ్యాగ్రామాల వార్డు మెంబర్లు రవి హన్మంతు, అంజప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు...

# ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఖమ్మంలో ట్రాఫిక్ ఆంక్షలు: ట్రాఫిక్ ఏసీపీ



**ఖమ్మం, జనవరి 16 : ( సమయం న్యూస్ )** ఈనెల 18వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు ఖమ్మంలో ట్రాఫిక్ మళ్లింపు ఆంక్షలు అమలులో ఉంటాయని ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాసులు తెలిపారు. కావున వాహన ప్రయాణికులు ట్రాఫిక్ ఆంక్షల మళ్లింపును దృష్టిలో పెట్టుకుని పోలీసులు సూచించిన ప్రత్యామ్నాయ మార్గాల లో ప్రయాణించి తమ గమ్యస్థానానికి చేరుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా భారీ వాహనాలు, లారీలకు ఇబ్బందులు తలెత్తకుండా.. ట్రాఫిక్ సజావుగా వెళ్లే వరకు హెల్డింగ్ పాయింట్లలో నిలుపుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ ఆంక్షలు నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ రద్దీ మరింత పెరుగుతున్న దృశ్య నగర ప్రజలు, వాహనదారులు అవసరం ఉంటే తప్ప తమ వాహనాలను రోడ్లపైకి తీసుకురావద్దని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు

- ఖమ్మం మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు రాజమండ్రి- దేవరపల్లి - జంగారెడ్డిగూడెం- అశ్వారావుపేట- సత్తుపల్లి- భద్రాచలం- కొత్తగూడెం - మణుగూరు మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనాలు (కార్లు, చిన్న వాహనాలు మాత్రమే) కల్లూరు మరియు వైరా సోమవరం గ్రామం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కి కోదుమూరు వద్ద హైవే దిగి అల్లిపురం మీదుగా బోనకల్ రోడ్డు చేరుకొని ధంసలపురం బ్రిడ్జి దగ్గర నుండి మరల గ్రీన్ ఫీల్డ్ హైవే ఎక్కి హైదరాబాద్ వెళ్ళవలసి ఉంటుంది.
- హైదరాబాద్ నుంచి భద్రాచలం / కొత్తగూడెం వైపు వెళ్లే వాహనాలు

హైదరాబాద్ నుండి భద్రాచలం- కొత్తగూడెం సత్తుపల్లి - అశ్వారావుపేట- -రాజమండ్రి వెళ్ళు వాహనాలు పొన్నెకల్లు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే మీదుగా వెంకటగిరి క్రాస్ రోడ్ వద్ద హైవే దిగి (కార్లు,చిన్న వాహనాలు మాత్రమే) ప్రకాష్ నగర్, చర్చి కాంపౌండ్, ముస్తఫా నగర్, అల్లిపురం మీదుగా కోదుమూరు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే బ్రిడ్జి కింద నుండి వందనం మీదుగా కొత్త కలెక్టరేట్ సమీపంలోని వైరా రోడ్డు చేరుకొని భద్రాచలం - రాజమండ్రి వైపు వెళ్ళవలసి ఉంటుంది.


- సత్తుపల్లి / అశ్వారావుపేట నుంచి వరంగల్ వైపు వెళ్లే వాహనాలుసత్తుపల్లి -అశ్వారావుపేట నుంచి వరంగల్ వైపునకు వెళ్లె వాహనాలు ఖమ్మం కలెక్టరేట్ దాటిన తర్వాత ఎస్ఆర్ గార్డెన్ నుంచి రఘునాథపాలెం ఆపిల్ సెంటర్ మీదుగా లింగాల చేరుకొని దోర్నకల్- మహబూబాద్ మీదుగా వరంగల్ వెళ్ళవలసి ఉంటుంది.
- ఇల్లందు నుంచి ఖమ్మం పట్టణంలోకి వచ్చే వాహనాలు

ఇల్లందు నుండి ఖమ్మం పట్టణంలోకి వచ్చే వాహనాలు రఘునాథపాలెం ఆపిల్ సెంటర్ నుండి ఎస్సార్ గార్డెన్ వచ్చి గోపాలపురం- గొల్లగూడెం మీదుగా లకారం చేరుకొని ఖమ్మం పట్టణంలోకి వెళ్లవలసి ఉంటుంది.

- వరంగల్ నుంచి ఖమ్మం / సత్తుపల్లి / కొత్తగూడెం వైపు వచ్చే వాహనాలువరంగల్ నుండి సత్తుపల్లి - రాజమండ్రి- కొత్తగూడెం మరియు ఖమ్మం పట్టణం లోకి వచ్చే (కార్లు, చిన్న వాహనాలు మాత్రమే) ఎదులాపురం ఎక్స్ రోడ్ నుంచి వరంగల్ క్రాస్ రోడ్ మీదుగా నాయుడుపేట చేరుకొని అక్కడి నుండి గాంధీ చౌక్ మీదుగా చర్చి కాంపౌండ్ ముస్తఫానగర్- అల్లిపురం కోదుమూరు వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే బిడ్జి కింద నుండి వందనం మీదుగా కొత్త కలెక్టరేట్ సమీపంలోని వైరా రోడ్డుకు వెళ్లవలసి ఉంటుంది.

# అంకిరెడ్డి పల్లి వైన్స్ వద్ద మౌలిక సదుపాయాలు కరువు

● గ్రామస్తులకు కొనసాగుతున్న అసౌకర్యం.



**రాయపోల్,జనవరి 16:** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలోని వైన్స్ వద్ద ఉన్న పర్మిట్ రూంలో మౌలిక సదుపాయాల లేమితో ప్రజలకు ఇబ్బందిగా మారింది. పర్మిట్ రూంలో మద్యం సేవించిన అనంతరం మూత్రశాలల సౌకర్యం లేకపోవడంతో కొందరు రోడ్లపైన,సమీపంలోని రైతుల పొలాల వద్ద మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.దీంతో పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్రత నెలకొంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ముఖ్యంగా మహిళలు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అంతేకాకుండా,చేతులు శుభ్రం చేసుకునేందుకు నీటి సదుపాయం లేకపోవడం వల్ల పర్మిట్ రూంకు వచ్చే వారు అసౌకర్యానికి గురవుతున్నారని పేర్కొన్నారు.ఈ పరిస్థితి వల్ల రైతుల పొలాలు కలుషితమవుతున్నాయని,గ్రామ వాతావరణం దెబ్బతింటోందని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వైన్స్ వద్ద మూత్రశాలలు, తాగునీరు,చేతులు కడుక్కునే నీటి సౌకర్యం వంటి మౌలిక వసతులు వెంటనే ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు

# ఘనంగా సంక్రాంతి సంబరాలు

● ఊరు వాడ సంక్రాంతి పండుగ వాతావరణం..

● రంగవల్లులతో మహిళలు,యువతులు ఉత్సాహం.

● వీధులలో గంగిరెద్దుల విన్యాసాలు,హరిదాసుల కీర్తనలు..



**కోస్గి మున్సిపల్ జనవరి,16(సమయం న్యూస్) :** మకర సంక్రాంతి పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు.నారాయణపేట జిల్లా కోస్గి మున్సిపల్ తో పాటు మండల ప్రజలు సంక్రాంతి వేడుకల్లో భాగంగా ఇంటి ముందు రంగు రంగుల ముగ్గులు వేసి,ఉత్సాహంగా గాలి పాటలను ఎగురవేశారు.ఊరూరా మకర సంక్రాంతి పండుగ వేడుకలలో ప్రజలు మునిగిపోయారు. యువతులు,మహిళలు ఇంటింటా ముత్యాల ముగ్గులు,రంగవల్లులు అద్భుతా గొబ్బెమ్మలను ముగ్గులలో అలంకరించి నవధాన్యాలతో పూజలు చేసి సంక్రాంతి లక్ష్మికి నైవేద్యాలతో నివేదన చేసి ప్రత్యేక పూజలు చేసి లక్ష్మీ దేవిని ఇళ్లలోకి ఆహ్వానించారు. ఇంటిల్లిపాది సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో గంగిరెద్దులను,డూడు బసవన్నలను ఇంటింటి తిప్పుతూ,హరిదాసు కీర్తనలతో పండగ వాతావరణం సందడిగా మారింది. యువకులు గాలి పటాలను ఎగురవేస్తూ పతంగుల పోటీలను జరుపుకున్నారు.గ్రామీణ ప్రాంతాలలో యువత క్రికెట్,వాలీబాల్ పోటీలలో పాల్గొని ఉత్సాహంగా పండగ సంబరాలను జరుపుకున్నారు.అదే విధంగా కోస్గి పట్టణంలో ఏకో ఫ్రెండ్లీ అసోసియేషన్ తరుపున కళాశాల మైదానంలో పతంగుల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు.

# రుణాలు సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి సాధించాలి

- పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి
- మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల 15 లక్షల బ్యాంక్ రుణాల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే



**పరిగి మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.2 కోట్ల 15 లక్షల బ్యాంక్ రుణాల చెక్కులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీఆర్ఆర్ మాట్లాడుతూ, ఈ రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు స్వయం ఉపాధి సాధించి తమ కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగు పర్చుకోవాలని సూచించారు. మహిళల ఆర్థిక ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి భద్రత, సౌకర్యాలు పెరిగాయని అన్నారు. అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు ఆర్టీసీ బస్సులను అద్దెకు నడుపుకునే అవకాశాన్ని కల్పించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారని తెలిపారు. ఇది మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలకంగా మారుతుందన్నారు. ఇక మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించడంతో పాటు, స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలు మరణించిన పక్షంలో ప్రభుత్వం తరపున రూ.10 లక్షల బీమా సహాయం అందించే విధానం అమలులో ఉందని, ఇది మహిళల కుటుంబాలకు భరోసా కల్పించే చర్యగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# గడీల నరేష్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు



**ఖమ్మం, జనవరి 16 : సమయం న్యూస్ ) :** భారతీయ జనతా పార్టీ ఒకటవ పట్టణ అధ్యక్షులు గడీల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక 23వ డివిజన్ లో శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మూడవ రోజైన కనుమ పండుగ రోజు ఘనంగా డివిజన్ మహిళల కోసం ముగ్గుల పోటీలు నిర్వహించారు .భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతీకగా ఈ పండుగను జరుపుకుంటారు, కొత్త పంట చేతికి వచ్చి తరువాత రైతులు వ్యాపారస్తులు ఆనందదాయకంగా జరుపుకునే మొదటి పండుగగా సంక్రాంతిగా నిర్వహిస్తుంటారని బిజెపి వన్ టౌన్ అధ్యక్షులు గడిల నరేష్ అన్నారు. బిజెపి సీనియర్ నాయకులు దోకూపర్తి రవీందర్, ఖమ్మం జిల్లా ఓబీసీ అధ్యక్షులు టేకుమట్ల వీరు గౌడ్, రామ్మోహన్ సహకారం తొ ఈ ముగ్గుల పోటీని నిర్వహించుకున్నందుకు సంతోషం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమం నకు ముఖ్య అతిధులుగా ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు గారు, రాష్ట్ర నాయకులు నల్గొండ జిల్లా ఇంచార్జ్ సన్నే ఉదయ్ ప్రతాప్ పాల్గొనగా మొదటి బహుమతి ( గ్రైండర్) లక్ష్మి ప్రవంతి రెండవ బహుమతి (మిక్సీ ) నీరజ 3 బహుమతి (రైస్ కుక్కర్ ) నవ్య లకు బహుకరించారు. ఈ కార్యక్రమం లొ అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య,జిల్లా ఉపాధ్యక్షులు వీరవెల్లి రాజేష్ గుప్తా, ఉపాధ్యక్షులు వన్ టౌన్ ఇంచార్జ్ రవి రాథోడ్, జిల్లా నాయకులు తుమ్మ శివ, బండ్ల రిగాన్, కొలిపాక శ్రీదేవి,పొట్టిమూతి జనార్దన్, మండల నాయకులు పాలేపు రాము, పొట్టిమూతి వాణి, కడుదుల ప్రభాకర్, బొడ్ల శ్రీను, తుమ్మ ఇందు, నాయకులు గడీల రాఘవేంద్ర రావు,మేడ సంపత్, లోడంగి సత్యనారాయణ స్వప్న, గార్లు పాల్గొన్నారు

# పర్యావరణ తాపత్రయం.




**కోస్గి మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** సంక్రాంతి అంటేనే ఒక పకృతి పండుగ..పాడిపంటలతో ప్రతి ఇల్లు కళకళలడడమే కాదు... రంగు రంగుల ముగ్గులతో వాకిళ్ళు ఎంతో ఆహ్లాదం పంచుతాయి. అంతే కాదు.. ప్రతిజీవి మనుగడ ప్రకృతితో అనుబంధం కల్గి ఉంటుంది. అలాంటి ప్రకృతిని కాపాడుకోవడంలో ఎంత మాత్రం నిర్లక్ష్యం తగదు అంటూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తూ ఈ ముగ్గు ప్రత్యేక ఆకర్షణ గా నిలుస్తూ అందరిలో ఆలోచన కల్గించింది. కోస్గి పట్టణం లోని శివాజీనగర్ ప్రాంతానికి చెందిన ఐశ్వర్య అనే యువతి ఈ ముగ్గును తన ఇంటి ముంగిట వేసి ప్రకృతి పట్ల తన ప్రేమను చాటుకుంది. ఈ సందర్భముగా సేవ్ నేచర్ ప్రతినిధి వార్ల మల్లేశం విజ్ఞప్తి మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రకృతి ప్రేమికులు స్పందిస్తూ పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను గుర్తు చేస్తూ ముగ్గులు వేయగా ఆయన అందరికి ధన్యవాదములు తెలిపారు.

# 19 వ తేదీ ప్రజావాణి రద్దు.

**మెదక్ జనవరి16( సమయం న్యూస్).:** ఈ నెల 19 వ తేదీ (సోమవారం) నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయం తో పాటు నాలుగు మున్సిపాలిటీ ఏరియాలలో వాయిదామిగతా మండలాలలో తాసిల్దార్ కార్యాలయలలో యధావిధిగా ప్రజావాణి మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్మున్సిపాలిటీ ఎన్నికల సన్నహాకా పనులలో అధికారుల నిమగ్నమైనందువల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపల్ ఏరియాలో వాయిదా వేసినట్టు ,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ నేడు ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సన్నాహక పనులు ముఖ్యమైన కార్యకలాపాలలో జిల్లా స్థాయి అధికారులు నిమగ్నమై ఉన్న నేపథ్యంలో, ఈ నెల 19 న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని మెదక్ జిల్లాలోని కలెక్టరేట్ కార్యాలయంతో పాటు నాలుగు మున్సిపాలిటీ ఏరియాలలో ప్రజావాణి తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు వెల్లడించారు. మిగతా మండలాలలో తాసిల్దార్ కార్యాలయాల్లో యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని కలెక్టర్ వెల్లడించారుఇట్టి విషయాన్ని జిల్లా ప్రజలు గమనించి సహకరించాలని కలెక్టర్ కోరారు.

# 2026-27 విద్య సంవత్సరమునకు గాను admissions poster ఆవిష్కరణ



**కరీం నగర్ జనవరి16( సమయం న్యూస్) :** కరీంనగర్ : తెలంగాణ మైనార్టీ పాఠశాలలు మరియు కళాశాల లో 2026-27 సంవత్సరమునకు గాను ..ఐదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం MPC, BiPC ,M.E.C,C.EC and Vocational MLT, ET గ్రూపులలో అడ్మిషన్స్ ప్రారంభమయ్యాయి. అలాగే ఆరు, ఏడు ,ఎనిమిదవ తరగతులలో మైనార్టీ మిగులు సీట్లు కూడా కలవు. కావున తల్లిదండ్రులు పాఠశాల మరియు కళాశాల లో అప్లై చేసుకోవాలని ఈ రోజు అదనపు కలేక్టర్ dr Ashwini tanaji wakade గారి చేతుల మీదుగా ఖసఎఱంంఱశీఅ జూశీర్‌వతీ ఆవిష్కరణ జరిగింది. అలాగే COE లో IIT/NEET eT]jáTT EAPCET coaching ఇవ్వబడును. ఆన్లైన్ లో www.tgmreistelangan.cgg.gov.in ýËnull తేదీ 16/1/2026 నుండి 28/02/2026 లోపు అప్లై చేసుకోవాలి. కరీంనర్ జిల్లా లో 5 బాయ్స్ మరియు 4 బాలికల విద్య సంస్థలు కలవు. ఈ కార్యక్రమం లో =ాజ విమల గారు,విజిలేన్స అధికారులు అక్రం పాషా ,ఇంతీయజ్ , ప్రిన్సిపాల్స వీర్ల మహేష్,పోరండ్ల చంద్రమోహన్,పిడిశేట్టీ సంపత్,కనిపర్త సురేష్, మౌనిక సోని మరియు వార్డేన్స సైఫుద్దిన్, ఉస్మాన్ పాల్గొన్నారు

# కోడి పందేల్లో రూ. కోటిన్నర గెలిచాడు..

సంక్రాంతి సందర్భంగా రాష్ట్రంలోని చాలా చోట్ల కోడి పందేలు జరుగుతున్నాయి. ప.గో జిల్లా తాడేపల్లిగూడెంలో ఓ వ్యక్తి కోడి పందేల్లో రూ. కోటిన్నర గెలిచాడు. పైబోయిన వెంకటరామయ్య బరిలో రాజమండ్రి రమేశ్, గుడివాడ ప్రభాకర్ కోళ్ల మధ్య పోటీ జరిగింది. ఃసేతువః కోడిపై రమేశ్కు చెందిన ఃదేగః కోడి నెగ్గడంతో అతడు రూ. 1.53కోట్లు గెలుచుకున్నాడు. ఈ ఏడాది ప.గో జిల్లాలో ఇదే భారీ పందెం అని స్థానికులు చెబుతున్నారు.

# ప్రధానమంత్రి జనవరి 17-18 తేదీలలో అస్సాంలో పర్యటిన.

**న్యూ డిల్లీ జనవరి16( సమయం న్యూస్) :** జనవరి 17న బోడో సమాజం యొక్క గొప్ప వారసత్వాన్ని చాటిచెప్పే చారిత్రాత్మక సాంస్కృతిక కార్యక్రమం "బగురుంబా ద్వొ 2026"లో ప్రధానమంత్రి పాల్గొననున్నారుబోడో సమాజానికి చెందిన 10,000 మందికి పైగా కళాకారులు బగురుంబా నృత్యం ప్రదర్శించనున్నారుకలియాబోర్‌లో రూ. 6,950 కోట్లకు పైగా విలువైన కాజీరంగా ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి భూమి పూజ చేయనున్నారుఈ ప్రాజెక్టు జంతువుల నిరంతర రాకపోకలను నిర్ధారిస్తుంది, మానవ-వన్యప్రాణుల సంఘర్షణను తగ్గిస్తుంది మరియు ప్రాంతీయ అనుసంధానాన్ని కూడా మెరుగుపరుస్తుందిగౌహతి (కామాఖ్య)ఉరోహ్‌తక్ మరియు డిబ్రూగఢ్ఉలక్నో (గోమతి నగర్) మధ్య నడిచే 2 కొత్త అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రధానమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు

# హయగ్రీవ స్వామి హెూమంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి.



**మక్తల్ మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** ఆంజనేయస్వామి ఆలయంలో శుక్రవారం తెల్లవారుజామున నిర్వహిస్తున్న లక్ష్మి సమేత హయగ్రీవ స్వామి హెూమంలో మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. గత కొన్ని నెలలుగా పట్టణంలోని అత్యంత పురాతనమైన పడమటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రతినెల లోక కళ్యాణార్థ తిథి నక్షత్రాన్ని పురస్కరించుకొని తెల్లవారు జామున ఆలయం ఆవరణలో ఆలయ ధర్మకర్త ప్రాణేష్ ఆచారి. ఉడిపి పీఠం ఫేజావరు మఠు వేద పండిత శిక్షకుడు రాఘవేంద్ర చారి ఆధ్వర్యంలో కొనసాగుతున్న హెూమంలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా పాల్గొని హెూమాన్ని కొనసాగింపుకు సంకల్పం చేశారు అనంతరం మంత్రికి తీర్థ ప్రసాదాలను అందజేసి స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదించారు

# సంప్రదాయాలు కొనసాగించాల్సిన బాధ్యత అందరిది

- జ్యోతి బీమ్ భరత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు



**చేవెళ్ల, 16 జనవరి (సమయం)** సంస్కృతి సంప్రదాయాలు అనుసరించాల్సిన బాధ్యత నేటి సమాజం స్త్రీలపై ఎంతో ఉందని కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు జ్యోతి బీమ్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండలంలో మాచన్పల్లి, అంతిరెడ్డి గూడ గ్రామంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ముగ్గుల పోటీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వారు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని కోరారు. సంస్కృతి సంప్రదాయలే కాకుండా రాజకీయాల్లో కూడా రాణించాలని సూచించారు. ముగ్గుల పోటీలో గెలుపొందిన మహిళా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిసిసి కార్యదర్శి రాంరెడ్డి, గ్రామ అధ్యక్షుడు మిర్యాల రమేష్, ప్రవీణ్ గౌడ్, ఉన్నారు.

# స్వయం ఉపాధి పై నేడు అవగాహన సదస్సు

**బాన్సువాడ జనవరి16(సమయం న్యూస్) :** నేడు బాన్సువాడ పట్టణంలోని పాత అంగడి బజార్‌లో డ్వాక్రా మహిళల కోసం ప్రత్యేక స్వయం ఉపాధి అవగాహన సదస్సు నిర్వహించబడనుంది. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు శ పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో హైదరాబాద్ నుంచి వచ్చిన స్మాల్ ఇండస్ట్రీ నిపుణులు మసాలా యంత్రాలు, పిండి మిల్లులు, ప్యాకింగ్ మెషిన్లు, పేపర్ ప్లేట్ మరియు అగరబత్తీ తయారీ యూనిట్లను ప్రత్యక్షంగా ప్రదర్శించి శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే బ్యాంకు రుణాలు, ప్రభుత్వ సబ్సిడీలు,ముద్రా డిజిటల్ మార్కెటింగ్ మరియు స్థానిక మార్కెటింగ్‌పై పూర్తి అవగాహన కల్పించనున్నారు. కావున బాన్సువాడ పట్టణంలోని అన్ని వార్డుల డ్వాక్రా మహిళలు ఈ సదస్సుకు తప్పనిసరిగా హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# ఎలక్షన్ కమిషన్ ఆదేశాల అనుసారం ఫోటో ఎలక్టోరల్ ఓటర్ లిస్ట్ విడుదల

- మద్దూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూర్ మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** ఎలక్షన్ కమిషన్ ఆదేశాల అనుసారంగా శుక్రవారం మద్దూరు మున్సిపాలిటీలో పోలింగ్ స్టేషన్ వారిగా ఫోటో ఎలక్టోరల్ ఓటర్ లిస్ట్ ల యొక్క (16)వార్డులకు గాను తుది జాబితాను విడుదల చేయడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# విద్యుత్ షాక్‌తో బిఆర్ఎస్ నాయకులు మృతి

- గడ్డి కట్ చేస్తుండగా జరిగిన ప్రమాదం.




**రాయపోల్,జనవరి 16:**సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు,రైతు గౌస్ (33). శుక్రవారం పొలంలో గడ్డి కట్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారంగ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో యంత్రంతో గడ్డి కట్ చేస్తున్న సమయంలో విద్యుత్ పోల్ నుండి స్టాటర్ డబ్బుకు విద్యుత్ ప్రవాహం వచ్చే తీగ తెగి యంత్రం కు తగలడంతో తీవ్రంగా గాయపడ్డ గౌస్ అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని,శవాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం గజ్వేల్లోని ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మానస తెలిపారు. గౌస్ మృతి పట్ల గ్రామస్థులు, పార్టీ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతునికి భార్య తో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

## ఆయుష్ వైద్య సేవలు జిల్లాలోని ప్రజలకు చేరువయ్యేలా పని చెయ్యాలని ఆయుష్ డాక్టర్లకు జిల్లా కలెక్టర్ కె. హైమావతి



**సిద్దిపేట జనవరి16( సమయం న్యూస్).:** శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో జిల్లాలోని ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.జిల్లాలోని పిఎచ్ సి, సిఎచ్ సి లలో ఆయుష్ వైద్య సేవలపై మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ సమీక్ష నిర్వహించారు. ఆయుష్ కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్, ఫార్మాసిస్ట్ వెకెన్సీ లిస్ట్ తయారుచేయాలి. జిల్లాలో నిర్మించిన యోగ షెడ్లలో యోగ ఉపాధ్యాయులు తప్పనిసరిగా ప్రజలకు యోగ సేవలు అందించాలని తెలిపారు. ఆసుపత్రిలో ఆయుర్వేద, యునాని, హెూమియో పతి వైద్య సేవలు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరికి తెలపాలని ఆయుష్ సేవలను విస్తరించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని ఆదేశించారు. వృద్ధులకు కాళ్ళు చేతులు నొప్పులతో బాధపడే వారికి ఆయుష్ వైద్యం వైపు మళ్లిస్తే సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా నొప్పులు తగ్గుతాయని వారిని ప్రోత్సహించాలని తెలిపారు. ఓపి కౌంట్ పెంచాలని ఆసుపత్రిలో సమయవేళలు పాటించాలని పిఎచ్ సి, సిఎచ్ సి లోని మెడికల్ ఆఫీసర్ తో సమన్వయంతో వైద్యం అందించాలని తెలిపారు. ఆయుష్ కేంద్రంలో పరికరాలు, మెడిసిన్ కోసం పై అధికారులకు లెటర్ పెట్టీ తెప్పించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి, హాస్టల్ లో హాలోపతి డాక్టర్ లతో కలిసి వైద్య సేవలు అందించాలని తెలిపారు. సిద్దిపేట పట్టణం లోని 50 పడకల ఆయుష్ ఆసుపత్రిని ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ధనరాజ్, జిల్లా ఆయుష్ ప్రోగ్రామ్ మేనేజర్ భాను తేజ, జిల్లా ఆయుష్ ఇంచార్జీ అధికారి ఉమాదేవి, ఆయుష్ డాక్టర్లు పాల్గొన్నారు.

## జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు 2026


- సేఫ్ విలేజ్ కాంపెయిన్ రోడ్డు భద్రతా అవగాహన



**సిద్దిపేట జనవరి16( సమయం న్యూస్).:** గురువారం సాయంత్రం రహదారి భద్రత నియమాలపైన అవగాహన కల్పించడం కోసం సిద్దిపేట మండలం లోని గుండ్లచెరువు గ్రామం లో జిల్లా రవాణా శాఖ అధికారులు మరియు సిద్దిపేట టూ టౌన్ అధికారులు సమిష్టిగా రహదారి భద్రతా నియమాల అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా బాలు మరియు రాజు నేతృత్వంలోని కనువిప్పు పోలీస్ కళాబృందం రహదారి భద్రత యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పే విధంగా పాటలు పాడుతూ ప్రజలకు అవగాహన కల్పించడం తో పాటు ప్రమాదాలు జరిగిన విధమును తెలిపే వీడియో లను కూడా ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ రహదారి పక్కన గ్రామాల ప్రజలందరూ రాంగ్ రూట్లో వాహనాలు నడుపుకుంటూ రావడం చాలాసార్లు గమనించానని అలా చేయడం వల్ల రహదారి ప్రమాదం జరిగే అవకాశం ఎక్కువ ఉంటుంది కాబట్టి కొద్దిగా దూరం అయిన సరే సరైన దారిలో వాహనాలు నడపాలని సూచించారు. గ్రామ వాసులతో రహదారి భద్రతా నియమాలను పాటిస్తామని భద్రతా ప్రతిజ్ఞను చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో సిద్దిపేట అసిస్టెంట్ మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, హెూమ్ గార్డ్ లు అష్రఫ్,వెంకటేష్ రామేశ్వర్ నరేష్ లు పాల్గొన్నారు.

## రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో అన్నీ వార్డుల్లో ఎంఐఎం తరపున అభ్యర్థులను బరిలో దింపుతాం

- వికారాబాద్ జిల్లా ఎంఐఎం సంయుక్త కార్యదర్శి, నియోజకవర్గ అధ్యక్షులు -ఎస్బి గుల్షన్



**కొడంగల్ మున్సిపల్, జనవరి,16(సమయం న్యూస్) :** మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ సత్తా చాటేందుకు సిద్ధంగా ఉందని పార్టీ వికారాబాద్ జిల్లా సంయుక్త కార్యదర్శి, కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షులు ఎస్బీ. గుల్షన్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని అన్నీ వార్డుల్లో ఎంఐఎం తరపున అభ్యర్థులను బరిలో ఉంచి పార్టీ జెండా ఎగర వేస్తామన్నారు. సమావేశంలో ఎండీ. సర్తాజ్ హుస్సేన్, షేక్ రోమన్, సయ్యద్ ముస్తఫా, ఎండీ. అజహార్, ఎండీ. మూర్తజా హుస్సేన్, ఎండీ. అమీర్ హుస్సేన్, ఎండీ. షానవాజ్ హుస్సేన్, ఎండీ. రెహన్, సయ్యద్ అర్షద్ అలీ ఖాద్రి పాల్గొన్నారు.

# వంట వండి వడ్డనకు సిద్ధం చేస్తే.

## గంటె పట్టుకొని ఫోటోలకు పోజులివ్వడం రేవంత్ రెడ్డికే చెల్లింది

- ప్రాజెక్టులు కట్టడం బిఆర్ఎస్ వంతు, పీసమెత్తు కృషి చేయని కాంగ్రెస్ నాయకుల పేర్లు పెట్టి మనోభావాలను అవమానించడం కాంగ్రెస్ వంతు
- రెండేళ్ల పాలనలో చేసింది లేదు, చెప్పుకునేందుకు ఏదీ లేదు
- కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లు..
- సీఎం పదవి కలిసొచ్చిన రేవంత్ రెడ్డికి కేసీఆర్ గారు నిర్మించిన ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకపత్రాలు రెడీ మేడ్ గా తయారై ఉన్నాయి
- క్రెడిట్ కొట్టేయడం మీద ఉన్న శ్రద్ధ.. పాలన మీద, ప్రాజెక్టుల మీద పెడితే ప్రజలకు, రైతులకు మేలు జరుగుతుంది
- సీఎం రేవంత్ రెడ్డి పై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం



**హైదరాబాద్ జనవరి16( సమయం న్యూస్) :** తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చేందుకు కేసీఆర్ గారు అహర్నిశలు శ్రమించి ప్రాజెక్టులు కడితే.. వాటిపై కాంగ్రెస్ స్టిక్కర్లు వేసుకోవాలని చూస్తున్న రేవంత్ అర్భకత్వాన్ని చూసి జాలి వేస్తోంది.రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో నిర్మించిందేం లేక కేసీఆర్ గారు పూర్తి చేసిన ప్రాజెక్టులు, నిర్మాణాలకు రిబ్బన్ కట్ చేయడమే పనిగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి.కలిసొచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు అన్నట్లు.. సీఎం పదవి కలిసొచ్చిన రేవంత్ రెడ్డికి కేసీఆర్ గారు నిర్మించిన ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకపత్రాలు రెడీ మేడ్ గా తయారై ఉన్నాయి. తట్టెడు మట్టి తీసింది లేదు, ఒక్క ఇటుక వేసింది లేదు అయినా చనాకా కొరటా, సదర్మాట్ బ్యారేజీలను తామే పూర్తి చేసినట్లు గొప్పలు చెప్పుకున్న నేటి మీ సభ మీరు చెప్పినట్లే.. చరిత్రలో నిలబడుతుంది ఉత్తం గారూ..కేసీఆర్ గారు మహారాష్ట్రతో చారిత్రక ఒప్పందం కుదుర్చుకొని, రూ. 1200 కోట్లు ఖర్చు పెట్టి చనాకా-కొరాటా బ్యారేజీ, పంప్ హౌస్‌లు, మెయిన్ కెనాల్, సబ్ స్టేషన్లతో సహా పనులు పూర్తి చేయించారు.2023 సెప్టెంబర్‌లోనే సక్సెస్‌ఫుల్‌గా వెట్ రన్ కూడా పూర్తి చేసారు. ప్రాజెక్టుకు కాలువల పనులకు అవసరమైన 3,200 ఎకరాల్లో 1600 ఎకరాలను కేసీఆర్ గారు సేకరిస్తే.. ఈ రెండేళ్లలో ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలేని నువ్వు, ఒక్క ఎకరాకు నీళ్లు ఇవ్వని నువ్వు.. ఏ మొహం పెట్టుకొని ఇప్పుడు మళ్ళీ రీ-రన్ (వెట్ రన్) డ్రామాలు ఆడుతున్నావు?రెండేళ్లుగా భూమి సేకరించకుండా, కాలువలు తవ్వకుండా.. ఆదిలాబాద్ ప్రజలను మోస పుచ్చారు.క్రెడిట్ కొట్టేయడం మీద ఉన్న శ్రద్ధ.. భూసేకరణ మీద పెట్టి ఉంటే ఈపాటికి ప్రాజెక్ట్ ఫలితాలు రైతులకు దక్కేవి. 1.5జల సామర్థ్యంతో కేసీఆర్ గారు రూ. 500 కోట్లతో సదర్మాట్ బ్యారేజీని సిద్ధం చేస్తే.. రెండేళ్ళుగా చుక్క నీరు నిలపకుండా ఉమ్మడి ఆదిలాబాద్ రైతుల నోట్లో మట్టి కొట్టారు. రెండేళ్ల క్రిందనే 18 వేల ఎకరాల ఆయకట్టును నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా, ఇవ్వకున్నా రైతులకు తీరని అన్యాయం చేసారు. ఇప్పుడు సిగ్గులేకుండా రిబ్బన్ కట్ చేస్తూ అంతా మీ ఘనతే అని డబ్బా కొట్టుకోవడం మీ దగుల్బాజీతనానికి పరాకాష్ట.

ఈ రెండేళ్ల కాలం వృథా చేసినందుకు ముక్కు నేలకు రాసి రైతులకు క్షమాపణ చెప్పాలి.కేసీఆర్ ఇచ్చిన నోటిఫికేషన్లకు నియామక పత్రాలు పంచడం.. కేసీఆర్ కట్టిన ప్రాజెక్టులకు రిబ్బన్లు కట్ చేయడం తప్ప సొంతంగా మీరు చేసిందేం లేదు. బీఆర్ఎస్ కట్టిన ప్రాజెక్టుకు సున్నాలు వేసి నాదే అని చాటింపు వేసుకోవడం మీ అల్పబుద్ధికి నిదర్శనం.ప్రాజెక్టులు కట్టడం మా వంతు, పేర్లు పెట్టుకోవడం మీ వంతు పరిపాటిగా మారింది. లోయర్ పెన్ గంగా ప్రాజెక్టు పేరు చెప్పుకొని రెండు సార్లు ఎన్నికల్లో గెలిచి, ప్రజల్ని మోసం చేసిన సి. రామచంద్రారెడ్డి గారి పేరు ప్రాజెక్టుకు పెట్టడం అంటే ఆదిలాబాద్ ప్రజల మనోభావాలను అవమానించడమే.

ప్రాజెక్టు నిర్మించి ఆదిలాబాద్ ప్రజల కలలు సాకారం చేసింది బిఆర్ఎస్ అయితే, ఆ ప్రాజెక్టు నిర్మాణంలో పీసమెత్తు కృషి చేయని వ్యక్తి పేరు పెట్టి మోసం చేస్తున్నది కాంగ్రెస్. ఆదిలాబాద్ వెనుకబాటు తనానికి, పాలమూరు వలసలకు కారణం దశాబ్దాల పాటు పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వానిది కాదా?తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టు కడుతామని చెప్పి రెండేళ్లు గడిచినా ఒక్క తట్టెడు మట్టి కూడా ఎందుకు తీయలేక పోయారు?తమ్మిడిహట్టి పేరు మీద అప్పుడు ఆరేండ్లు, ఇప్పుడు రెండేళ్లు కాలయాపన చేసారు.మాయ మాటలు చెప్పి అదిలాబాద్ జిల్లాకు తీరని ద్రోహం చేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం.గ్రావిటీ కాలువను వదిలి ఎత్తిపోతలకు వెళ్లామని మమ్మల్ని విమర్శించిన మీరు ఇప్పుడు తమ్మడిహట్టి నుంచి గ్రావిటీ ద్వారా ఎల్లంపల్లికి నీళ్లు తెచ్చి చూపండి. లేదంటే అధికారం కోసం ప్రజలకు నోటికొచ్చిన అబద్ధం చెప్పినందుకు క్షమాపణలు చెప్పమని డిమాండ్ చేస్తున్నాను.చిత్తశుద్ధి గల్ల ప్రభుత్వం ఉంటే పనులు చేస్తది తప్ప సాకులు వెతకదు.

రెండేళ్లలో చేసిందేం లేక బిఆర్ఎస్ ప్రభుత్వంపై నిందలు మోపుతున్నడు రేవంత్ రెడ్డిఎనుముల ఫ్యామిలీ అభివృద్ధి కోసం రెండేళ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసిండు.బిఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేండ్లలో చేసిన అప్పు అక్షరాల రూ.4.17లక్షల కోట్లే అని కాగ్ రిపోర్ట్‌తో పాటు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పినా ఎందుకు పదే పదే తప్పుడు ప్రచారం చేస్తున్నారు.

**ప్రతిపక్షంలో అబద్దాలే, అధికార పక్షంలో అబద్దాలే... జీవితమంతా అబద్దాలేనా?**

రేవంత్ రెడ్డి రెండేళ్లలోనే రెండున్నర లక్షల కోట్లు అప్పు చేసి, ఒక్క ఇటుక పెట్టలేదు, ఒక్క కాల్వ తీయలేదు, ఒక్క చెరువు తవ్వలేదు, ఒక్క హామి నిలబెట్టుకోలేదు, తెచ్చిన అప్పులతో ఏం చేసావో దమ్ముంటే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.నీ పాలన మీద నీకు నమ్మకం ఉంటే మా జోగు రామన్న గారిని, బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను ఎందుకు ఉదయం నుంచి అరెస్టులు చేసావు రేవంత్ రెడ్డి?అరెస్టులు చేపిస్తూ, బెదిరింపులకు పాల్పడుతూ, పోలీసులను అడ్డం పెట్టుకొని తిరుగుతూ ఇలా ఎన్ని రోజులు గడుపుతావు రేవంత్ రెడ్డి?

చీఫ్ మినిస్టర్ రేవంత్ రెడ్డి గారు.. పరిపాలన అంటే కేవలం కేసీఆర్ గారు కట్టిన ప్రాజెక్టుల దగ్గర శిలాఫలకాల మీద మీ పేరు చెక్కించుకోవడం కాదు, ప్రజల మనోఫలకాల మీద మీ ముద్ర వేసుకునేలా పని చేయడం అని ఇప్పటికైనా గ్రహించండి.

## ఎస్ఐఎస్ఎఫ్-2026 విజయవంతానికి సమన్వయంతో పనిచేయాలి

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- గాడియం ఇంటర్నేషనల్ స్కూల్లో సైన్స్ ఫెయిర్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**సంగారెడ్డి, జనవరి 16 ( సమయం న్యూస్) :** సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2026 రాష్ట్ర, జిల్లా ప్రతిష్టకు కీలకమని, అధికారులు అందరూ సమన్వయంతో పనిచేసి సైన్స్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య కోరారు.ఈనెల 19 నుంచి 23 వరకు రామచంద్రపురం మండలం కొల్లూరులోని గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌లో నిర్వహించనున్న సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ 2026 ఏర్పాట్లను పరిశీలించేందుకు శుక్రవారంజిల్లా కలెక్టర్ గాడియం ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎంట్రెన్స్, ఎగ్జిట్ మార్గాలు, సైనేజీ ఏర్పాటు, ఎగ్జిబిట్ల సంఖ్య, విద్యుత్ కనెక్షన్లు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను ఆమె పరిశీలించారు. అలాగే సైన్స్ ఫెయిర్‌లో పాల్గొననున్న విద్యార్థులు,ఉపాధ్యాయులు, అతిథులకు అవసరమైన వసతి, భోజనం, రవాణా ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సౌత్ ఇండియా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు, ఉపాధ్యా యులు, అతిథులు హాజరు కానున్న నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా విద్యుత్ కనెక్షన్లు, బ్యాకప్ ఏర్పా ట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.సైన్స్ ఫెయిర్ నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వసతి, భోజనం, రవాణా, భద్రత, పారిశుధ్యం, వైద్య సదుపాయాలు, విద్యు త్, తాగునీరు తదితర కమిటీలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి కమిటీ ఎప్పటికప్పుడు సమన్వయంతో పని చేస్తూ ఎలాంటి సమ స్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలగకు ండా ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపా రు.అధికారులు అన్ని వేళలా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ పరిశీలనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా రిజిస్ట్రార్, రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేందర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి, నోడల్ అధికారి లింబాజీ, ఎంఈఓ నాగేశ్వర్ నాయక్, విజయ్ కుమార్, పటాన్చెరు తహసిల్దార్, వివిధ కమిటీల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# సంక్రాంతి ట్రాఫిక్ రద్దీ నివారణకు హైదరాబాద్ వెళ్లే వాహనాలకు దారి మళ్లింపు.

- జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఐపీఎస్

**నల్గొండ జనవరి16( సమయం న్యూస్). :** సంక్రాంతి పండగ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పండగ పూర్తి చేసుకొని ఒకే సారి హైదరాబాద్ నగరానికి భారీగా వాహనాలు వచ్చే నేపథ్యంలో, నేషనల్ హైవే- 65 (హైద్రాబాద్- విజయవాడ) పై చిట్యాల మరియు పెద్ద కాపర్తి వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్నందున, ట్రాఫిక్ జామ్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నందున ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా మరియు ప్రధాన రహదారులపై ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా, ప్రయాణికులకు సురక్షితమైన మరియు సాఫీ ప్రయాణం కల్పించాలనే ఉద్దేశంతో జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక ట్రాఫిక్ దారి మళ్లింపు చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పి గారు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ క్రమంలో ఆంధ్ర ప్రాంతం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే ప్రయాణికులు క్రింద సూచించిన ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

**దారి మళ్లింపు వివరాలు :** 1) గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు :

గుంటూరు → మిర్యాలగూడ → హాలియా → కొండమల్లేపల్లి → చింతపల్లి - మాల్ మీదుగా హైదరాబాద్.

2) మాచర్ల నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు :

మాచర్ల → నాగార్జునసాగర్ → పెద్దవూర → కొండపల్లేపల్లి - చింతపల్లి-మాల్ మీదుగా హైదరాబాద్.

3) నల్లగొండ నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు :

నల్లగొండ - మార్రిగూడ బై పాస్ -మునుగోడు → నారాయణపూర్- చౌటుప్పల్ (ఎన్.హెచ్ 65)మీదుగా హైదరాబాద్.

4.) విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే భారి వాహనాలు..

కోదాడ-హుజూర్నగర్-మిర్యాలగూడ-హాలియా-చింతపల్లి- మాల్ మీదుగా హైదరాబాద్.

5). ఎన్. హెచ్ 65 (విజయవాడ -హైదరాబాద్ )రహదారి పై చిట్యాల,పెద్దకాపర్తిలో ఫ్లై ఓవర్ నిర్మాణాలు జరుగుతున్నందున ట్రాఫిక్ జామ్ అయిన పక్షంలో చిట్యాల నుండి భువనగిరి గుండా హైద్రాబాద్ మళ్లించడం జరుగును .

ఈ మార్గాల ద్వారా వెళ్లడం వల్ల ప్రధాన రహదారి విజయవాడ, హైద్రాబాద్ పై (ఎన్.హెచ్ 65 )ట్రాఫిక్ ఒత్తిడి తగ్గి, ప్రయాణికులు గమ్యస్థానాలకు త్వరగా చేరుకోవచ్చని పోలీసులు తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ:"సంక్రాంతి పండగ పూర్తి చేసుకున్న ప్రజలంతా తమ గమ్యస్థానాలకు హైద్రాబాద్కు సురక్షితంగా చేరుకోవాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యం. ట్రాఫిక్ రద్దీ కారణంగా ఎలాంటి అసౌకర్యాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో దారి మళ్లింపు చర్యలు అమలు చేస్తున్నాం. ప్రయాణికులు పోలీస్ శాఖ సూచించిన మార్గాలను అనుసరించి, ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ, ఓర్పుతో ప్రయాణించాలి. రోడ్డు భద్రతలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం." అని తెలిపారు.పండగ రోజులలో ట్రాఫిక్ పోలీసులు కీలక కూడళ్ల వద్ద విధులు నిర్వహిస్తూ, డ్రోన్ కెమెరాలు, సీసీటీవీ నిఘాతో ట్రాఫిక్ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా డయల్ 100 ని సంప్రదించాలని జిల్లా ఎస్పి గారు కోరారు .

# బంగ్లాదేశ్‌కు ఐసీసీ బృందం

## వరల్డ్‌కప్ మ్యాచ్‌ల అనిశ్చితికి తెరపడేనా?

**ఢిల్లీ, జనవరి 16** టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భారత్ నుంచి తలరించాలనే విషయమై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) బెట్టు వీడడం లేదు. ఇదివరకే షెడ్యూల్ ప్రకటించినందున నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కోరినా బంగ్లా బోర్డు ససేమిరా అంటోంది. ఈ నేపథ్యంలో కొన్ని రోజులుగా నెలకొన్న అనిశ్చితికి తెరదించేందుకు ఐసీసీ స్వయంగా రంగంలోకి దిగనున్నది. చివరి ప్రయత్నంగా ఇద్దరు సీనియర్ ప్రతినిధులను బంగ్లా దేశ్ బోర్డు సభ్యులతో చర్చించేందుకు పంపించనుంది. భారత్, శ్రీలంక వేదికగా ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ షురూ కానున్నది. ఇప్పటికే షెడ్యూల్ ప్రకటించిన ఐసీసీ.. వేదికలను కూడా ఖరారు చేసింది. కానీ, బంగ్లాదేశ్ బోర్డు మాత్రం తమ జట్టును భారత్‌కు పంపించబోమని భీష్మించుకుంది. దాంతో, ఆ దేశ బోర్డుతో చర్చలు మొదలెట్టింది ఐసీసీ. భద్రతా కారణాలరీత్యా ఇండియాలో ఆడబోమనే నిర్ణయంపై పునరాలోచన చేయాలని వీడియో కాల్‌లో కోరినప్పటికీ బంగ్లా బోర్డు 'అదేం కుదరదు' అంటోంది. అందుకని ఇద్దరు సీనియర్ ప్రతినిధులను ఆ దేశానికి పంపి.. వారికి భరోసా కల్పించాలని ఐసీసీ భావిస్తోంది. ప్రపంచ క్రికెట్‌లో బంగ్లాదేశ్‌ను తాము వేరుగా చూడబోమనే నమ్మకాన్ని వారికి కలిగించి.. భారత్‌లో వరల్డ్‌కప్ ఆడేందుకు ఒప్పించనుంది.



### ఇండియాలో కాకుండా..

బంగ్లాదేశ్‌లో ఈమధ్య హిందువుల హత్య ప్రభావం చివరకు టీ20 ప్రపంచకప్‌పై పడింది. ఐపీఎల్ వేలంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహ్మాన్ ను కొనడంపై విమర్శలు వెల్లువెత్తడంతో.. చివరకు ముస్తాఫిజుర్‌పై వేటు పడింది. దాంతో, ఒక్క ఆటగాడికే భద్రత కల్పించలేని బీసీసీఐ ప్రపంచకప్‌లో మా జట్టుకు, కోచింగ్ సిబ్బందికి, అభిమానులకు రక్షణ ఇస్తుందనే నమ్మకం మాకు లేదని బంగ్లా బోర్డు అంటోంది. ఇదే కారణంతో వరల్డ్‌కప్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలించాలని ఐసీసీకి లేఖ రాసింది. అప్పటినుంచి బంగ్లా జట్టు మ్యాచ్‌లపై అనిశ్చితి నెలకొంది. ఇండియాలో కాకుండా ఎక్కడమైనా తాము ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడుతామని ఐసీసీతో వీడియో కాల్‌లో ఆ దేశ బోర్డు పునరుద్ఘాటించింది. ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం ఫిబ్రవరి 7న ఈడెన్ గార్డెన్స్‌లో వెస్టిండీస్‌తో బంగ్లా తలపడాలి.



# రోహిత్‌ను తప్పించడానికి అతనే కారణం..

### భారత మాజీ క్రికెటర్ సంచలన వ్యాఖ్యలు

**ఢిల్లీ:** గతేడాది ఆస్ట్రేలియా టూరుకు ముందు రోహిత్‌ను వన్డే కెప్టెన్‌గా తప్పించి గిల్‌కు పగ్గాలు అప్పగించిన విషయం తెలిసిందే. రోహిత్అబశ్రీశ్రీపై వేటు వేయడం వెనుక హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఉందని భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఆరోపించాడు. తాజాగా ఓ జాతీయ మీడియాతో తివారీ మాట్లాడుతూ.. రోహిత్‌ను తప్పించాలని చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్అబశ్రీశ్రీను గంభీర్ ప్రేరేపించి ఉండొచ్చన్నాడు. 'రోహిత్‌ను తప్పించడానికి బలమైన కారణం ఏంటో నాకు తెలియదు. అగార్కర్ కఠినమైన నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడడు. అయితే, 'అతని భుజాలపై నుంచి తుపాకీ పేల్చడానికి అతన్ని మరొకరు ప్రభావితం చేశారా?'అన్నది కూడా ఆలోచించాలి. తెర వెనుక చాలా జరుగుతాయి. కోచ్ అభిప్రాయం తీసుకోకుండా చీఫ్ సెలెక్టర్ ఇలాంటి నిర్ణయం తీసుకోరు. కాబట్టి, రోహిత్ విషయంలో ఇద్దరూ బాధ్యులే.'అని తివారీ తెలిపాడు. బీసీసీఐ మాజీ సెక్రెటరీ, ఐసీసీ చైర్మన్ జై షా.. రోహిత్‌ను తప్పించడాన్ని ఆపి ఉండాల్సిందని తివారీ అభిప్రాయపడ్డాడు.



# చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు..

### ఆర్సీబీ సంచలన లేఖ

**బెంగళూరు:** ఐపీఎల్ 2026 టోర్నమెంట్ నేపథ్యంలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. చిన్నస్వామి స్టేడియంలో 300 నుంచి 350 వరకు ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయాలని బెంగళూరు కోరుతోంది. ఈ మేరకు కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ కు బహిరంగ లేఖ రాసింది బెంగళూరు జట్టు యాజమాన్యం. 2025 ఐపీఎల్ సమయంలో తొక్కిసలాట జరిగి 11మంది అభిమానులు మరణించారు. ఇలాంటి నేపథ్యంలో అలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరిందట బెంగళూరు. అలా కెమెరాలు ఏర్పాటు చేస్తేనే వచ్చే సీజన్ లో చిన్నస్వామిలో మ్యాచ్‌లు ఆడతామని పేర్కొందట. కెమెరాలు ఉంటే ప్రమాదాలను నివారించవచ్చని స్పష్టం చేసిందట. అయితే దీనిపై కర్ణాటక రాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ సానుకూలంగా స్పందించినట్లు తెలుస్తోంది.

# 9 సిక్సర్లతో విధ్వంసం

### స్టీవ్ స్మిత్ తన బ్యాటింగ్

**ఢిల్లీ:** బిగ్ బాష్ లీగ్ 37వ మ్యాచ్‌లో సిడ్నీ సిక్సర్స్, సిడ్నీ థండర్ జట్లు తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన సిడ్నీ థండర్ నిర్ణీత 20 ఓవర్లలో భారీ స్కోరు సాధించింది. కెప్టెన్ డేవిడ్ వార్నర్ ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 58 బంతుల్లోనే 110 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. దీంతో థండర్ జట్టు 189 పరుగుల భారీ లక్ష్యాన్ని సిక్సర్స్ ముందు ఉంచింది. 42 బంతుల్లోనే సెంచరీ.. 190 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సిడ్నీ సిక్సర్స్‌కు స్టీవ్ స్మిత్ కనీవినీ ఎరుగని ఆరంభాన్ని ఇచ్చాడు. మొదటి బంతి నుంచే బౌలర్లపై విరుచుకుపడిన స్మిత్, కేవలం 42 బంతుల్లోనే శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో స్మిత్ మొత్తం 5 ఫోర్లు, 9 భారీ సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ 238.09 గా నమోదు కావడం విశేషం. ఈ మ్యాచ్‌లో హైలైట్ ఏంటంటే.. స్మిత్ ఇన్నింగ్స్ 12వ ఓవర్‌లో ఏకంగా 32 పరుగులు పిండుకున్నాడు. ఆ ఓవర్‌లో వం-సగా 4 సిక్సర్లు బాదిన స్మిత్, ఆ తర్వాత ఫోర్ కొట్టాడు. నో బాల్, వైడ్ రూపంలో వచ్చిన పరుగులతో కలిపి ఆ ఓవర్ దీదీూ చరిత్రలోనే అత్యంత ఖరీదైన ఓవర్లలో ఒకటిగా నిలిచింది.మరోవైపు సిడ్నీ సిక్సర్స్ తరపున ఆడుతున్న పాకిస్థాన్ స్టార్ బ్యాటర్ బాబర్ ఆజం నిలకడగా ఆడినప్పటికీ, వేగంగా పరుగులు రాబట్టలేకపోయాడు. 39 బంతుల్లో 47 పరుగులు చేసిన బాబర్, నాథన్ మెక్‌ఆండ్రూ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. స్మిత్ సునామీ ముందు బాబర్ ఇన్నింగ్స్ వెలవెలబోయింది. స్మిత్ విధ్వంసంతో సిడ్నీ సిక్సర్స్ జట్టు మరో 16 బంతులు మిగిలి ఉండగానే 190 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో సిక్సర్స్ పాయింట్ల పట్టికలో తమ స్థానాన్ని మరింత మెరుగుపరుచుకుంది. వార్నర్ సెంచరీ వృథా అయినప్పటికీ, స్మిత్ వీరబాదుడు ఈ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది.

# రాధా యాదవ్ అర్ధశతకం



**నవీ ముంబై:** మహిళల ప్రీమియర్ లీగ్‌లో భాగంగా గుజరాత్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బెంగళూరు బ్యాటింగ్ ముగిసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. టాప్ ఆర్డర్ విఫలమైనా రాధా యాదవ్(66) అర్ధశతకంతో ఆకట్టుకుంది. రాత్రి 11 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు.. రిచా ఘోష్ (44) రాణించగా.. చివర్లో క్లర్క్(26) మెరుపు ఇన్నింగ్స్ ఆడింది. హారిస్(17), కెప్టెన్ స్మృతి మంధాన(5), హేమలత(4), గౌతమి నాయక్(9), అరుంధతి(2బి), శ్రేయంక(0బి) పరుగులు చేశారు. గుజరాత్ బౌలర్లలో సోఫీ 3, కశ్వీ గౌతమ్ 2 వికెట్లు తీయగా.. రేణుక, జార్జియా చెరో వికెట్ పడగొట్టారు.

# అంధుల క్రికెట్‌జట్టు కెప్టెన్ దీపికకు అరుదైన గౌరవం

### రాష్ట్రపతి కార్యాలయం నుంచి పిలుపు



**ఢిల్లీ:** భారత మహిళా అంధుల క్రికెట్ జట్టు కెప్టెన్, తెలుగు తేజం దీపికకు అరుదైన గౌరవం దక్కింది. దేశ రాజధాని ఢిల్లీలో గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథిగా హాజరు కావాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమెను ఆహ్వానించారు. శ్రీసత్యసాయి జిల్లా అమరాపురం మండల పరిధిలోని తంబాలహట్టి గ్రామానికి చెందిన దీపిక, అంధత్వాన్ని జయించి క్రికెట్ రంగంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇటీవల జరిగిన మహిళా అంధుల టీ-20 ప్రపంచకప్ లో భారత జట్టును అద్భుతంగా నడిపించి, భారత్‌ను విజేతగా నిలబెట్టడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. ఈ మేరకు ప్రెసిడెంట్ ఆఫీసు నుంచి పంపిన అధికారిక ఆహ్వాన పత్రికను తపాలా శాఖ అధికారులు స్వయంగా దీపిక స్వగ్రామానికి వెళ్లి ఆమెకు అందజేశారు. క్రీడల్లో ఆమె కనబరిచిన అంకితభావం, పట్టుదలకు గుర్తింపుగా ఈ గౌరవం దక్కడంతో పలువురు ప్రశంసల జల్లు కురిపించారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ.. దేశ ప్రథమ పౌరురాలి నుంచి పిలుపు రావడం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతి అని అన్నారు. ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను స్వయంగా వీక్షించే అవకాశం లభించడం లక్కీగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ అరుదైన గౌరవం నాపై మరింత బాధ్యతను పెంచిందని దీపిక కామెంట్ చేశారు.



# తిలక్ స్థానంలో డేంజరస్ బ్యాటర్

### కివీస్‌తో టీ20 సిరీస్అబశ్రీశ్రీకు ఎంపిక చేసిన సెలెక్టర్లు


**న్యూ ఢిల్లీ:** భారత స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ రెండేళ్ల తర్వాత తిరిగి టీ20 జట్టులోకి పునరాగమనం చేయబోతున్నాడు. ఇదే నెలలో న్యూజిలాండ్‌తో జరిగే టీ20 సిరీస్అబశ్రీశ్రీతో రీఎంట్రీ ఇవ్వనున్నాడు. డిసెంబర్ 20నే కివీస్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టును బీసీసీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఆ జట్టులో భాగమైన తెలుగు కుర్రాడు తిలక్ వర్మ సర్జరీ కారణంగా తొలి మూడు టీ20లకు దూరమైన విషయం తెలిసిందే. తిలక్ స్థానంలో సెలెక్టర్లు తాజాగా శ్రేయస్ అయ్యర్‌ను ఎంపిక చేశారు. అయ్యర్ తొలి మూడు టీ20లకు సెలెక్ట్ చేసినట్టు బోర్డు శుక్రవారం తెలిపింది. మిగతా రెండు మ్యాచ్‌లకు కూడా తిలక్ అందుబాటులో లేకపోతే అయ్యరే కొనసాగే అవకాశాలు ఉంటాయి. అయ్యర్ చివరిసారిగా 2023 డిసెంబర్‌లో భారత్ తరపున టీ20 మ్యాచ్ ఆడాడు. మరోవైపు, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ గాయం కారణంగా టీ20 సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. కివీస్‌తో తొలి వన్డేలో బౌలింగ్ చేసేటప్పుడు పక్కటెముక కింది భాగంలో అసౌకర్యానికి గురయ్యాడు. స్కానింగ్‌లో సైడ్ స్ట్రెయిన్ ఉన్నట్టు నిర్ధారణ అయ్యిందని, కొన్ని రోజులపాటు అతనికి వైద్యులు విశ్రాంతి సూచించారని బోర్డు తెలిపింది. ఇప్పటికే సుందర్ వన్డే సిరీస్అబశ్రీశ్రీకు దూరమైన విషయం తెలిసిందే. ఇప్పుడు టీ20 సిరీస్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదని బోర్డు పేర్కొంది. అతని స్థానంలో టీ20 జట్టులోకి స్పిన్నర్ రవి బిష్ణోయ్‌ను తీసుకున్నట్టు వెల్లడించింది. భారత జట్టు ప్రస్తుతం న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్ ఆడుతోంది. తొలి రెండు వన్డేల్లో ఇరు జట్లు చెరోటి గెలవగా.. నిర్ణయాత్మక మూడో మ్యాచ్ ఆదివారం జరగనుంది. వన్డే సిరీస్ ముగిసిన వెంటనే ఐదు టీ20 సిరీస్ ప్రారంభంకానుంది. నాగ్‌పూర్‌లో తొలి టీ20 జరగనుంది.

# అఫ్గానిస్తాన్‌కు భారీ షాక్

**ఢిల్లీ, జనవరి 16 :** టీ20 ప్రపంచకప్-2026కు ముందు అఫ్గానిస్తాన్‌కు గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఆ జట్టు స్టార్ పేసర్ నవీన్ ఉల్ హక్ గాయం కారణంగా ఈ మెగా టోర్నీ నుంచి తప్పుకొన్నాడు. నవీన్ గత కొంతకాలంగా భుజం నొప్పితో బాధపడుతున్నాడు. అయితే వరల్డ్‌కప్ సమయానికి అతడు కోలుకుంటాడని జట్టులో సెలెక్టర్లు ఛాన్స్ ఇచ్చారు. కానీ అతడి గాయం తీవ్రత మరింత ఎక్కువైనట్లు తెలుస్తోంది. దీంతో అతడు నెలాఖరులో తన గాయానికి శస్త్రచికిత్స చేయించుకోనున్నట్లు సమాచారం. ఈ కారణంతోనే వరల్డ్‌కప్‌తో పాటు వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌కు అతడు దూరమయ్యాడు. అతడు పూర్తిగా కోలుకోవడానికి మరి కొన్ని నెలల పట్టనున్నట్లు అఫ్గాన్ క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ రైట్ ఆర్మ్ పేసర్ దాదాపు ఏడాది నుంచి జాతీయ జట్టు తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఆసియాకప్-2025కు కూడా దూరంగా ఉన్నాడు. కాగా నవీన్ స్థానంలో ఇంకా అధికారికంగా ఎవరినీ అఫ్గానిస్తాన్ క్రికెట్ బోర్డు ప్రకటించలేదు. రిజర్వ్ ఆటగాళ్లుగా ఉన్న జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ, అల్లా గజన్ఫర్ లేదా ఇజాజ్ అహ్మద్‌జాయ్‌లలో ఒకరు ప్రధాన జట్టులోకి వచ్చే అవకాశముంది.

### టీ20 ప్రపంచ కప్ 2026కు అఫ్గాన్ జట్టు:

రషీద్ ఖాన్ (కెప్టెన్), నూర్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్, సెదికుల్లా అటల్, ఫజల్‌హాక్ ఫరూఖీ, రహ్మానుల్లా గుర్బాజ్, మహ్మద్ ఇషాక్, షాహిదుల్లా కమల్, మహ్మద్ నబీ, గుల్బాదిన్ నాయబ్, అజ్మతుల్లా, రమ్‌మానుల్, రమ్‌మతుల్లా, ఉ మర్‌జాయి, జద్రాన్. రిజర్వ్‌లు: అల్లా ఘజన్‌ఫర్, ఇజాజ్ అహ్మద్‌జాయ్ మరియు జియా ఉర్ రెహ్మాన్ షరీఫీ



# గ్లామర్‌తో హీటెక్కిస్తున్న రకుల్ ప్రీత్

హీరోయిన్స్ ఒకవైపు సినిమాలలో నటిస్తూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో తమ అందంతో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. అంతేకాదు ఫాలోవర్స్ లో పెంచుకున్న తర్వాత పలు ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ అలా కూడా ఆదాయాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫాలోవర్స్ పెరగాలంటే రోజుకు ఒక గ్లామర్ ట్రీట్ ఇవ్వాల్సిందే అనే రేంజ్ లో ప్రస్తుతం ట్రెండ్ నడుస్తోంది అంటూ నెటిజన్లు కూడా కామెంట్లు చేస్తూ ఉంటారు. మరోవైపు ఈ మధ్య కాలంలో హీరోయిన్స్ సినిమా షూటింగ్ లతో బిజీగా ఉన్నప్పటికీ.. మరోవైపు అభిమానులకు చేరువ అవ్వ డానికి నిత్యం ఫోటోషూట్‌తో ఆకట్టుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బ్లాక్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్ లో సిల్వర్ కలర్ హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఒక కోట్ ధరించి.. తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. ముఖ్యంగా గార్జియస్ లుక్ లో అదిరిపోయే స్టిల్స్ ఇచ్చి మరింత అందంగా కనిపిస్తోంది ఈ ముద్దుగుమ్మ. తన మెడను ప్రత్యేకంగా డిజైన్ చేసిన జువెలరీ తో ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక మత్తెక్కించే కళ్ళతో.. మరింత అందంగా ముస్తాబయింది. తాజాగా ఓవర్ లోడెడ్ గ్లామర్ డోస్ తో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది . అదిరిపోయే ఫోజులు ఇవ్వడంతో ఆ ఫోజులకే ఫిదా అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే రకుల్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి.

రకుల్ ప్రీత్ సింగ్ విషయానికి వస్తే.. కెరటం అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. వెంకటాద్రి ఎక్స్ప్రెస్ సినిమాతో మరింత పాపులారిటీ దక్కించుకుంది. “ప్రార్థన ప్రతి రూపాయి కౌంటింగ్ ఇక్కడ” అనే డైలాగ్ తో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. రకుల్ ప్రీత్ సింగ్ ఈ సినిమా తర్వాత లౌక్యం, కరెంటు తీగ , కిక్ 2 , పండగ చేసుకో, బ్రూస్ లీ, నాన్నకు ప్రేమతో, సరైనోడు, ధ్రువ, రారండోయ్ వేడుక చూద్దాం, జయ జానకి నాయక , స్పైడర్ ఇలా పలు తెలుగు చిత్రాలలో పలువురు స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందుకుంది.



# పూరి-సేతుపతి మూవీ టైటిల్ స్లమ్ డాగ్

విజయ్ సేతుపతి -పూరి జగన్నాథ్ కాంబోలో రానున్న సినిమా టైటిల్ ఖరారయ్యింది. ఇప్పటివరకూ 'పూరి సేతుపతి'గా ప్రచారంలో ఉన్న ఈ సినిమా టైటిల్‌ను తాజాగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'స్లమ్ డాగ్' అనే పేరు ఖరారు చేశారు. '33 టెంపుల్ రోడ్' అనేది ఉపశీర్షిక. టైటిల్ పోస్టర్‌లో విజయ్ సేతుపతి ఆసక్తికర లుక్‌లో కనిపించారు. చేతిలో కత్తి పట్టుకొని కళ్లజోడుతో పవర్‌ఫుల్‌గా ఉన్నారు. ఈ పోస్టర్‌ను పంచుకున్న టీమ్ ఆసక్తికర క్యాప్షన్‌ను షేర్ చేసింది. 'మురికివాడల నుంచి ఎవరూ తట్టుకోలేని తుపాను వస్తుంది.. అది చాలా భయంకరంగా ఉంటుంది' అనే క్యాప్షన్ ఇందులో విజయ్ పాత్ర తీరును తెలిపేలా ఉంది. ఎన్నో రోజులుగా ఈ సినిమాకు రకరకాల టైటిల్స్ వినిపించాయి. ఇప్పుడు వాటికి చెక్ పెడుతూ 'స్లమ్ డాగ్'ను అధికారికంగా ప్రకటించారు. గతేడాది జులై మొదటివారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభించి ఐదు నెలల్లోనే కంప్లీట్ చేసేశారు. పాన్ ఇండియా స్థాయిలో ఇది విడుదల కానుంది. సంయుక్త కథానాయికగా నటించారు. టబు (ఒజీశిబీ), విజయ్‌కుమార్ కీలక పాత్రలు పోషించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకుల్ని అలరించడమే లక్ష్యంగా ఓ వినూత్న కథాంశంతో ఈ చిత్రం ముస్తాబైంది. విజయ్ సేతుపతి ఇందులో మునుపెన్నడూ చేయని విభిన్నమైన పాత్రలో కనిపించనున్నారు.



# కలసి వచ్చిన సంక్రాంతి సెంటిమెంట్

## అనిల్ రావిపూడి, శర్వానంద్‌లకు పండగే పండగ



సంక్రాంతికి హిట్ కొట్టడం వేరు....అలాంటిది ఆ పండగకు వచ్చిన ప్రతిసారి విజయం అందుకున్నారు హీరో శర్వానంద్, డైరెక్టర్ అనిల్ రావిపూడి. పొంగల్ రిలీజ్.. అనిల్‌కు సెంటిమెంట్‌గా మారింది. వీలుంటే ప్రతి ఏడాదీ పండగకు వస్తాననంటుంటారు. సంక్రాంతికి వచ్చిన సినిమాలే కాదు అనిల్ తెరకెక్కించిన ఇతర సినిమాలన్నీ హిట్ అయిన సంగతి తెలిసిందే.సంక్రాంతికి తమ సినిమాలను రిలీజ్ చేయాలని ఎంతోమంది మేకర్స్ ప్లాన్ చేసుకుంటూ ఉంటారు. కానీ, అది కొన్నిసార్లు వర్కౌట్ కాదు. దీంతో, కొన్ని సినిమాలు అకస్మాత్తుగా విడుదలవుతుంటాయి. సాధారణ రోజుల్లో పెద్ద హీరోల సినిమాలు రిలీజ్ అవుతున్నాయంటే.. చిన్న చిత్రాల మేకర్స్ వాటిని విడుదల చేసేందుకు సాహసించరు. పెద్ద పండగకు తప్పని సరిగా ప్రేక్షకులు ఆశీర్వదిస్తారన్న నమ్మకంతో రిలీజ్ చేస్తుంటారు. అలా ఈ ఏడాది విడుదలైన ప్రభాస్ 'ది రాజాసాబ్', చిరంజీవి సినిమా, రవితేజ 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'తో పాటు శర్వా మూవీ, నవీన్ పొలిశెట్టి 'అనగనగా ఒక రాజు' సందడి చేస్తున్నాయి.సంక్రాంతి సందర్భంగా 'ఎక్స్‌ప్రెస్ రాజా'తో 2016లో శర్వా తొలి విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ప్రేమించిన అమ్మాయి పెంచుకున్న కుక్క కనిపించకపోవడంతో.. దాన్ని వెతికి పట్టుకునే క్రమంలో హీరోకి ఎలాంటి సంఘటనలు ఎదురయ్యాయి? అన్న పాయింట్‌తో మేర్లపాక గాంధీ తెరకెక్కించిన రొమాంటిక్ కామెడీ థ్రిల్లర్ ఇది. మరుసటి ఏడాది సంక్రాంతికి 'శతమానం భవతి'తో అంతకుమించిన సక్సెస్ చూశారు శర్వానంద్. కుటుంబ విలువలు గుర్తుచేసేలా సతీశ్ వేగేశ్న తెరకెక్కించిన ఫ్యామిలీ డ్రామా ఇది. ఈ ఏడాది 'నారీ నారీ నడుమ మురారి' గా నవ్వులు పంచారు. ఇద్దరమ్మాయిల మధ్య నలిగిపోయే యువకుడి కథాంశంతో రామ్ అబ్బరాజు తెరకెక్కించిన ఈ సినిమా థియేటర్లలో నవ్వులు పూయిస్తోంది. ఈ మూడు సినిమాలు జనవరి 14న విడుదల కావడం విశేషం. ప్రేక్షకులను నవ్వించడమే లక్ష్యంగా సినిమాలు చేస్తూ వరుస విజయాలు అందుకుంటున్న దర్శకుడు అనిల్ రావిపూడి. వెంకటేశ్, వరుణ్‌తేజ్ కాంబినేషన్‌లో ఆయన తెరకెక్కించిన 'ఎఫ్ 2' 2019 జనవరి 12న రిలీజైంది. ఈ మూవీ రూ.100 కోట్లకుపైగా వసూలు చేసింది. 2020 జనవరి 11న విడుదలైన మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు' దాదాపు రూ.200 కోట్లు రాబట్టింది. 2025 జనవరి 14న విడుదలైన వెంకటేశ్ 'సంక్రాంతికి వస్తున్నాం' ఏకంగా రూ.300 కోట్లు వసూలు చేసి, ఈ హీరో-దర్శకుడి కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచింది. ఈ నెల 12న విడుదలైన చిరంజీవి 'మన శంకరవర ప్రసాద్‌గారు' సైతం జోరు ప్రదర్శిస్తోంది. మూడు రోజుల్లోనే రూ.152 కోట్లు కలెక్ట్ చేసింది.

# అందాల ఆషిక..



టాలీవుడ్ యూత్ ఫోకస్ పడిన బ్యూటీల్లో ఇప్పుడు అందాల ఆషిక రంగనాథ్ పేరు గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే కన్నడ సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె, క్రమంగా తెలుగు సినీ ఇండస్ట్రీలో కూడా తనదైన ముద్ర వేసేందుకు ప్రయత్నం చేస్తోంది. వివిధ కన్నడ చిత్రాలతో మెప్పించిన బ్యూటీ.. నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా నటించిన అమిగోస్ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది. డెబ్యూతో అందరినీ ఆకట్టుకుందని చెప్పాలి. ఆ తర్వాత కింగ్ నాగార్జున లీడ్ రోల్ పోషించిన నా సామి రంగ సినిమాతో మరింతగా తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఆషిక.. ఈ సంక్రాంతికి విడుదలైన భర్త మహాశయులకు విజ్ఞప్తితో ఇప్పుడు థియేటర్స్ లో సందడి చేస్తోంది. మూవీలో ప్రత్యేకమైన పాత్రలో, వివాహితుడైన హీరోకి గర్ల్‌ఫ్రెండ్ గా ఆషిక కనిపించారు. స్టోరీ పరంగా సున్నితమైన పాత్ర అయినప్పటికీ, ఆమె స్క్రీన్ ప్రెజెన్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. సినిమా మొత్తంలో ఆమె పాత్రకు ఉన్న ఇంపార్టెన్స్, గ్లామర్ తో పాటు క్యారెక్టర్ ఫ్రెష్ నెస్ ను కూడా చూపించడంతో.. మూవీ రిలీజ్ అయ్యాక ఆమె కోసం జోరుగా చర్చ జరుగుతోంది. అయితే ఈ ఏడాది సంక్రాంతి సీజన్ లో ఒకేసారి పలు చిత్రాలు పోటీగా ప్రేక్షకుల ముందుకు వచ్చినా.. ఆషిక నటనపై ప్రత్యేకంగా మాట్లాడుకోవడం విశేషం. సోషల్ మీడియాలో ఆమె కోసమే డిస్కషన్లు జరుగుతున్నాయి. ప్రస్తుతం నెట్టింట ఆషిక ఫోటో షూట్లు, సినిమా క్లిప్పులు వైరల్ కావడం, ఫ్యాన్ పేజీలు పెరగడం చూస్తే, టాలీవుడ్ యూత్ డ్రీమ్ గర్ల్ ఆమెనే అని అనిపిస్తోంది. భర్త మహాశయులకు విజ్ఞప్తి మూవీ కథలో పెద్ద ఎమోషనల్ సీన్లు లేకపోయినా, తన పాత్ర పరిధిలో అమ్మడు ఆకట్టుకునేలా కనిపించిందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది. చాలా బాగా నటించారని అంతా కొనియాడుతున్నారు. అదే సమయంలో యాక్టింగ్ పరంగా ఇంకాస్త డెవలప్ అయితే ఇంకా సూపర్ అని అంటున్నారు. డైలాగ్ డెలివరీ, ఎమోషన్స్ ఎక్స్ప్రెస్ చేయడంలో ఇంకా మెళకువలు నేర్చుకోవాలని సూచిస్తున్నారు. అప్పుడు ఇండస్ట్రీలో గ్లామర్ హీరోయిన్ గానే కాకుండా స్ట్రాంగ్ యాక్ట్రెస్ గా సత్తా చాటవచ్చని, భారీ అవకాశాలు వస్తాయని చెబుతున్నారు. తద్వారా స్టార్ హీరోయిన్ గా మారగలరని అంటున్నారు. ఇక ఆషిక రంగనాథ్ అప్ కమింగ్ చిత్రాలపై కూడా అందరి దృష్టి పడింది. మరికొద్ది రోజుల్లో ఆమె విశ్వంభర సినిమాతో థియేటర్స్ లోకి రానున్నారు. మెగాస్టార్ చిరంజీవి లీడ్ రోల్ లో నటించిన ఆ మూవీ.. సమ్మర్ లో విడుదల కానుంది. అదే సమయంలో కోలీవుడ్ హిట్ మూవీ సర్దార్ సీక్వెల్ కూడా ఆమె చేతిలో ఉంది. మరి తన కొత్త సినిమాలతో ఆషిక ఎలా మెప్పిస్తారో.. ఫ్యూచర్ లో ఎంతటి బెస్ట్ స్టేజ్ కు రీచ్ అవుతారో వేచి చూడాలి.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131

# గ్రీన్ అమోనియా ఉత్పత్తిలో కొత్త చరిత్రకు శ్రీకారం

**రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్ అమోనియా ప్రాజెక్టు**

**రూ.13 వేల కోట్లతో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్‌కు శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు**

**కాకినాడలో 495 ఎకరాల్లో ఏర్పాటు.. 2,600 మందికి ఉద్యోగాలు**

**ఏడాదికి 1 మిలియన్ మెట్రిక్ టన్ను గ్రీన్ అమోనియా ఉత్పత్తి**

**అమరావతి:** క్లీన్ ఎనర్జీ రంగంలో రాష్ట్రం సరికొత్త చరిత్రను సృష్టించబోతోంది. గ్రీన్ హైడ్రోజన్ ఆధారిత గ్రీన్ అమోనియా పరిశ్రమ ఏర్పాటుతో దేశంలోనే అతిపెద్ద పర్యావరణహిత పరిశ్రమలలో ఒకటిగా నిలిచి చారిత్రాత్మక అడుగు వేయనుంది. గత ఏడాది గ్రీన్‌కో గ్రూప్‌కు చెందిన ఏఎమ్ గ్రీన్ సంస్థకు ఏడాదికి ఒక మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ అమోనియా ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఏడాదిలోనే ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చడం గమనార్హం. ఈ పరిశ్రమకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శనివారం ఉదయం కాకినాడలో శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 10.30 గంటలకు ముఖ్యమంత్రి అమరావతి నుంచి కాకినాడకు వెళ్తారు. 11.20 గంటలకు ప్రాజెక్టుకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. గ్రీన్ హైడ్రోజన్‌ను ఉపయోగించి పూర్తిగా పునరుత్పాదక శక్తితో తయారయ్యే కార్బన్ ఉద్గారాలు లేకుండా గ్రీన్ అమోనియాను ఏఎమ్ గ్రీన్ సంస్థ ఉత్పత్తి చేయనుంది. బొగ్గు, చమురు, సహజ వాయువులతో తయారయ్యే గ్రే, బ్లూ అమోనియాకు భిన్నంగా ఈ ఉత్పత్తి జరుగుతుంది... పర్యావరణానికి ఏమాత్రం హానికరం కాదు. ప్రపంచం మొత్తం డీకార్బనైజేషన్, నెట్–జీరో ఎమిషన్స్ లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్న తరుణంలో గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమోనియా భవిష్యత్ ఇంధనాలుగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో కాకినాడలో ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్రాజెక్ట్ దేశానికే గర్వకారణంగా నిలవనుంది. నాగార్జున ఫెర్టిలైజర్స్ కెమికల్స్ లిమిటెడ్ పాత గ్రే అమోనియా ప్లాంట్‌ను గ్రీన్ ప్లాంట్‌గా అభివృద్ధి చేస్తున్నారు. 495 ఎకరాల్లో రూ.13 వేల కోట్ల పెట్టుబడితో ఏఎమ్ గ్రీన్ సంస్థ ఈ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఈ ప్లాంట్ ఏర్పాటు ద్వారా సుమారు 2,600 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయి. 2027 చివరినాటికి ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకున్నారు. ఏఎమ్ గ్రీన్ అమోనియా ప్లాంట్ కాకినాడ పోర్ట్‌కు కేవలం 1 కిలోమీటర్ దూరంలో ఉంటుంది. గ్రీన్ అమోనియాను అవసరమైన ప్రపంచ దేశాలకు ఎగుమతులకు అద్భుత అవకాశం ఉండనుంది. ఏఎమ్ గ్రీన్ సంస్థ ఇప్పటికే జర్మనీకి చెందిన యూనిపర్ ఎస్ఈతో ఒప్పందం కుదుర్చుకుంది. 2028 నుంచి ఏడాదికి 125 కేటీపీఏ గ్రీన్ అమోనియాను ఆ దేశానికి ఎగుమతి చేయనుంది. అలాగే మలేషియాకు చెందిన పెట్రోనాస్, సింగపూర్‌కు చెందిన జీఐసీ, యూఏఈకి చెందిన ఏడీఏఐ వంటి సంస్థల సహకారంతో ఏర్పాటు చేస్తోన్న ఈ ప్రాజెక్ట్ ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందనుంది. ఈ ప్రాజెక్టుతో పాటే కాకినాడలోనే రూ.2,000 కోట్ల వ్యయంతో 2 గిగావాట్ల ఎలక్ట్రోలైజర్ తయారీ యూనిట్‌ను కూడా ఏఎమ్ గ్రీన్ ఏర్పాటు చేస్తోంది.

# అణుకు గిరిజన గ్రామంలో హోం మంత్రి అనిత పర్యటన

**సంక్రాంతి వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్న మంత్రి**

**మంత్రికి ఘన స్వాగతం పలికిన గిరిపుత్రులు**

**అణుకు గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మంత్రి అనిత హామీ**



**కోటవురట్ల:** మండలంలో గొట్టివాడ శివారు మారుమూల గిరిజన గ్రామమైన అణుకులో శుక్రవారం హోంమంత్రి అనిత పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మంత్రికి సంప్రదాయ పద్ధతుల్లో ఘన స్వాగతం పలికారు. అణుకులోని పరదేశమ్మ తల్లిని దర్శించుకున్న మంత్రి అనిత అక్కడ సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా గిరిజనులతో కలిసి కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. గిరిజనులతో ఎంతో ఆత్మీయంగా మమేకమై పండుగ ఆనందాన్ని పంచుకున్నారు. 'అనితమ్మ మా గుండె' 'అనితమ్మ మా గ్రామానికి రావడం మాకు పెద్ద పండుగ' అంటూ అణుకు వాసులు మంత్రిపై తమ ప్రేమాభిమానాలను చూపించారు. గతంలో రోడ్డు సౌకర్యం లేక ఎన్నో ప్రాణాలు కోల్పోయామని పేర్కొంటూ, రూ.2 కోట్ల 50 లక్షల వ్యయంతో రోడ్డు మంజూరు చేయించినందుకు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామస్తులతో ముఖాముఖి సమావేశం నిర్వహించిన హోమ్ మంత్రి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరినీ పేరు పేరునా పలకరిస్తూ యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్నారులతో ముచ్చటించి, వారికి పుస్తకాలు పంపిణీ చేయగా, గిరిజనులకు సంక్రాంతి కానుకలు అందజేశారు. మంత్రి స్వయంగా భోజనాలు వడ్డించి, గిరిజనులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనిత కుమారుడు నిఖిల్, కుమార్తె రేష్మితశ్రీ కూడా పాల్గొన్నారు. అణుకు యువకులకు క్రికెట్ కిట్లు, స్పోర్ట్స్ టీ షర్ట్స్ ను మంత్రి కుమారుడు నిఖిల్ అందజేశారు. అణుకు చిన్నారుల డ్యాన్స్ కార్యక్రమాన్ని మంత్రి అభినందించగా, యువకులతో కలిసి వాలీబాల్ ఆడారు. ఈ సందర్భంగా



హోంమంత్రి అనిత మాట్లాడుతూ మీతో కలిసి ప్రశాంతంగా, ఆనందంగా పండుగ చేసుకోవాలనే ఉద్దేశంతోనే ఇక్కడికి వచ్చానని, మీ అందరితో కలిసి పండుగ జరుపుకోవడం నా పూర్వజన్మ సుకృతమన్నారు. అణుకు గ్రామానికి ఏం కావాలో అన్నీ చేస్తానని హామీ ఇచ్చారు. మీ పిల్లలు చక్కగా చదువుకుని మంచి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. 2014 నుంచి 2019 వరకు గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, అణుకు గ్రామంలో రేషన్ డిపో, త్వరలో సెల్ టవర్ నిర్మాణం చేస్తామని మంత్రి తెలిపారు. గ్రామంలో ఇంటర్, డిగ్రీ వరకు చదువుకున్న 20 మంది పిల్లలు ఉన్నారని, అందులో ఇద్దరు బాలికలు డిగ్రీ చదవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. అంతేకాకుండా అణుకులో ప్రతి ఇంటికి ఒక బాత్‌రూమ్ నిర్మాణం చేపట్టాలని అధికారులను హోమ్ మంత్రి అనిత ఆదేశించారు.

# ఆక్రమణలు, కాలుష్యంతో కునారిల్లుతున్న నేరి కాలువ

**రైతుల పంటలపై తీవ్ర ప్రభావం**



**సూళ్లూరుపేట:** నియోజకవర్గంలోని మూడు మండలాలకు వేలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే నేరి కాలువ ప్రస్తుతం ఆక్రమణలు, కాలుష్యంతో అస్తవ్యస్తంగా మారింది. దొరవారిసత్రం మండలంలో ప్రారంభమై సూళ్లూరుపేట పట్టణం మీదుగా తడ మండలంలోని పలు గ్రామాలకు సాగుతూ, సుమారు 17.5 కిలోమీటర్ల మేర ప్రవహించి కారిజాత చెరువులను కలిపే ఈ కాలువ రైతాంగానికి జీవనాడిగా నిలుస్తోంది. అయితే ఇటీవలి కాలంలో సూళ్లూరుపేట పట్టణంలోని హోటళ్ల నుంచి వెలువడుతున్న వ్యర్థాలు, భవనాల డ్రెయిన్ నీరు నేరుగా నేరి కాలువలోకి చేరుతుండటంతో పరిస్థితి తీవ్రంగా మారింది. కలుషిత నీటితో రైతులు కష్టపడి సాగు చేసిన పంటలు నాశనమవుతున్నాయి. ఇదే కాకుండా కారిజాత చెరువుల్లో చేపలు మరణించడంతో పాటు, విదేశీ పక్షులు సైతం ప్రాణాలు కోల్పోయాయి. పక్షులకు పోస్టుమార్టం నిర్వహించిన అధికారులు కలుషిత నీరే మరణాలకు కారణమని నిర్ధారించినప్పటికీ, పట్టణం నుంచి కాలువలోకి వచ్చే మురుగు నీటి మార్గాలను అడ్డుకునే చర్యలు మాత్రం చేపట్టలేదు. కాలువ చుట్టూ అక్రమ నిర్మాణాలు పెరిగిపోవడంతో భవిష్యత్తులో సాగునీరు సహజసిద్ధంగా ప్రవహించే మార్గాలు పూర్తిగా మూసుకుపోయే ప్రమాదం నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో నేరి కాలువ అభివృద్ధికి రూ.28.2 కోట్లు కేటాయించి, మూడు మండలాల్లోని 17 చెరువులకు సాగునీరు చేరేలా ప్రణాళికలు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం ఎఫ్‌డీఆర్ నిధుల ద్వారా రూ.39 లక్షలు మంజూరు చేసి కాలువకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అయితే కాలంగి నది--నేరి కాలువ మధ్య నిర్మించాల్సిన రిటైనింగ్ వాల్‌ను మరోవైపు నిర్మించడంపై రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా నిర్మాణం జరిగితే రానున్న వర్షాకాలంలో మళ్లీ కట్ట తెగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరిస్తున్నారు. నేరి కాలువ కోసం వేల కోట్లు మంజూరు చేస్తున్నప్పటికీ, మున్సిపాలిటీ పరిధిలోని మురుగు నీరు కాలువలో కలవకుండా అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేరి కాలువను ఆక్రమణలు, కాలుష్యాల నుంచి రక్షించి, సాగునీటి వ్యవస్థను కాపాడే దిశగా తక్షణమే సమగ్ర చర్యలు చేపట్టాలని రైతాంగం కోరుతోంది.

# పోలీసుల చాకచక్యంతో గంజాయి కేసు నిందితుడు ఢిల్లీలో అరెస్ట్

**నాలుగేళ్ల తర్వాత దొరికిన నిందితుడు : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా**




**అనకాపల్లి:** గంజాయి కేసుల్లో నిందితులు ఎక్కడ దాక్కున్నా చట్టం నుండి తప్పించుకోలేరని పోలీసులు నిరూపించారు. గత నాలుగేళ్లుగా పోలీసుల కళ్లు గప్పి తిరుగుతున్న ఒక కీలక నిందితుడిని నాతవరం పోలీసులు అత్యంత చాకచక్యంగా ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం మీడియాతో మాట్లాడారు. నాతవరం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో నమోదైన క్రైమ్ నంబర్ 123/22 ఎన్ డి పి ఎస్ చట్టం కేసులో పశ్చిమ ఢిల్లీకి చెందిన రోహిత్ కుమార్ (39), తండ్రి ప్రీతమ్ సింగ్, ప్రధాన నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. కేసు నమోదైనప్పటి నుండి ఇతను పరారీలో ఉన్నాడని ఇతనిపై కోర్టు నాన్ బైలబుల్ వారెంట్ కూడా జారీ చేసిందని పేర్కొన్నారు.నాతవరం ఎస్సై వై.తారకేశ్వర రావు సిబ్బందితో కలిసి ప్రత్యేక నిఘా పెట్టారని తెలిపారు. నిందితుడు ఢిల్లీలో ఉన్నట్లు పక్కా సమాచారం అందడంతో, అక్కడికి చేరుకున్న పోలీస్ బృందం నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని, నాతవరం పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వచ్చి శుక్రవారం రిమాండ్ కు తరలించారని తెలిపారు. క్లిష్టమైన ఈ కేసులో నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఎస్సై తారకేశ్వరరావు, పోలీస్ కానిస్టేబుల్ టి.సన్యాసిరావులను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. గంజాయి రవాణాదారులపై ఉక్కుపాదం మోపుతామని ఈ సందర్భంగా ఎస్పీ హెచ్చరించారు. గంజాయి కేసుల్లో నిందితులు ఎక్కడున్నా తప్పించుకునే అవకాశం లేదు. అక్రమ గంజాయి ఇతర మత్తు పదార్థాల రవాణా చేసేవారు, సేవించేవారు తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ స్పష్టం చేశారు.

# క్రీడలతో శరీర దారుఢ్యం.. క్రమశిక్షణ

**కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్య లత**

**ఘనంగా ప్రారంభమైన సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ లీగ్**

**సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలు**






**విజయవాడ:** క్రీడలు శరీర ధారుడ్యానికే కాకుండా క్రమ శిక్షణ అలవారుచుకోవడానికి క్రీడలు దోహదపడతాయని కృష్ణా వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ జె.నవీన లావణ్య లత అన్నారు. ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని టెన్నిస్ కాంప్లెక్స్ లో ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్ జోన్ అస్మిత ఖేలో ఇండియా సాఫ్ట్ టెన్నిస్ మహిళల లీగ్ ను శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అస్మిత అంటే ఆత్మవిశ్వాసం, స్వతంత్రత, వ్యక్తిత్వం అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో ఉంటే క్రీడలో ఎదుగుదలకు ఆస్కారం ఉంటుందని, సాఫ్ట్ టెన్నిస్ రాష్ట్రంలో ఎంతో ప్రాచుర్యం పొందిందని ఆమె అన్నారు. విశిష్ట అతిథి 26వ డివిజన్ కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి మాట్లాడుతూ సౌత్ జోన్ అస్మిత విజయవాడలో నిర్వహించడం ఎంతో సంతోషకరమని, కేంద్ర ప్రభుత్వం మహిళాభివృద్ధికి ఈ టోర్నమెంట్ లు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. టోర్నీ కో ఆర్డినేటర్ డి.నవీన్ కుమార్ మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ మూడు విభాగాల్లో లీగ్ జరుగుతుందన్నారు. సింగిల్స్, డబల్స్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ టోర్నమెంట్ లో మొదటి ఎనిమిది స్థానాల్లో నిలిచిన వారు అహ్మదాబాద్ లో జరుగనున్న జాతీయస్థాయి అస్మిత సాఫ్ట్ టెన్నిస్ లీగ్ లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు కార్యదర్శి సెంబనన్, ఒడిశా కార్యదర్శి అజామ్, ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ కోశాధికారి ఐ.రమేష్, 26వ డివిజన్ టీడీపీ ఇంచార్జ్ వల్లభనేని సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదం

**ఆటో డ్రైవర్ మృతి ఇద్దరు కార్మికులకు తీవ్ర గాయాలు**



**తడ:** బోడిలింగలపాడు వద్ద శుక్రవారం సాయంత్రం జాతీయ రహదారిపై జరిగిన ఆటో ప్రమాదం విషాదాన్ని మిగిల్చింది. సుమారు సాయంత్రం 3.30 నుంచి 3.45 గంటల మధ్య తడ నుంచి సూళ్లూరుపేట వైపుకు ఖాళీగా వెళు_న్న ఆటో, ఎస్ఆర్ఎం హోటల్ సమీపంలోని కలవర్ట్ దాటిన అనంతరం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో డివైడర్ వద్ద గడ్డి కోస్తూ పని చేస్తున్న ఇద్దరు కార్మికులను ఆటో బలంగా ఢీకొంది. ప్రమాద సమయంలో ఆటో డ్రైవర్ వాహనం నుంచి కింద పడిపోగా, అదుపుతప్పిన ఆటో వెనుక టైర్ డివైడర్‌పై ఎక్కి సుమారు 150 మీటర్లు దూసుకెళ్లి సిగ్నల్ పోల్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా, డివైడర్‌పై పని చేస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని వలిపి వెంకట రమణయ్య (సూపర్వైజర్), చెంబెటి సురేష్ (గడ్డి కోసే కార్మికుడు)గా గుర్తించారు. సమాచారం అందుకున్న వెంటనే సీఐ ఎం. మురళీకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ముగిసిన మకరజ్యోతి ఉత్సవాలు

### స్పీకర్ అయ్యన్న పాత్రుడికి ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారం

**అనకాపల్లి :** అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో మకరజ్యోతి ఉత్సవాలు ముగిశాయి. స్థానిక ఐదు రోడ్ల కూడలి నుంచి కృష్ణ బజార్, వేంకటేశ్వర స్వామి ఆలయం మీదుగా రథోత్సవం సాగింది. ఈసందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయంలో శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు సతీసమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సినీ సంగీత దర్శకుడు కోటి, అనకాపల్లి ఎంపీ రమేష్ హాజరయ్యారు.ఆ తర్వాత ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో అయ్యన్నపాత్రుడుకి ఆంధ్ర సారస్వత పరిషత్తు.. ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారంతో సత్కరించింది. పరిషత్తు అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్ మూడో తెలుగు మహాసభల తీర్మానాల ప్రతులను అయ్యన్నపాత్రుడుకి అందజేశారు. సంగీత దర్శకుడు కోటి తన పాటలతో అలరించారు. ఈ పురస్కార ప్రదానం కార్యక్రమంలో పలువురు స్థానిక ఐఏఎస్, ఐపీఎస్‌లు, యూపీ అడిషనల్ డీఐజీ కిల్లాడ సత్యనారాయణ, సత్య సాయి జిల్లా జాయింట్ కలెక్టర్ భరద్వాజ్, పరిషత్తు సభ్యులతోపాటు పలువురు పాల్గొన్నారు.

# తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చోరీలు

### ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసిన పోలీసులు

**అనంతపురం :** తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేసినట్లు శ్రీసత్య సాయి జిల్లా పెనుకొండ డిఎస్పి తెలిపారు. డియస్పి నరసింగప్ప తెలిపిన వివరాల మేరకు.. సోమందేపల్లి పెనుకొండ, గోరంట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని ఈ దొంగలు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. చోరీ కేసులు నమోదు చేసి ప్రత్యేక పోలీసులు బృందం దర్యాప్తు చేపట్టిందన్నారు. గోరంట్ల మండలం పాలసముద్రం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న అనంతపురం కు చెందిన కోటయ్య, శాలి అనే ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా మూడు మండలాల్లో చేసిన వరుస చోరీలకు పాల్పడింది వారేనని గుర్తించారు. 8 ఇళ్లలో దొంగతనాలం చేసింది ఈ ఇద్దరే అని పోలీసులు తెలిపారు. అరెస్ట్ చేసిన వారి నుంచి రూ.30 లక్షల విలువచేసే బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన వివరించారు. అనంతరం నిందితులను పెనుకొండ కోర్టులో హాజరు పర్చారు. చోరీ కేసులను చేదించిన పోలీసులను డిఎస్పి అభినందించారు.

# వైజాగ్ షాపింగ్ మాల్‌లో మహిళ బ్యాగ్ చోరీ

### 24 గంట్లోనే చోరీని ఛేదించిన పోలీసులు

**విశాఖపట్నం :** సంక్రాంతి పండుగ రోజున గాజువాకలో చోరీ జరిగింది. ఈ చోరీని 24 గంటల్లోనే గాజువాక క్రైమ్ పోలీసులు ఛేదించారు. సంక్రాంతి సందర్భంగా వైజాగ్ షాపింగ్ మాల్‌లో ఏ వస్తువైనా రూ.180కే అంటూ భారీ సేల్‌ను ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో ఓ మహిళ షాపింగ్ మాల్ లోపలికి వెళ్లే సమయంలో తన బ్యాగ్‌ను సెక్యూరిటీ వద్ద ఉంచింది. అయితే.. ఓ గుర్తు తెలియని వ్యక్తి తన బ్యాగ్‌తో పాటు సెక్యూరిటీ వద్ద ఉంచిన మరో బ్యాగ్‌నూ దొంగలించాడు. ఆ బ్యాగ్‌లో రూ.50 వేల నగదుతో పాటు 11 తులాల బంగారం ఉన్నట్టు గుర్తించిన సదరు వ్యక్తి.. దాన్ని తనతో పాటు తీసుకెళ్లిపోయాడు. తన బ్యాగ్ కనిపించకపోవడంతో వెంటనే ఆ మహిళ గాజువాక క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు వైజాగ్ షాపింగ్ మాల్‌లో సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు. ఆ ఫుటేజీ ఆధారంగా నిందితుడు ఉపయోగించిన వాహనాన్ని ట్రాక్ చేశారు. ఒక్కరోజు వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేశారు పోలీసులు. దొంగలించిన బ్యాగ్‌ను శ్మశానవాటికలో దాచినట్లు విచారణలో తెలిపాడు నిందితుడు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని ఆ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. బ్యాగ్‌లో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు అలాగే ఉన్నట్లు గుర్తించారు. అనంతరం.. బాధితురాలికి తిరిగి బ్యాగ్‌ను అప్పగించారు గాజువాక క్రైమ్ పోలీసులు. పండుగ పూట బంగారం, నగదును గుర్తుతెలియని వ్యక్తి దొంగలించడంతో బాధితురాలు తీవ్ర భయాందోళనకు గురైంది. చివరకు పోలీసులు ఎంతో చాకచక్యంగా కేసును ఛేదించి.. బ్యాగ్‌ను తిరిగి అప్పగించడంతో బాధితురాలు హర్షం వ్యక్తం చేసింది. ఈ విధంగా సమర్థవంతంగా కేసును ఛేదించిన గాజువాక క్రైమ్ పోలీసుల ప్రతిభకు విశాఖపట్నం సిటీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందనలు తెలిపారు.

# పందెంకోళ్లకు కోట్లల్లో ధరలు

### రూ.1 కోటి 53 లక్షల భారీ పందెం



**భీమవం :** సంక్రాంతి సందర్భంగా గోదావరి జిల్లాల్లో కోడి పందాలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో రెండో రోజు నిర్వహించిన కోడి పందాలు భారీగా సాగాయి. లక్షలాది రూపాయలు పందాల్లో పెట్టగా, కోట్ల రూపాయలు చేతులు మారినట్లు సమాచారం. తాడేపల్లిగూడెంలోని పైబోయిన వెంకటరామయ్య బరిలో నిర్వహించిన కోడి పందెంలో ఏకంగా రూ.1 కోటి 53 లక్షల భారీ పందెం కుదిరింది. ఈ పందెం గుడివాడ ప్రభాకర్ సేతువ మరియు రాజమండ్రికి చెందిన రమేష్ డేగ మధ్య జరిగింది. హోరాహోరీగా సాగిన పోటీలో చివరకు రాజమండ్రి రమేష్ డేగ విజయం సాధించింది. ఈ భారీ పందెన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు పందెం రాయుళ్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాలతో పాటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, తెలంగాణ ప్రాంతాల నుంచి కూడా పందెం ప్రేమికులు భారీగా వచ్చారు. దీంతో బరులు కిటకిటలాడాయి. సంక్రాంతి కోడిపందాలు గోదావరి జిల్లాల్లో సంప్రదాయంగా నిర్వహించబడుతుండగా, ఈ ఏడాది మరింత ఉత్సాహంగా సాగుతున్నాయి. పందాల్లో వేలాది కోళ్లు నేలకొరగగా, కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. పందెం రాయుళ్లు భారీ మొత్తాల్లో పందాలు కడుతూ ఉత్సాహంగా పాల్గొన్నారు. పోలీసుల నిఘా ఉన్నప్పటికీ, కోడిపందాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నట్లు సమాచారం. మొత్తం మీద సంక్రాంతి పండుగ వాతావరణంలో కోడి పందాలు గోదావరి జిల్లాల్లో ప్రధాన ఆకర్షణగా మారాయి.

# ఘనంగా పార్వేట ఉత్సవం

**తిరుమల:** శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పార్వేటి ఉత్సవం మకర సంక్రమణకు మరుసటిరోజున అనగా కనుమ పండుగనాడైన శుక్రవారం తిరుమలలో అత్యంత ఘనంగా జరిగింది. అదేరోజున గోదా పరిణయోత్సవం కూడా కన్నుల పండుగగా నిర్వహించారు. తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ శ్రీ గోదాదేవి చెంత నుండి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. ఈ మాలలను శ్రీవారి మూల మూర్తికి అందంగా అలంకరించారు. శుక్రవారం స్వామివారికి ప్రాతఃకాలారాధన పూర్తి అయిన తరువాత శ్రీమలయప్పస్వామివారు తిరుచ్చిలో వేంచేసారు. వారి వెంటనే మరో తిరుచ్చిపై శ్రీ కృష్ణస్వామి వేంచేసారు. అనంతరం పార్వేట మండపమునకు వెళ్ళి, ఆ మండపమునందు పుణ్యాహము జరిగిన పిమ్మట మంచెలో వేంచేసారు. శ్రీస్వామివారికి ఆరాధనము, నివేదనము జరిగి హారతులు జరిగాయి. శ్రీకృష్ణస్వామివారిని మాత్రం సన్నిధి గొల్లపూజ చేసిన చోటుకు వేంచేపుచేసి పాలువెన్న ఆరగింపు అయి హారతి జరిగిన పిమ్మట శ్రీమలయప్పస్వామివారి సన్నిధికి వెళ్ళారు. తరువాత యాదవ భక్తుడు సమర్పించిన పాలు వెన్న శ్రీమలయప్పస్వామివారికి నివేదనము హారతి అయి గొల్లకు బహుమానము జరిగింది. తరువాత శ్రీమలయప్పస్వామివారు ముందునకు కొంత దూరము పరుగెత్తి వారి తరపున అర్చకులు ఈటె వేసిన పిమ్మట



వెనుకకు వచ్చారు. ఇట్లు మూడుసార్లు జరిగింది. స్వామివారి వేటను తిలకించడానికి పారువేట మండపానికి విశేషంగా భక్తులు విచ్చేసారు. శ్రీమలయప్పస్వామివారు ఉత్సవం పూర్తయి మహాద్వారమునకు వచ్చి హాతీరాంజీవారి బెత్తమును తీసుకొని సన్నిధిలోనికి వేంచేసారు. ఇంతటితో ఎంతో వేడుకగా జరిగే పారువేట ఉత్సవం ఘనంగా ముగిసింది. ఈ ఉత్సవంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.





# రొటేషన్.. రిజర్వేషన్.. రాజకీయం!

ప్రతిపాదిత రిజర్వేషన్లపై చట్టబద్ధమైన విశ్లేషణ: తెలంగాణ పురపాలక చట్టం-2019 లోని నిబంధనల మేరకు ఆదిలాబాద్ పురపాలక సంఘం ఎన్నికల ప్రక్రియలో రిజర్వేషన్ల అంశం కీలకంగా మారింది. జనాభా ప్రాతిపదికన షెడ్యూల్డ్ కులాలు, తెగలకు ప్రాధాన్యతనిస్తూ, వెనుకబడిన తరగతుల ప్రత్యేక కమిషన్ సిఫార్సుల మేరకు ఆయా వర్గాలకు 34 శాతం వరకు కోటాను అమలు చేయాల్సి ఉంటుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 50 శాతం మహిళా ప్రాతినిధ్య నిబంధన అమలు చేయాల్సి ఉండటంతో, రొటేషన్ పద్ధతిలో గతంలో సాధారణ స్థానాలుగా ఉన్న వార్డులు ఈసారి రిజర్వుడు కేటగిరీలోకి మారే అవకాశం కనిపిస్తోంది. మొత్తం 49 వార్డుల భవిష్యత్తును నిర్ణయించే ఈ ప్రక్రియలో రాజకీయ సమీకరణల కంటే రాజ్యాంగబద్ధమైన గణాంకాలే నిర్ణయాత్మక పాత్ర పోషించనున్నాయి. జిల్లా పాలనాధికారి పర్యవేక్షణలో నిర్వహించబోయే లాటరీ ప్రక్రియ అభ్యర్థుల రాజకీయ ప్రస్థానాన్ని ప్రభావితం చేసే చట్టపరమైన పరిణామంగా పరిగణించవచ్చు.




### గణాంకాల ప్రాతిపదికన వార్డుల వర్గీకరణ

పురపాలక పరిపాలన విభాగం జారీ చేసే తాజా మార్గదర్శకాల ప్రకారం ఆదిలాబాద్ పురపాలక రిజర్వేషన్ల ముసాయిదా శాస్త్రీయంగా రూపొందాల్సి ఉంది. పట్టణంలోని మొత్తం ఓటర్లలో మహిళల సంఖ్య గణనీయంగా ఉన్న నేపథ్యంలో, సుమారు 25 వార్డులు వారి ప్రాతినిధ్యం కిందకు వచ్చే వీలుంది. చట్టంలోని 7వ నిబంధన ప్రకారం రొటేషన్ విధానాన్ని అనుసరిస్తూ, గత ఎన్నికల్లో అవకాశం దక్కని సామాజిక వర్గాలకు ప్రాధాన్యత కల్పించడం చట్టబద్ధమైన ప్రక్రియ. ముఖ్యంగా వార్డు సంఖ్య 14, 49 వంటి ప్రాంతాల్లో జనాభా మార్పుల దృష్ట్యా, అవి రిజర్వుడు కేటగిరీలోకి మారే అవకాశాలను కొట్టిపారేయలేము. వెనుకబడిన తరగతుల ప్రత్యేక కమిషన్ అందించిన గణాంకాల ప్రకారం, వార్డు సంఖ్య 43, 44 వంటి చోట్ల 34 శాతం కోటా అమలుకు చట్టపరమైన ఆస్కారం ఉంది. ఈ కేటాయింపులు పారదర్శకంగా జరిగినప్పుడే ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వసనీయత నెలకొంటుంది.

### రాజకీయ సమీకరణలు - చట్టపరమైన సవాళ్లు

రాజకీయ కోణంలో పరిశీలిస్తే, రిజర్వేషన్ల మార్పుతో ఆదిలాబాద్‌లోని ప్రధాన పార్టీలు తమ వ్యూహాలను పునః సమీక్షించుకోవాల్సిన అనివార్యత ఏర్పడవచ్చు. రొటేషన్ విధానం అమలులోకి వస్తే, దశాబ్దాలుగా ఒకే వార్డుపై పట్టు సాధించిన నేతలు చట్టపరమైన నిబంధనల దృష్ట్యా కొత్త మార్గాలను వెతుక్కోవాల్సి ఉంటుంది. సాధారణ స్థానాల సంఖ్య తగ్గే అవకాశం ఉన్నందున, రిజర్వుడు వార్డులలో సామాజిక సమీకరణలకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేయడం పార్టీలకు సవాలుగా మారనుంది. నేడు నిర్వహించబోయే లాటరీ ప్రక్రియ ముగిసిన తర్వాతే క్షేత్రస్థాయిలో అసలైన చిత్రం స్పష్టమవుతుంది. ఒకవేళ కేటాయింపులపై అభ్యంతరాలు ఉంటే, నిర్ణీత గడువులోపు చట్టప్రకారం అప్పీల్ చేసుకునే హక్కును కూడా నిబంధనలు కల్పిస్తున్నాయి. ఏదేమైనా, ఈ రిజర్వేషన్ల ప్రక్రియ పట్టణ సమగ్ర అభివృద్ధికి మరియు సామాజిక న్యాయానికి పునాది వేస్తుందని ఆశించవచ్చు.

ఫిరోజ్ ఖాన్
సీనియర్
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్
9640466464



# మహారాష్ట్రలో ఎంఐఎం గెలుపుపై సంబరాలు

**సమయం న్యూస్, కరీంనగర్:** మహారాష్ట్రలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో విజయదుందుభి మోగించిన నేపథ్యంలో ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఎంఐఎం పార్టీ కార్యాలయం ఎదుట శుక్రవారం రాత్రి విజయోత్సవ సంబరాలు నిర్వహించారు టపాసులు కాల్చి, బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచిపెట్టారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ మొన్న జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ 5గురు ఎమ్మెల్యేలను సీమాంచల్ ప్రాంతంలో గెలుచుకుందని, నేటి ఫలితాలలో మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో వందలాది కార్పొరేటర్ లను, కౌన్సిలర్లను గెలుచుకుందని, ఇదే ఊపును కొనసాగిస్తూ, రేపటి రోజున తెలంగాణలో జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ తెలంగాణ వ్యాప్తంగా అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలను కైవసం చేసుకుని సత్తా చాటుతుందని చెప్పారు ఎంఐఎం పార్టీ మున్సిపల్ ఎన్నికల్లో ఏరాజకీయ పార్టీతో పొత్తు ఉండదన్నారు. సొంతంగా కరీంనగర్ పట్టణంలో పోటీ చేసి అత్యధిక కార్పొరేటర్ గెలుచుకొని మున్సిపల్





కార్పొరేషన్ పై ఎంఐఎం జెండా ఎగురవేస్తామన్నారు. ముస్లింల, దళితుల, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలకు తోడ్పాటు అందించడమే లక్ష్యంగా ఎంఐఎం పార్టీ కరీంనగర్లో గడచిన ఆరు సంవత్సరాలుగా విశేషమైన సేవలను, దారుస్సలాం వేదికగా అందిస్తుందన్నారు. ఒకే ఒక్క అవకాశాన్ని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ లో దళిత, బహుజన, బడుగులు, మైనారిటీలు అందరూ ఏకమై ఎంఐఎం పార్టీని అత్యధిక కార్పొరేటర్లను గెలిపిస్తే, కరీంనగర్ పట్టణాన్ని దేశంలోనే నెంబర్ వన్ కార్పొరేషన్ గా తీర్చిదిద్దుతామన్నారు. కరీంనగర్ నగర వాసులకు అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్, బిజెపి వంటి అన్ని పార్టీలకు ప్రజలు అవకాశం ఇచ్చారు. ఈఒక్కసారి ఎంఐఎం పార్టీ అభ్యర్థులకు అవకాశం ఇవ్వాలని నగర ప్రజలకు వినబరపూర్వకంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మీద అబ్బాస్ సమీ, ఎంఐఎం నాయకులు బర్కత్ అలీ, ఖమరుద్దీన్, ఇబ్రహీం, అఖీల్ ఫిరోజ్, అలిబాబా, మొహసిన్ మోయుద్దీన్, అరిఫ్ అహ్మద్, సాజిద్, మజారోద్దీన్, సాజిద్ మజీద్, సమీ, జమ్మూ, అబ్దుల్లా అసిమ్ తదితరులు పాల్గొన్నారు.